



www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI






సోమవారం | 23-3-2020 | పేజీలు: 10 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 338 | శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి మ. 12.31 వరకు తదుపరి అమావాస్య; నక్షత్రం: పూర్వాభాద్ర రా. 1.22 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: శే. ఉ. 7.25; దుర్ముహూర్తం: మ. 12.46-1.35, మ. 3.11-3.59; అమృతఘడియలు: సా. 4.23-6.11; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.21; సూర్యాస్తమయం: 6.24 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore


విశాఖ బీచ్ రోడ్ నిర్మానుష్యం...

# ఇంట్లోనే ఇండియా!

## దేశవ్యాప్తంగా జనతా కర్ఫ్యూ విజయవంతం

రాష్ట్రమంతా నిర్మానుష్యం.. పల్లెల్లోనూ అదే వాతావరణం.. గడపదాటని ప్రజలు.. రోజంతా స్వీయ నిర్బంధం

తెరుచుకోని షాపులు.. పట్టణాల నుంచి గ్రామాల దాకా అదే స్ఫూర్తి.. తిరగని బస్సులు, రైళ్లు, వాహనాలు

టోల్ గేట్లు, సరిహద్దులూ మూసివేత.. నిర్మానుష్యంగా రోడ్లు.. 5 గంటలకు మార్మోగిన జనం చప్పట్లు

వైద్య, పోలీసు సిబ్బందికి కృతజ్ఞతలు.. చప్పట్లు కొట్టిన గవర్నర్, సీఎం జగన్, విపక్ష నేత చంద్రబాబు

3, 8, 9, 10

# 31 దాకా లాక్‌డౌన్

"ప్రజలెవరూ 14 రోజుల పాటు ఇళ్లలో నుంచి కదలొద్దు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు. 31 వరకు అందరూ ఇళ్లలో కూర్చోగలిగితే కరోనా వైరస్‌ను తరిమికొట్టగలం. ఆ తర్వాత పరిస్థితులను సమీక్షించి తదుపరి నిర్ణయం తీసుకుంటాం. ప్రభుత్వ, ప్రైవేటు రవాణా నిలిపివేస్తున్నాం. ఆటోలు, టాక్సీలను అత్యవసర సేవల కోసమే వాడాలి. వాటిలో ఇద్దరి కంటే ఎక్కువ మందిని ఎక్కించుకోకూడదు. అత్యవసర సరుకుల కొనుగోలుకు ఇంటి నుంచి ఒకరే వెళ్లాలి. నీళ్లు, కూరగాయలు, పాలు, విద్యుత్, టెలికాం, మందుల షాపులు, పెట్రోలు బంకులు అందుబాటులో ఉంటాయి. ప్రజలు పరిస్థితులను గమనిస్తున్నారు. అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను.

- సీఎం జగన్


కరోనా నివారణకు వైద్య, పారిశుద్ధ్య, పోలీసు సిబ్బంది చేస్తున్న కృషిని అభినందిస్తూ చప్పట్లు కొడుతున్న సీఎం జగన్

## రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ!

### మరో 9 రోజులు ఇళ్లలోనే

### స్థానికులకు సోకకుండా ఈ జాగ్రత్త

ప్రభుత్వ, ప్రైవేటు రవాణా నిలిపివేత.. అంతర్రాష్ట్ర సరిహద్దులు మూత

అత్యవసర సేవలు, నిత్యావసరాల షాపులకు మినహాయింపు

29న అందుబాటులో రేషన్.. 4న ప్రతి కుటుంబానికీ రూ.1,000

వలంటీర్లే ఇంటింటికీ వచ్చి ఇస్తారు.. టెన్త్ పరీక్షలు యథాతథం

నెలాఖరుదాకా ఆలయాలు, చర్చిలు, మసీదులు మూయాల్సిందే

ప్రతి నియోజకవర్గంలో 100 ఐసోలేషన్ పడకలు

జిల్లా కేంద్రాల్లో 200 చొప్పున.. అధికారులకు ఆదేశాలిచ్చాం

రాష్ట్రంలో 6 కేసులు నమోదు.. ఐసోలేషన్‌లో 10,091 మంది

బడ్జెట్ సమావేశాలూ ఉంటాయి.. సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రకటన

## కరోనాపై సమరం

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ కట్టడి కోసం ఈ నెల 31వ తేదీ వరకు రాష్ట్రాన్ని లాక్‌డౌన్ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. అత్యవసర సేవలు మినహా ఇతరత్రా సేవలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. నిత్యావసరాలు మినహా అన్ని దుకాణాలనూ మూసివేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని చెప్పారు. ఆదివారం సాయంత్రం ఆయన తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. మార్చి 31 వరకు ప్రజలందరూ తమ ఇళ్లకే పరిమితం కావాలని సూచించారు. 10 మంది కంటే ఎక్కువ మంది గుమిగూడొద్దని చెప్పారు. అంతర్రాష్ట్ర సరిహద్దులన్నింటినీ మూసేస్తున్నట్లు ప్రకటించారు. వ్యవసాయ కూలీలు పొలం పనులకు వెళ్లినప్పుడు తోటివారికి కనీసం మూడడుగుల దూరంగా ఉండేట్లు చూసుకోవాలన్నారు. 29వ తేదీ నాటికి పూర్తిగా రేషన్ అందుబాటులో ఉంటుందని, రేషన్‌తో పాటు కిలో కంది పప్పును ఉచితంగా అందిస్తామని చెప్పారు. ప్రతి

మిగతా 8వ పేజీలో...

### ఆరో కేసు నమోదు

## రాష్ట్రంలో రెండో దశ

8

మక్కా నుంచి వచ్చిన విశాఖ వాసి ద్వారా కుటుంబ సభ్యురాలికి పాజిటివ్

వ్యాప్తి విజృంభిస్తోందని ఆందోళన

విశాఖలో తొమ్మిది మందికి నెగటివ్

రాష్ట్రంలో 13 అనుమానిత కేసులు

విశాఖలో ఏడు.. కృష్ణాలో మూడు




ముంబై నుంచి వస్తున్న ఏపీవాసులను సంగారెడ్డి జిల్లా సరిహద్దుల్లో నిలువరించి వివరాలు అడుగుతున్న పోలీసులు

### ముంబై నుంచి వచ్చిన 39 మంది

## ఏపీ వాసులకు తెలంగాణలో నో ఎంట్రీ

9

సంగారెడ్డి జిల్లా సరిహద్దుల్లో బస్సు నిలిపివేత

## 31 వరకూ బస్సులు బంద్

సీఎం ప్రకటన తర్వాత పీటీడీ నిర్ణయం

9 రోజులు ఆగితే 120 కోట్ల నష్టం

## రాజ్యసభ ఎన్నికలు వాయిదా?

కేంద్ర ఎన్నికల కమిషన్ యోచన!

నేడు స్పష్టత వచ్చే అవకాశం



### నటుడు, దర్శకుడు విసు కన్నుమూత

2



### నేటి ఇంటర్ పరీక్ష వాయిదా

గ్రూప్-1, లెక్చరర్ పరీక్షలు కూడా

### ఎన్పీఆర్, జనగణన తొలి దశ వాయిదా?

9







చికిత్స పొందుతున్న జవాన్‌ను పరామర్శిస్తున్న ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్

### ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల పంజా

## 17 మంది జవాన్ల మృతి

మరో 15 మందికి తీవ్ర గాయాలు

బలగాలపై నక్సల్స్ మెరుపుదాడి

దండకారణ్యం రక్తసిక్తం

గ్రెనేడ్స్, రాకెట్ లాంచర్లతో బీభత్సం

'ఆపరేషన్ ప్రహార్'కు ప్రతీకారం

పట్టున్న చోట రెచ్చిపోయిన నక్సల్స్

చింతూరు/దుమ్ముగూడెం/రాయ్‌పూర్, మార్చి 22: దండకారణ్యం రక్తమోడింది. కూంబింగ్‌కు వెళ్లిన జవాన్లపై మావోయిస్టులు కాపుకాచి విరుచుకుపడ్డారు. ఏకంగా 17 మంది జవాన్లను పొట్టన పెట్టుకున్నారు. మరో 15 మంది జవాన్లు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ

మిగతా 2వ పేజీలో...

## 'క్వారంటైన్' కలకలం

క్వారంటైన్‌కు వెళ్లకుండా జనసమూహంలోకి..!

స్టాంప్ చూసి పట్టిస్తున్న జనం

కర్ఫ్యూ రోజు పలు ఘటనలు




9

### హోంకు చేరకుండా.. హోం క్వారంటైన్ ఎలా?

స్టాంపులతో అనుమానితుల అవస్థలు

శంషాబాద్ నుంచి ఇంటికి వెళ్లలేని దైన్యం

ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర వాసుల ఇక్కట్లు

ప్రభుత్వమే రవాణా ఏర్పాటు చేయాలి

లేదంటే హైదరాబాద్‌లోనే ఉంచాలి

ఆక్రోశిస్తున్న అనుమానితులు

## మృత్యు పాచిక?

### విదేశీ పెట్టుబడిదారులను పంపించే కుట్ర



9

వైరస్‌ను సృష్టించి.. ఏమీ చేయలేమని చేతులెత్తేశారు

భయంతో విదేశీ ఇన్వెస్టర్లు తమ వాటాలు అమ్ముకున్నారు

సరికొత్త వాదనలతో ముందుకొస్తున్న విశ్లేషకులు

సమర్థిస్తున్న యూరప్, అమెరికా పారిశ్రామికవేత్తలు

చైనా ముందే టీకా తయారు చేసిందన్న అనుమానాలు

న్యూఢిల్లీ, మార్చి 22: కరోనా వైరస్ చైనా పనే అని అమెరికా.. అమెరికా నుంచే మాకు వచ్చిందని చైనా ఆరోపణలు చేసుకుంటున్న తరుణంలో ఆసక్తికరమైన విశ్లేషణ ముందుకొచ్చింది. ఆర్థిక మాంద్యంలో ఉన్నా చైనా తమ దేశంలో ఉన్న విదేశీ పెట్టుబడిదారులను వట్టి చేతులతో పంపించడమే లక్ష్యంగా కరోనా నాటకం ఆడిందని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. ఈ వాదనను అమెరికా, ఐరోపా దేశాలకు చెందిన ఎంట్రప్రెన్యూర్లు సమర్థిస్తున్నారు. విశ్లేషకులు చెబుతున్న దాన్ని బట్టి.. కరోనా కల్లోలానికి ముందు చైనాలోని

మిగతా 10వ పేజీలో...

## భారత్‌లో మరో ముగ్గురు బలి

ఏడుకు పెరిగిన మృతుల సంఖ్య

348కి చేరిన పాజిటివ్ కేసులు

మహారాష్ట్రలో ఒక్కరోజే 10 మందికి

ఢిల్లీలో స్థానికంగా ఆరుగురికి కొవిడ్

తెలంగాణలో ఒక్కరోజే 6 కేసులు

## 3 లక్షలు దాటిన కరోనా కేసులు

మరణాల సంఖ్య 13 వేలకు పైనే

ఇటలీలో ఆగని మరణ మృదంగం

అమెరికాలో లక్షలాది మంది ఇళ్లలోనే



పరంజ్యోతి

# నమస్కారం.. మన సంస్కారం

ప్రపంచవ్యాప్తంగా ప్రబలిన కరోనా.. మరోసారి మన నమస్కారానికి మరింత విలువ పెంచింది. నిజానికి నమస్కారాన్ని మనం పలకరింపుగానే చూస్తూ ఉంటాం. దానికి పద్మపాదుడు 'నమః' అనగా 'త్యాగం' అనే అర్థం చెప్పాడు. నమస్కారం చేస్తూ తలవంచడం అంటే.. తన అహంకారం వదలిపెట్టి తనకు తానే తగ్గిపోయి వినమ్రతను ప్రకటించడం. నమస్కారాల్లో చాలా రకాలున్నాయి. సాష్టాంగ నమస్కారం.. అంటే శరీరంలోని ఎనిమిది భాగాలు నేలను తాకుతూ చేసేది. గురువులు, దేవతల ముందు సాష్టాంగ నమస్కారం చేయాలి. త్ర్యంగ నమస్కారం.. అంటే మూడు అంగాలతో చేసేది. ఇది కేవలం పలకరింపు కోసం చేసేది. దైవాన్ని చూసినప్పుడు.. రెండు చేతులనూ జోడించి తలపై నుంచి చేసేది కూడా త్ర్యంగ నమస్కారమే. దేవుడి ఊరేగింపు వెళ్తున్నప్పుడు.. దూరంగా ఉన్న స్వామిని తలచుకుని మనసారా చేసే నమస్కారమిది. "ఏకాంగం తు నమస్కారం శిరసైవ కృతాభవేత్" శిరస్సును మాత్రం వంచి చేసేది ఏకాంగ నమస్కారం. ఇది గౌరవంతో చేసేది. చేతులు హృదయంపై జోడించి తలను వంచి చేసే నమస్కారం ఇపుడు బాగా ప్రసిద్ధం. అన్ని రకాల పలకరింపులకూ ఈ నమస్కారమే చేస్తూ ఉంటాం. మనస్సుతో చేస్తే ఉత్తమ నమస్కారంగా, వాక్కుతో చేస్తే మధ్యమ నమస్కారంగా, శరీరంతో చేస్తే అధమ నమస్కారంగా కూడా శాస్త్రాలు పేర్కొన్నాయి. వీటిని వరుసగా బీజ, అంకుర, వృక్షాలుగా కూడా చెప్పడం జరిగింది. ఎంతటి శత్రువునైనా.. ఒక్క నమస్కారం ద్వారా ఆయుధం లేకుండా జయించే అవకాశం ఉంది. గుళ్లోకి వెళ్లినపుడు ఆ మూర్తిని దర్శించి హృదయంపై చేతులుంచి చేయడం అంతరాత్మకు నమస్కరించడమే. ఆత్మ, పరమాత్మల ఏకత్వాన్ని సూచిస్తుందిది.



*త్రీణి పంచ చ సప్తాని నవమ ద్వాదశ సంఖ్యయా*
*భక్త్యా కుర్యాన్నమస్కార మశ్వమేధ ఫలం లభేత్*

మూడు, అయిదు, ఏడు, తొమ్మిది, పన్నెండు సంఖ్యల్లో భక్తితో నమస్కరించేవారికి అశ్వమేధ ఫలం లభిస్తుందని దీని అర్థం. మన నమస్కారంలో శాస్త్రీయత, వైజ్ఞానికత రెండూ ఉన్నాయి. రెండు చేతులూ కలపడం ఏకత్వ భావనను సూచిస్తుంది. ఒకే చేయి కలపడమంటే సగం ప్రేమను ప్రకటించడమే. అలాగే పరమాత్మను స్మరించే యోగవిద్యలో కూడా ఒక కాలి తొడపై మరొక కాలు వేసి, రెండు చేతులూ అనుసంధానించి 'ధ్యానచక్రాన్ని' నిర్మిస్తాం. అప్పుడు శరీరం ఒక్కటైపోతుంది. నమస్కార ముద్రలో కూడా శరీరంలోని విద్యుత్తును ఏకోన్ముఖం చేసే విధంగా రెండు చేతులూ కలుపుతాం. మెదడులోని కుడి, ఎడమల ద్వంద్వ భావాన్ని కూడా నమస్కార ముద్ర ఏకత్వం వైపు తీసుకెళ్తుంది. శరీరం, ఆత్మ ఒక్కటే అనే ప్రతీక కూడా ఇందులో ఉంది. చేతుల్లోని నరాల ద్వారా ప్రవహించే ఆకాశ శక్తి మస్తిష్కం మొదలుకొని మనోవృత్తులతో కలిసి స్నాయువుల ద్వారా శరీరంలోకి చేరుతుండడం వల్ల ఒకరి నుండి మరొకరు రోగ, క్రిమిగ్రస్తులవుతారని మన మహర్షులు ఏనాడో దర్శించి నమస్కారం అనే సంస్కారాన్ని మనకు అందించారు.

**- డా.పి.భాస్కర యోగి**

## నేటి ఇంటర్ పరీక్ష వాయిదా

▸ గ్రూప్-1, లెక్చరర్ పరీక్షలు కూడా

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ నేపథ్యంలో సోమవారం(23న) జరగాల్సిన ఇంటర్ మీడియెట్ పరీక్షను వాయిదా వేశారు. ఈ నెల 31 వరకు రాష్ట్రంలో లాక్‌డౌన్ పాటించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో పరీక్షను వాయిదా వేసినట్టు ఇంటర్ బోర్డు సెక్రటరీ వి.రామకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇదిలావుంటే, ఏప్రిల్ 7 నుంచి జరగాల్సిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు కూడా వాయిదా పడ్డాయి. అదేవిధంగా జూనియర్ అసిస్టెంట్స్ పోస్టుల భర్తీకి ఈ నెల 30, 31 తేదీల్లో జరగాల్సిన పరీక్షలను, నాగార్జున వర్సిటీలో నిర్వహించాల్సిన కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టును వాయిదా వేశారు. ఇక, ఏప్రిల్ 3, 4 తేదీల్లో జరగాల్సిన డిగ్రీ లెక్చరర్స్ పరీక్షలను కూడా వాయిదా వేసినట్టు ఏపీపీఎస్సీ సెక్రటరీ ఆంజనేయులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## గవర్నర్ ప్రసంగంలో రాజధాని మార్పు ఉండకూడదు

▸ ఉంటే ఆయన మార్చవచ్చు: యనమల

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ రాష్ట్రానికి రాజ్యాంగాధిపతి అని.. బడ్జెట్ సమావేశాల ప్రసంగంలో ఆయన కొన్ని అంశాలు తొలగించవచ్చని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ఉన్న రాజధాని మార్పువంటి అంశాలను తన ప్రసంగంలో లేకుండా గవర్నర్ చూసుకోవాలని సూచించారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసే ప్రసంగంలో తనదైన మార్పులు చేసుకోవడానికి సర్వాధికారాలు ఉన్నాయన్నారు. గతంలో కూడా ఇలాంటి మార్పులు పలు సందర్భాల్లో జరిగాయని పేర్కొన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను కనీసం 15 రోజుల పాటు నిర్వహించాలన్నది నిబంధన అని, అదే ప్రకారం నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గవర్నర్ కూడా దానికి అనుగుణంగానే ఉభయసభల సమావేశానికి ఆదేశాలివ్వాలని సూచించారు. పంచాయతీరాజ్ చట్టం ఆర్డినెన్స్, కరోనా వైరస్-ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం, రాజధాని అమరావతి నుంచి మార్పు, స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ల తగ్గింపు, శాసనమండలి రద్దు, ప్రతిపక్షాలకు బెదిరింపులు, అభివృద్ధి కార్యక్రమాల్లో స్తబ్దత, సంక్షేమ పథకాల్లో కోత, పెట్టుబడులు తరలిపోవడం, యువతకు ఉద్యోగాల కల్పన లేకపోవడం తదితర అంశాలపై ఉభయసభల్లో చర్చించాల్సి ఉందన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల పంజా

# 17 మంది జవాన్ల మృతి



రాయపూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జవాన్లు

(మొదటి పేజీ తరువాయి)

స్థితిలో ఉన్నారు. ఇది జరిగింది శనివారం సాయంత్రమే అయినా బాహ్య ప్రపంచానికి తెలిసింది మాత్రం ఆదివారమే. కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న మావోయిస్టులు అదును చూసి జవాన్లను గట్టి దెబ్బ కొట్టారు. ఈ పరిణామంతో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఉలిక్కి పడింది. రాష్ట్రంలోని సుక్మా జిల్లా, చింతల్‌నార్ అటవీ ప్రాంతంలో మావోయిస్టు అగ్రనేతలు సమావేశమయ్యారన్న సమాచారంతో భద్రతా బలగాలు శుక్రవారమే కూంబింగ్‌కు వెళ్లాయి. బుర్కాపాల్, చింతల్‌నార్ పోలీసు క్యాంపుల్లో విధులు నిర్వర్తిస్తున్న డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, గ్రేహౌండ్స్ బలగాలు మొత్తం 251 మంది జవాన్లు కాలి నడకన శనివారం సాయంత్రానికి చింతల్‌నార్ అటవీ ప్రాంతమైన ఎలమగూడ ప్రాంతానికి చేరుకున్నారు. జవాన్ల రాకను ముందే పసిగట్టిన మావోయిస్టులు పక్కా ప్రణాళికతో కాపు కాచి మెరుపు దాడికి దిగారు. దీంతో జవాన్లు ఒక్కసారిగా ఖంగుతిన్నారు. వెనువెంటనే తేరుకుని మావోయిస్టులపై ఎదురు కాల్పులకు దిగారు. పక్కా ప్రణాళికతో ఉన్న మావోయిస్టులు గుట్టలపై అప్పటికే ఏర్పాటు చేసుకున్న సురక్షిత ప్రదేశాల నుంచి గ్రెనేడ్స్, రాకెట్ లాంచర్లు, అత్యాధునిక ఆయుధాలతో జవాన్లపై విరుచుకుపడ్డారు. దీంతో మావోయిస్టులదే పైచేయిగా మారింది. దాదాపు 2 గంటలపాటు ఇరు పక్షాల నడుమ హోరా హోరీ కాల్పులు జరిగినట్లు సమాచారం. ఈ కాల్పుల్లో 17 మంది జవాన్లు మృతి చెందారు. వీరిలో ఎస్టీఎఫ్ జవాన్లు ఐదుగురు, డీఆర్‌జీ జవాన్లు 12 మంది ఉన్నారు. మరో 15 మంది జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఎస్టీఎఫ్ జవాన్లు నలుగురు, డీఆర్‌జీ జవాన్లు 10 మంది ఉన్నారు. గాయపడిన జవాన్లను రాయపూర్ ఆసుపత్రికి తరలించారు. కాగా, భద్రతా బలగాలకు చెందిన ఏకే 47 సహా మొత్తం 16 అత్యాధునిక ఆయుధాలను మావోయిస్టులు లూటీ చేశారని డీజీపీ దుర్గేశ్ మాధవ్ తెలిపారు.

### సీఎం, మాజీ సీఎంల పరామర్శ

మావోయిస్టుల దుశ్చర్యను ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేష్ బగేల్ తీవ్రంగా పరిగణించారు. మావోయిస్టుల అణచివేతకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గాయపడి రాయపూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జవాన్లను సీఎం, మాజీ సీఎం రమణసింగ్‌లు పరామర్శించారు. ఘటనను అడిగి తెలుసుకున్నారు.

### ఆపరేషన్ ప్రహార్‌కు ప్రతీకారంగానే!

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఇటీవల 'ఆపరేషన్ ప్రహార్'తో మావోయిస్టులను అణచివేసే కార్యక్రమం చేపట్టింది. దీంతో జవాన్లు దండకారణ్యాన్ని జల్లెడ పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం జవాన్లు కూంబింగ్‌కు వెళ్లారు. అయితే ఆపరేషన్ ప్రహార్‌కు ప్రతీకారంగా మావోయిస్టు కేంద్ర కమిటీ ఛత్తీస్‌గఢ్‌లో ప్రత్యేక బెటాలియన్లను ఏర్పాటు చేసుకుంది. ఎప్పటికప్పుడు జవాన్ల సంచారాన్ని పసిగట్టి, పక్కా ప్రణాళికతో జవాన్లను దెబ్బకొట్టడం బెటాలియన్ పని. కాగా, సుక్మా కేంద్రంగా ఏర్పడ్డ మావోయిస్టు బెటాలియన్‌కు మావోయిస్టు అగ్రనేతల్లో ఒకరైన ఇడమ నాయకత్వం వహిస్తున్నాడు. తాజా ఘటనకు వ్యూహం రచించింది ఇడమేనని పోలీసులు భావిస్తున్నారు.

### ఇక్కడ నక్సల్స్‌దే పైచేయి

చింతల్‌నార్.. ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టులకు ఈ ప్రాంతం కేంద్ర బిందువు, ఇక్కడ మావోయిస్టులు గట్టి పట్టు సాధించారు. మూడంచెల గూఢచార వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. మావోయిస్టుల ప్రత్యేక బెటాలియన్లలో మొదటి బెటాలియన్ ఈ ప్రాంతంలోనే సంచరిస్తుందని సమాచారం. అంతేకాదు దండకారణ్యంలో మావోయిస్టు పార్టీ విస్తరించిన నాటి నుంచి ఇప్పటివరకు చింతల్‌నార్‌లో పలుమార్లు మావోయిస్టులు జవాన్లపై పైచేయి సాధించిన ఘటనలు ఉన్నాయి. 1988 జులైలోనే మావోయిస్టులకు పోలీసులకు నడుమ ఈ ప్రాంతంలో తొలిసారి ఎదురుకాల్పులు జరిగాయి. అప్పట్లో మావోయిస్టులే పైచేయి సాధించారు. 2010 మేలో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను ఏకకాలంలో పొట్టన పెట్టుకున్న ఘటన కూడా ఇక్కడే జరిగింది.



నా మీద గెలిచింది ఇతనే..
రేపు ఎన్నికల్లో ఎలా గెలుస్తాడో చూస్తా..!

### ఎండాకాలం

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| విశాఖపట్నం | 34.4 | 23.0 |
| హైదరాబాద్ | 35.7 | 22.4 |
| విజయవాడ | 36.0 | 25.4 |
| గుంటూరు | 36.3 | 25.6 |
| అనంతపురం | 38.1 | 24.1 |
| కర్నూలు | 39.1 | 24.1 |



### మరిన్ని చర్యలు అవసరం

కరోనా వైరస్ కట్టడికి ప్రధాని మోదీ తీసుకుంటున్న చర్యలకు మద్దతిస్తున్నా. అయినా, ప్రభుత్వం ఇంకా పూర్తి సన్నద్ధతతో లేదనిపిస్తోంది. రానున్న 3, 4 రోజుల్లో ప్రధాని మళ్లీ ప్రజల ముందుకొచ్చి మరిన్ని కఠిన సామాజిక, ఆర్థిక చర్యలు ప్రకటిస్తారని అనుకుంటున్నా. ఆయన ముందు మరో మార్గం లేదు.

**- పి.చిదంబరం, కాంగ్రెస్ సీనియర్ నేత**



### సేవలకు మేం సిద్ధం

కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా దేశంలో తాత్కాలిక వైద్య చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వెంటిలేటర్ల కొరత లేకుండా చూడాలి. మా కేంద్రాల్లో వెంటిలేటర్ల తయారీని తక్షణం ప్రారంభిస్తున్నాం. రిసార్టులను తాత్కాలిక వైద్య కేంద్రాలుగా మార్చేందుకు మహీంద్రా ఫౌండేషన్ ఒక నిధిని ఏర్పాటు చేస్తుంది.

**- ఆనంద్ మహీంద్రా, పారిశ్రామికవేత్త**

# అంగన్‌వాడీలకు పెద్ద కష్టం!

▸ కరోనా ఉపశమన చర్యల నుంచి మినహాయింపు ఇవ్వని ప్రభుత్వం
▸ 'టేక్ హోమ్ రేషన్' ఆదేశాలు రద్దు
▸ యథావిధిగా మధ్యాహ్న భోజనానికి ఆదేశం
▸ మరోవైపు కరోనా గుర్తింపు సేవలకు సిబ్బంది
▸ కేంద్రాల నిర్వహణ బాధ్యతపై ఆందోళన

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగన్‌వాడీలు ప్రమాదంలో పడ్డారు. కరోనాను నియంత్రించేందుకు ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించినా అంగన్‌వాడీలకు ఎలాంటి సెలవులు, మినహాయింపులు ఇవ్వలేదు. పైగా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రకటించిన 'టేక్ హోమ్ రేషన్'(లబ్ధిదారులకే నేరుగా ఆహార పదార్థాలు అందించడం)ను రద్దుచేసి సోమవారం నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మధ్యాహ్న భోజనం వండి వడ్డించాలని ఆదేశించారు. మరోవైపు, కరోనా వ్యాధిలక్షణాలున్న వారిని గుర్తించేందుకు అంగన్‌వాడీల సేవలను ఉపయోగించుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. ఏకకాలంలో రెండు భిన్నమైన ఆదేశాలు ఇవ్వడంతో తమతోపాటు కేంద్రాలకు వచ్చే చిన్నారుల పరిస్థితి ఏమిటని అంగన్‌వాడీలు, ఉద్యోగులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

రాష్ట్రంలో కరోనా నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోన్న సంగతి తెలిసిందే. కృష్ణా, విశాఖ, ప్రకాశం జిల్లాల్లో లాక్‌డౌన్ ప్రకటించాలని కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. అయితే, రాష్ట్రంలో దీన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మరోవైపు ఉద్యోగుల పనివేళలు, షిఫ్టుల విధానంపై ఉత్తర్వులు ఇచ్చింది. అయితే అంగన్‌వాడీలది ఇందుకు భిన్నమైన పరిస్థితి. టేక్ హోమ్ రేషన్(టీహెచ్‌ఆర్) కింద వారం, లేదా పదిరోజులకు సరిపడ ఆహారపదార్థాలను నేరుగా లబ్ధిదారులకు అందించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఉన్నతాధికారి శనివారం ఆదేశించారు. ఈ దిశగా అంగన్‌వాడీలు సిద్ధమవుతుండగా ఆదివారం మధ్యాహ్నం దీనికి పూర్తి విరుద్ధమైన ఆదేశమిచ్చారు. టేక్ హోమ్ రేషన్‌ను రద్దుచేస్తున్నామని, సోమవారం నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఆహారాన్ని వండి వడ్డించాలని ఆదేశించారు. దీనికి కొనసాగింపుగా మరో ఉత్తర్వు ఇచ్చారు. కరోనా లక్షణాలున్న వారిని గుర్తించేందుకు వైద్య, ఆరోగ్య కార్యకర్తలతోపాటుగా అంగన్‌వాడీలు కూడా వెళ్లాలని, ఈ సేవల్లో పాల్గొనాలన్నది దాని సారాంశం. ఇలా వెళ్తే ఈ కేంద్రాల్లో చిన్నారులు, ఇతర లబ్ధిదారులకు ఆహారపదార్థాలు వండి వడ్డించేవారు ఎవరు? వారి యోగక్షేమాలు చూసుకునేదెవరనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఓ వైపు కరోనా వ్యాప్తి భయంతో లాక్‌డౌన్‌లు ప్రకటిస్తూ, పాఠశాలలకు సెలవులు ఇస్తూ మరోవైపు అంగన్‌వాడీ కేంద్రాలను యథావిధిగా కొనసాగించాలని ఆదేశించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఉండే ఈ కేంద్రాలే అన్నింటికంటే సున్నితమైనవి. వీటి సంరక్షణకే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' ఓ ఉన్నతాధికారిని సంప్రదించగా తాము కూడా ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.



## మహాలక్ష్మిగా భ్రామరి

**శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు ఆరంభం**

శ్రీశైలం, మార్చి 22: శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు నిరాడంబరంగా ప్రారంభమయ్యాయి. కరోనా నేపథ్యంలో ఈ వేడుకలకు భక్తులను అనుమతించడం లేదు. మొదటిరోజు ఆదివారం భ్రమరాంబా దేవి మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. పూజలు, సేవల్లో అర్చకులు, వేద పండితులు, అధికారులు మాత్రమే పాల్గొన్నారు. వేడుకలను భక్తులు వీక్షించేందుకు వీలుగా దేవస్థానం యూట్యూబ్ ద్వారా ప్రసారం చేసింది. సాయంత్రం భ్రమరాంబ మల్లికార్జునులకు భృంగి వాహనసేవ జరిపించారు.



## శ్రీవారి ఆలయానికి భద్రత పెంపు

తిరుమల, మార్చి 22: తిరుమల శ్రీవారి ఆలయానికి టీటీడీ భద్రత పెంచింది. వారంరోజుల పాటు దర్శనాలు రద్దు చేయడంతో కొండ నిర్మానుష్యంగా మారింది. ఈ క్రమంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గొల్లమండపం, ఆలయం లోపల, పైభాగాలతో దాదాపు 10గార్డుల ద్వారా 50 మంది సిబ్బంది ఆయుధాలతో పహరా కాస్తున్నారు. వందమంది విజిలెన్స్, పోలీసులు, ఎస్పీఎఫ్ సిబ్బంది మాడవీధులు, ఆలయ పరిసరాల్లో నిఘా ఉంచారు. 12మందితో కూడిన రెండు సాయుధులైన ఆక్టోపస్ బృందాలు ఆలయంతో సహా అన్ని ప్రదేశాల్లో పటిష్ఠ భద్రత కల్పిస్తున్నారు. రెండు బ్యాటరీ వాహనాల్లో ఎస్పీఎఫ్ సిబ్బంది మాడవీధుల్లో తిరుగుతున్నారు. అలిపిరి నుంచి తిరుమలలోని బస్టాండు, వైకుంఠం క్యూకాంప్లెక్సులు, కాటేజీలు, యాత్రికుల వసతి సముదాయం, అఖిలాండం, అన్నప్రసాద భవనం, ఘాట్‌రోడ్లు, మఠాలు వంటి ప్రాంతాల్లో దాదాపు 500 మంది విజిలెన్స్, పోలీసు సిబ్బంది విధుల్లో ఉన్నారు. ఇక, జనతా కర్ఫ్యూతో ఆదివారమంతా తిరుమల స్థానికులు ఇళ్లకే పరిమితమయ్యారు. సాయంత్రం 5 గంటలకు వైద్యులు, పోలీసు సిబ్బందికి కృతజ్ఞతగా చప్పట్లతో అభినందనలు తెలిపారు.

### 31వరకు శ్రీవారి దర్శనం రద్దు?

తిరుమల, మార్చి 22: తిరుమల శ్రీవారి దర్శనం రద్దు నిర్ణయాన్ని ఈ నెల 31 వరకు పొడిగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కరోనా బారినపడకుండా ఇప్పటికే టీటీడీ 20- 27వరకు(వారం రోజులు) స్వామి దర్శనాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఘాట్‌రోడ్లను మూసేసి భక్తులను తిరుమలకు రాకుండా చర్యలు తీసుకున్నారు. శ్రీవారి కైంకర్యాలు ఏకాంతంగా నిర్వహిస్తున్నారు.

## వైసీపీ ఎల్పీ సమావేశం వాయిదా !

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు సోమవారం జరగాల్సిన వైసీపీ ఎల్పీ సమావేశం వాయిదా పడింది. కరోనా వైరస్ నివారణలో భాగంగా ప్రయాణాలు నివారించేందుకు వీలుగా ఈ సమావేశం వాయిదా వేసినట్లుగా ప్రభుత్వ చీఫ్‌విప్ శ్రీకాంత్‌రెడ్డి వివరించారు.

## విపత్కర సమయంలోనూ

# జగన్‌కు అదే కసి!

▸ కరోనాపై మీడియాతో భేటీ అయిందే ఒక్కసారి
▸ దానికీ కొందరు విలేకరులకే ఆహ్వానం
▸ అనుకూల మీడియాకే పిలుపు
▸ ప్రభుత్వ చర్యలు, జాగ్రత్తలు ప్రజలకు చేరాలన్న ఆలోచనే లేదు!

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని కరోనా కుదిపేస్తోంది. అన్ని దేశాలు, భారత్‌లోని అత్యధిక రాష్ట్రాల సీఎంలు దీనిపై అత్యంత నిబద్ధతతో పనిచేస్తున్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ తొలుత కరోనాను పట్టించుకోనవసరం లేదని మాట్లాడినా.. ఆ తర్వాత పరిస్థితి తీవ్రతను గమనించి దృక్పథం మార్చుకొని అన్ని చర్యలు తీసుకుంటున్నారు. సాధారణంగా ఎప్పుడూ విలేకరుల సమావేశమే పెట్టని ఆయన.. కరోనా వైరస్ నేపథ్యంలో ఇప్పటికి మూడుసార్లు విలేకరుల సమావేశాలు నిర్వహించారు. తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. కానీ ఇక్కడ మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ ఒకే ఒక్కసారి (ఈనెల 15న) విలేకరుల సమావేశం నిర్వహించారు. అందులో కూడా వివక్షే. కేవలం కొన్ని మీడియా సంస్థలనే ఆహ్వానించారు. సాధారణంగా ఇలాంటి విపత్కర సమయంలో మీడియాతో భేటీ అయినప్పుడు.. తీసుకున్న జాగ్రత్తలు, ప్రభుత్వపరంగా చేపడుతున్న చర్యలు, ప్రజలకు చేసే సూచనలు కీలకంగా ఉంటాయి. వాటిని ప్రజలకు చేరవేయాల్సి ఉంటుంది. కానీ ముఖ్యమంత్రి మాత్రం ఇలాంటి పరిస్థితుల్లో కూడా కొద్దిమంది మీడియా ప్రతినిధులనే ఆహ్వానించారు. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్‌తో పాటు పలు ఇతర మీడియా సంస్థల ప్రతినిధులను పిలువలేదు. కొన్ని మీడియా సంస్థల వారు వెళ్లినా బయటే ఉండిపోయారని సమాచారం. బహుశా అందరినీ అనుమతిస్తే ఇబ్బందికర ప్రశ్నలు వేస్తారనుకున్నారేమో! ఆ పెట్టిన విలేకరుల భేటీలోనూ.. స్థానిక ఎన్నికలను వాయిదావేసిన ఎన్నికల కమిషనర్ రమేశ్‌కుమార్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయనకు కులం ఆపాదించి, స్థాయి దిగి మాట్లాడారు. వాస్తవానికి ఆ ఎన్నికలు వాయిదా పడకుండా ఉండి ఉంటే పరిస్థితి ఏంటన్నది అందరికీ అర్థమవుతోంది. కరోనా వైరస్‌ను ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలో దాని తీవ్రత రాదన్నారు. పారసిటమల్ వేసుకుంటే సరిపోతుందని చెప్పారు. ఓపక్క సాక్షాత్తూ ప్రధాని మోదీ తరచూ అధికారులతో సమీక్షలు జరుపుతూ.. మహమ్మారిని ఎలా నివారించాలో ప్రజలకు సూచనలు, జాగ్రత్తలు చెబుతూ వస్తున్నారు. ఆదివారం దేశమంతా జనతా కర్ఫ్యూ పాటించాలని పిలుపిచ్చారు. ప్రజలంతా స్వచ్ఛందంగా పాటించారు. కృష్ణా, ప్రకాశం, విశాఖ సహా దేశంలోని 75 జిల్లాల్లో కేంద్రం ఈ నెల 31 వరకు లాక్‌డౌన్ ప్రకటించింది. పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో దీనినిబట్టే తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్ ఆదివారం హడావుడిగా విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. మీడియా సంస్థల్లో తమకు అనుకూలమైన వాటికే కబురంపారు. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ సహా చాలా సంస్థల ప్రతినిధులకు పిలుపందలేదు. అందరినీ ఆహ్వానిస్తే.. ఇబ్బందిపడే ప్రశ్నలు వేస్తారని భావించినట్లు కనబడుతోంది. 'ఎన్నికల కమిషనర్ మీ ఒత్తిడికి తలొగ్గి స్థానిక ఎన్నికలు వాయిదా వేయకుండా ఉండి ఉంటే పరిస్థితి ఎలా ఉండేది'.. 'స్థానిక ఎన్నికలు వాయిదా వేస్తే 14వ ఆర్థిక సంఘం నిధులు రావన్నారు. నిధులు రాకుండా కుట్ర చేస్తున్నారన్నారు. మరి ఎన్నికలు వాయిదా పడినా ఆ నిధులు వచ్చేశాయి కదా.. దీనికేమంటారు' వంటి ప్రశ్నలు వేస్తే సమాధానం చెప్పలేక ఇబ్బందిపడతామని భావించి ఉంటారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ కారణంగానే ఇంత విపత్కర పరిస్థితుల్లో, సమాచారాన్ని ప్రజలకు అందించాల్సిన అనివార్య పరిస్థితుల్లో కూడా విలేకరుల సమావేశానికి ఎలాంటి ప్రశ్నలు అడగని, సొంత మీడియాకు సంబంధించిన వారినే ఆహ్వానించారని చెబుతున్నారు. అయితే పిలవకపోయినా.. సామాజిక బాధ్యతగా ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆ అంశాల్ని ఇతర మార్గాల్లో సేకరించి ప్రజలకు అందించాయి.

## తమిళ దర్శకుడు, నటుడు విసు మృతి



చెన్నై, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రముఖ తమిళ సినీ కథా, సంభాషణల రచయిత, నటుడు, దర్శకుడు విసు ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. ఆయన వయస్సు 72 సంవత్సరాలు. కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి ఇటీవల మరింత క్షీణించడంతో చెన్నైలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ ఆదివారం తుది శ్వాస విడిచారు. తమిళ రంగస్థలంలో నటుడిగా ప్రవేశించిన విసు కుటుంబ కథలను నాటకాలుగా మలిచి ప్రదర్శించి పేరుగాంచారు. ప్రముఖ దర్శకుడు కె.బాలచందర్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరారు. ఆయన దర్శకత్వంలో రజనీ నటించిన 'తిల్లుముల్లు' చిత్రంలో నటుడిగా విసు తమిళ చిత్రసీమకు పరిచయమయ్యారు. 'కుడుంబం ఒరు కదంబం' చిత్రంలో కీలక పాత్ర పోషించారు. విసు నాటకాలన్నీ కుటుంబ కథా చలన చిత్రాలుగా మారడం విశేషం. వాటిలో 'సంసారం అదు మిన్‌సారం (తెలుగులో.. సంసారం చదరంగం) సూపర్‌హిట్టయ్యింది. 'డౌరీ కల్యాణం', 'చిదంబర రహస్యం', 'పుదియ శతాబ్దం' వంటి చిత్రాలు తమిళ చిత్రసీమలో విసును ఉన్నత స్థితికి తీసుకెళ్లాయి. విసు చివరగా దర్శకత్వం వహించి నటించిన చిత్రం 'తంగమణి రంగమణి'. విసుకు కుమార్తెలు ముగ్గురూ వివాహమై విదేశాల్లో స్థిరపడ్డారు. విసు అంత్యక్రియలు చెన్నై తురైపాకంలో సోమవారం నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు.

## రైల్వే భూముల్లో సౌరవిద్యుత్ ఉత్పత్తి

న్యూఢిల్లీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): భారత రైల్వే పరిధిలో ఖాళీగా ఉన్న భూముల్లో సౌరశక్తి ప్లాంట్లు నెలకొల్పేందుకు రైల్వేబోర్డు ప్రతిపాదించినట్లు రైల్వే మంత్రి పీయూష్‌గోయల్ వెల్లడించారు. 500 మెగావాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తిచేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నకు ఆయన లిఖిత పూర్వకంగా జవాబిచ్చారు. రైళ్లను సౌరశక్తి ద్వారా నడిపేందుకు ఈ ప్లాంట్లు దోహదపడతాయని వివరించారు. ఇప్పటికే హరియాణాలోని దివానాలో 2మెగావాట్లు, మధ్యప్రదేశ్‌లోని బినా ప్రాంతంలో 1.7మెగావాట్ల సామర్థ్యంతో సౌరశక్తి ప్లాంట్లను ప్రయోగాత్మకంగా చేపట్టామని తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టులు జూన్ నెలాఖరుకు పూర్తయ్యే అవకాశం ఉందని చెప్పారు. కాగా, రైళ్లలో చోరీలు, దోపిడీల నియంత్రణకు కట్టుదిట్టమైన భద్రతాచర్యలు చేపట్టామని గోయల్ వెల్లడించారు. రోజూ 2200 రైళ్లకు ప్రత్యేకంగా ఎస్కార్ట్ పోలీస్ భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పర్యవేక్షణలో భద్రతను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

## వర్చువల్‌గా సూపర్ కంప్యూటర్

▸ శాస్త్రవేత్తలు, నెటిజన్ల ఉమ్మడి చొరవ
▸ కరోనాపై పరిశోధనలకు 'సూపర్' ఊతం

వాషింగ్టన్, మార్చి 22 : కరోనా వైరస్‌పై పరిశోధనలను వేగవంతం చేయాలనే ఏకైక లక్ష్యంతో కేవలం రెండువారాల్లోనే వేలాది శాస్త్రవేత్తలు, 4 లక్షల మందికిపైగా నెటిజన్లు ఏకమై 'వర్చువల్ సూపర్‌కంప్యూటర్'ను సృష్టించారు. తద్వారా ప్రపంచాన్ని వణికిస్తున్న కొవిడ్-19 నిర్మాణం, స్వరూప, స్వభావాల గుట్టును తెలుసుకునేందుకు జరుగుతున్న పరిశోధనల యజ్ఞానికి మేముసైతం అంటూ సంఘీభావం తెలిపారు. foldingathome.org వెబ్‌సైట్ ద్వారా తమతమ వ్యక్తిగత కంప్యూటర్ల నుంచి వర్చువల్ సూపర్ కంప్యూటర్‌తో అనుసంధానమయ్యారు. వైరస్ నిర్మాణానికి సంబంధించిన ట్రిలియన్ల కొద్దీ విశ్లేషణలు, గణాంకాలను అవలీలగా అర్థం చేసుకొని నిక్షిప్తం చేసుకోగల సామర్థ్యం దీని సొంతం. సెకనుకు వెయ్యి ట్రిలియన్ల (ఒక క్వాడ్రిలియన్) గణాంకాలను విశ్లేషించే సామర్థ్యాన్ని ఒక పెటాఫ్లాప్ అంటారు. 4 లక్షల మందికిపై నెటిజన్ల కంప్యూటర్లు అనుసంధానమవడంతో ఈ వర్చువల్ సూపర్ కంప్యూటర్‌కు ఏకంగా 400 పెటాఫ్లాప్‌ల సమాచారాన్ని విశ్లేషించే సామర్థ్యం చేకూరింది. అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో ఉన్న వాషింగ్టన్ వర్సిటీ బయోకెమిస్ట్రీ, మాలిక్యులర్ బయోఫిజిక్స్ విభాగం ఈ ప్రాజెక్టును పర్యవేక్షిస్తోంది.



# స్వీయ నియంత్రణతోనే కరోనా అదుపు

▸ వీడియో ద్వారా చంద్రబాబు సందేశం

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): "ప్రపంచాన్ని చుట్టుముట్టిన 'కరోనా' నియంత్రణకు ప్రభుత్వాలెన్నీ జాగ్రత్తలు తీసుకున్నా మనం కూడా ఎవరికి వారుగా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం చాలా ఉంది. ఇది అందరి బాధ్యత. సమాజ హితం కోసం, మన భద్రత, మన బిడ్డల భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలి. ఈ విషయంలో నేనొక్కటే కోరుతున్నా. ఎక్కడ రాజీ పడినా, ఒక్క నిమిషమే కదా ఫర్వాలేదు ఏం కాదులే అనుకున్నా.. చాలా ప్రమాదం వస్తుంది" అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు హెచ్చరించారు. జనతా కర్ఫ్యూ సందర్భంగా ఆదివారం స్వీయ నియంత్రణలో భాగంగా కుటుంబసభ్యులతో ఇంట్లోనే గడిపిన చంద్రబాబు.. కోవిడ్-19 పరిస్థితిపై తన సందేశ వీడియోని మీడియాకు విడుదల చేశారు. 'ప్రధానమంత్రి పిలుపు మేరకు జనతా కర్ఫ్యూ నిక్కచ్చిగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. స్వీయ నిర్బంధం పాటించాలి. మనలో క్రమ శిక్షణ రావాలి. ఇది మామూలు పరిస్థితి కాదు. ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉంది' అని సూచించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, స్వీయ నియంత్రణ, జనతా కర్ఫ్యూ వంటి కార్యక్రమాలకు సహకరించడం, వర్క్ ఫ్రం హోం పాటించడం చాలా అవసరమని చెప్పారు. భయపడాల్సిన పరిస్థితి కంటే, జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం చాలా ఎక్కువుందని పేర్కొన్నారు. కరోనా లక్షణాల అనుమానం ఉన్న వ్యక్తి బయటకి రాకుండా, ఇతరులతో ఏ మాత్రమూ సంబంధం లేకుండా నేరుగా క్వారంటైన్‌లో ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు.

## రూ.వెయ్యితో కుటుంబం గడుస్తుందా?

▸ పేద, మధ్య తరగతికి రూ.2 వేలివ్వాలి: బుద్ధా

విజయవాడ, మార్చి 22: కరోనా కారణంగా పేదల బతుకులు తారుమారవుతున్నా సీఎం జగన్‌కు పెద్ద మనసు రావడం లేదని టీడీపీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న విమర్శించారు. ఈ నెల 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో పేదలు పనుల్లేక అల్లాడే పరిస్థితి ఏర్పడుతుందని, ఇలాంటి సమయంలో పేదలను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బియ్యం, కందిపప్పు ఇచ్చి రూ.1000 ఇస్తే పేదల కుటుంబాలు గడిచిపోతాయా? అని సీఎం జగన్‌ను ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్ రమేశ్ కుమార్ స్థానిక ఎన్నికలను వాయిదా వేయకపోతే రాష్ట్ర ప్రజల ప్రాణాలను సీఎం జగన్ గాల్లో కలిపేసేవారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలకన్నా తనకు ఎన్నికలే ముఖ్యమని అన్నారంటూ జగన్‌ను విమర్శించారు. తెల్లరేషన్ కార్డుదారులకే కాకుండా నెలకు రూ.20 వేలు లోపు ఆదాయం ఉన్న పేద, మధ్యతరగతి ప్రజలందరికీ బియ్యం, నిత్యావసరాలతోపాటు రూ.2 వేలు ఇవ్వాలని వెంకన్న డిమాండ్ చేశారు.

# కర్ఫ్యూలోనూ నిరసన!



శిబిరంలో దూరంగా కూర్చుని నిరసన తెలుపుతున్న దృశ్యం

▸ ఇళ్ల ముందు 'జై అమరావతి' ముగ్గు

▸ రాజధానిగా అమరావతి కొనసాగాలని నినాదం

▸ 96వ రోజూ కొనసాగిన రాజధాని ఆందోళనలు

**శిబిరాలకు దూరంగా ఇళ్లలోనే దీక్షలు**
**కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన**

గుంటూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): "అమరావతి ఉద్యమం కరోనా వైరస్‌కి భయపడేది కాదు. కానీ ప్రధాని మోదీ పిలుపుమేరకు జనతా కర్ఫ్యూని పాటిస్తున్నాం. మా మతం ప్రజాహితం, మా పోరు భావి తరాల భవిష్యత్తు కోసం" అంటూ అమరావతి రైతులు ఆందోళనలు కొనసాగించారు. రాజధానిగా అమరావతినే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన ఆందోళనలు ఆదివారం 96వ రోజుకు చేరాయి. 3 రాజధానుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తుళ్లూరు, మందడం, రాయపూడి, వెలగపూడి, ఎర్రబాలెం, కృష్ణాయపాలెం, నీరుకొండ, పెదపరిమి తదితర ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగించారు. జనతా కర్ఫ్యూని పాటిస్తూనే అమరావతి రైతులు తమ నిరసనలు కొనసాగించారు. ఉదయం 5.30 గంటలకే రైతులు, రైతుకూలీలు, మహిళలు దీక్షా శిబిరాలకు చేరుకుని దూరం దూరంగా కూర్చొని దీక్షలు చేపట్టారు. మూడు రాజధానుల ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. బాధ్యత గల పౌరులుగా తమ కర్తవ్యాన్ని నిర్వరిస్తామని సరిగ్గా 7 గంటలకు కర్ఫ్యూని పాటిస్తూ ఇళ్లకు వెళ్లారు. అనంతరం తమ ఇళ్లలో నిరసనను కొనసాగించారు. సాయంత్రం 5 గంటలకు రైతులు తిరిగి శిబిరాలకు చేరుకొని వైద్యులు, అధికారులు, పోలీసులు, పారిశుధ్య కార్మికులు, మీడియా సేవలను కొనియాడుతూ చప్పట్లు కొట్టి మద్దతు తెలిపారు. మళ్లీ రాత్రి 9 గంటల నుంచి గంటసేపు రైతులు తమ ఆందోళనలు కొనసాగించారు.

### ఇంటింటా అమరావతి హోరు

రాజధాని రైతులు తమ పోరు తీరును మార్చారు. 'ఇంటింటా అమరావతి' పేరిట ఎవరి ఇంట్లో వారు కుటుంబ సమేతంగా కూర్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళలు తమ ఇళ్ల ముందు 'జై అమరావతి.. జనతా కర్ఫ్యూని విజయవంతం చేయండి' అంటూ ముగ్గులు పెట్టారు. ప్రతి ఇంటిపైనా నల్లజెండా, రైతుల జెండాను ఎగురవేసి నిరసన తెలిపారు.

**'అమరావతి వెలుగు'**

రాజధాని ప్రాంతంలోని అన్ని గ్రామాల్లోనూ రాత్రి 7.30కు 'అమరావతి వెలుగు' పేరిట ఇళ్లలో విద్యుత్తు దీపాలు ఆపేసి రైతులు, మహిళలు కొవ్వొత్తులు వెలిగించారు. ప్రభుత్వం నిర్ణయం మార్చుకొని అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించే వరకు తమ పోరు ఆపబోమని రైతులు, రైతుకూలీలు తేల్చి చెప్పారు. కొందరు తమ ఇళ్ల ముందుకు వచ్చి నిరసన తెలిపారు.

## నో షేక్‌హ్యాండ్.. నో వైరస్..!

▸ ఆకట్టుకుంటున్న పార్వతీపురం పోలీసుల వీడియో



డ్యాన్స్ చేస్తున్న పార్వతీపురం పోలీసులు

కరోనా వైరస్ ప్రబలకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విజయగనరం జిల్లా పార్వతీపురం సర్కిల్ పోలీసులు శనివారం విడుదల చేసిన వీడియో అందర్నీ ఆకట్టుకుంటోంది. ఆ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. పార్వతీపురం సర్కిల్‌లోని ఎస్సైలు, కానిస్టేబుళ్లు మాస్కులు ధరించి ఇటీవల బాగా పాపులర్ అయిన సినిమా పాట బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌కు లయబద్ధంగా డ్యాన్స్ చేస్తూ.. అదే సమయంలో కరచాలనం వద్దు.. నమస్కారం ముద్దు, ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రంగా కడుక్కోవాలి, మాస్కులు ధరించాలి.. అనే సందేశాన్ని ఈ వీడియో ద్వారా అందించారు. దీనిపై సీఐ దాశరథి మాట్లాడుతూ ఏఎస్పీ ఆదేశాల మేరకు ఈ వీడియో రూపొందించామని చెప్పారు. పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు పోలీసులను అభినందించారు.

**- పార్వతీపురం**

## కేసీఆర్ ఆత్మవిశ్వాసంలో జగన్‌కు 10 శాతమైనా ఉందా?

▸ సీపీఐ నేత నారాయణ ప్రశ్న

హైదరాబాద్ మార్చి 22(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్‌పై తెలంగాణ సీఎం కేసీఆర్ ఎంత ఆత్మవిశ్వాసం ప్రకటిస్తున్నారో ఏపీ సీఎం జగన్ దానిలో 10% ఆత్మవిశ్వాసం ప్రకటించగలరా? అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ప్రశ్నించారు. మానవ జీవితంలో తప్పులు చేయడం సహజమని, తప్పులు సమర్థించుకోడానికి నూరు తప్పులు చేయడమా? అని అన్నారు. రాజకీయాల్లో విభేదాలు సహజమని దాన్ని హుందాగా తీసుకున్నవారే రాజకీయాల్లో రాణించగలుగుతారని అన్నారు. గతంలో ఒకసారి వైఎస్ సీఎంగా ఉండగా కలువడానికి వెళితే, చూడగానే అక్కున చేర్చుకున్నారని వివరించారు. అయితే, అక్కడే ఉన్న కేవీపీ స్పందిస్తూ "నారాయణను చూడగానే పంచ నిల్వదా నీకు.. నిన్ను బయట ఎన్ని బూతులు తిడుతున్నాడో తెలియదా?" అన్నారు. దీనికి వైఎస్.. నారాయణ కమ్యూనిస్టు నేత. నన్ను విమర్శించకుండా ఉంటాడా? అన్నారు. అది రాజకీయ నీతి సూత్రం. నేను బాధతోనే ఈ విషయం చెబుతున్నా అని నారాయణ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, జనతా కర్ఫ్యూ సందర్భంగా మణికొండలోని తన నివాసంలో నారాయణ యోసనాలు వేస్తూ కాలక్షేపం చేశారు. సాయంత్రం 5 గంటలకు సతీమణి వసుమతితో కలిసి ఈల వేసి చప్పట్లు కొడుతూ సంఘీభావం ప్రకటించారు.

## నవజాత శిశువులకూ మాస్కులు!



జనతా కర్ఫ్యూ రోజున ఇద్దరు శిశువులు జన్మించారు. విజయనగరం జిల్లా బొబ్బిలిలోని జనార్దన్ నర్సింగ్‌హోమ్ వైద్యులు ఆదివారం ఇద్దరు గర్భిణులకు సిజేరియన్ చేసి బిడ్డలను బయటకు తీశారు. రామభద్రపురం మండలం పాలవలస గ్రామానికి చెందిన లంక వేణి, అనంతరావు దంపతులు, అలాగే బొబ్బిలికి చెందిన సీహెచ్ రమణి, సంతోష్ దంపతులకు ఈ బిడ్డలు జన్మించారు. ఆస్పత్రి వైద్యులు జనార్దన్‌రావు మాట్లాడుతూ కరోనా భయాందోళన నేపథ్యంలో ఇద్దరు గర్భిణిలకు సంబంధించి అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని చెప్పారు. అప్పుడే పుట్టిన బిడ్డలకు మాస్కులు కూడా వినియోగించామన్నారు.

**- బొబ్బిలి**



రాజ్‌భవన్‌లో చప్పట్లు కొడుతున్న గవర్నర్, సిబ్బంది

## ప్రజలందరికీ కృతజ్ఞతలు

▸ చప్పట్లతో అభినందించిన గవర్నర్

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కరోనా నియంత్రణ కోసం ప్రధాని మోదీ పిలుపుతో జనతా కర్ఫ్యూలో పాల్గొన్న ప్రజలందరికీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ కృతజ్ఞతలు తెలిపారు. జనతా కర్ఫ్యూ గ్రాండ్ సక్సెస్ అయిందని ఆదివారం నాడు గవర్నర్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కరోనా వైరస్‌ను నియంత్రించవచ్చని గవర్నర్ పేర్కొన్నారు. కరోనా నివారణకు పనిచేస్తున్న వైద్య సిబ్బంది, సామాజిక సేవకులకు సంఘీభావం తెలుపుతూ సాయంత్రం ఐదుగంటలకు గవర్నర్ హరిచందన్ చప్పట్లతో వారిని అభినందించారు.

## సేవ చేస్తున్న ప్రతి ఒక్కరికీ సెల్యూట్: జగన్

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్‌ను దరికి రాకుండా తరిమివేసేందుకు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా సేవలందిస్తున్న సైనికులు, స్థానిక పోలీసులు, ఆరోగ్య సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బందికి... ఇలా నిరంతరం బాధ్యతలు నిర్వర్తిస్తున్న ప్రతి ఒక్కరికీ సెల్యూట్ చేస్తున్నానని ముఖ్యమంత్రి జగన్ ట్విటర్‌లో పేర్కొన్నారు. జనతా కర్ఫ్యూను విజయవంతం చేసినందుకు రాష్ట్ర ప్రజలను అభినందించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు జనతా కర్ఫ్యూలో భాగంగా సాయంత్రం ఐదు గంటలకు సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సీఎస్ నీలం సాహ్ని, సీఎం కార్యాలయాధికారులతో కలసి వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది, పోలీసు సిబ్బంది సేవలను అభినందిస్తూ ఐదు నిమిషాల పాటు చప్పట్లు కొట్టారు.

## రాజ్యసభ ఎన్నికలు వాయిదా?

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ దెబ్బకు రాష్ట్రాలకు రాష్ట్రాలే లాక్‌డౌన్ అవుతున్న నేపథ్యంలో.. ఈ నెల 26వ తేదీన జరగనున్న రాజ్యసభ ఎన్నికలను వాయిదా వేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్ (సీఈసీ) యోచిస్తున్నట్లు సమాచారం. సోమవారం దీనిపై స్పష్టత రావచ్చని భావిస్తున్నారు. ఈసీ ప్రత్యేక ఆదేశాలు జారీచేయొచ్చని అసెంబ్లీ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రం నుంచి ఖాళీ అయిన నాలుగు రాజ్యసభ స్థానాల భర్తీకి ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడం.. వైసీపీ అభ్యర్థులుగా ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, రియలన్స్ గ్రూప్ కార్పొరేట్ వ్యవహారాల ప్రెసిడెంట్ పరిమళ్ నత్వానీ, ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రి మోపిదేవి వెంకటరమణావు నామినేషన్లు వేయగా.. టీడీపీ తరపున వర్ల రామయ్య నామినేషన్ దాఖలు చేశారు.

## ఎలక్ట్రికల్ కంపెనీలో అగ్నిప్రమాదం

▸ కవరేజికి వెళ్లిన ఏబీఎన్-ఆంధ్రజ్యోతి విలేకరిపై దాడి

కడప, క్రైం, మార్చి 22 : కడప ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని షిరిడిసాయి ఎలక్ట్రికల్ కంపెనీలో షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ప్రమాదంలో దాదాపు రూ.2.5 కోట్ల విలువ చేసే పరికరాలు కాలి బూడిద అయినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. కంపెనీ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా.. అగ్ని ప్రమాద సమాచారం తెలుసుకున్న ఏబీఎన్-ఆంధ్రజ్యోతి కడప రిపోర్టర్ మధుసూదన్ వార్త కవరేజ్ కోసం సంఘటనా స్థలానికి ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ రత్నమయ్యతో కలిసి వెళ్లారు. వార్తలు కవర్ చేసేందుకు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా ఏ మీడియా అంటూ అడగడంతో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి పేరు చెప్పగానే ఒక్కసారిగా కంపెనీ మేనేజర్, మరో ముగ్గురు కలిసి అతనిపై దాడి చేయడంతో పాటు కెమెరాలను సైతం లాక్కుని గేటు బయటకు నెట్టేశారు. పోలీసుస్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్న రిపోర్టర్‌ను సైతం అడ్డగించి, బెదిరించారు. తనపై దాడి చేసిన వారిపై రిమ్స్ పోలీసుస్టేషన్‌లో మధు ఫిర్యాదు చేశారు.





E-book today at www.marutisuzuki.com or visit your nearest Maruti Suzuki dealership | Maruti Suzuki vehicles now available under CSD & CPC* | For bulk order, mail at: nishant.vijayvergia@maruti.co.in

AUTHORISED DEALERS: CENTRAL ANDHRA (VIJAYAWADA): JAYALAKSHMI: (GUNTUR) CALL: 7093522444, (ONGOLE) CALL: 9618599433. REDDY & REDDY MOTORS: (ELURU) CALL: 9133377574. VISHNU CARS PVT. LTD.: (NELLORE) CALL: 9100776888. NOVELTY REDDY & REDDY: (BHIMAWARAM) CALL: 08816-251555. MITHRA AUTO: CALL: 8297174444. SANTOSH: CALL: 9209094999. VARUN: CALL: 9885260333. BHARGAVI: (NELLORE) CALL: 9248744744. E-OUTLETS: VARUN: (GUDIWADA) CALL: 9885260333, (JAGGIAHPET) CALL: 9885260333, (NUZVID) CALL: 9885260333. MITHRA AUTO: (MACHILIPATNAM) CALL: 8886063493. JAYALAKSHMI: (CHIRALA) CALL: 9100980063, (TENALI) CALL: 9100790152, (NARASARAOPET) CALL: 9959963538. BHARGAVI: (KAVALI) CALL: 7658923339, (GUDUR) CALL: 7658923339. REDDY & REDDY: (JANGAREDDY GUDAM) CALL: 9912911455, (TANUKU) CALL: 08819-229123.

*Offer includes consumer offer, retail support, exchange offer and corporate offer (wherever applicable). Terms and Conditions apply. The terms and conditions are subject to change without any prior notice. All offers are brought to you by Maruti Suzuki dealers only. Offers may vary from variant to variant. All offers shown are valid for limited period & for limited stock only. Accessories and features shown in the pictures may not be a part of the standard equipment and may vary according to the variant. Colors shown may vary from actual body colors due to printing on paper. Images used are for illustration purposes only. Above offers are valid till 31st March 2020.

# తల నరుక్కున్న సూరీడు

ఇంతకీ నువ్వు ఓడినట్టా, గెలిచినట్టా
గెలుపుకొండ మీద
పల్లవి తెగిన పాటగా రాలిపడ్డట్టా
మరి, పరిగెత్తే కాలం మీద పల్లకీలో విర్రవీగే నువ్వు
ప్రతి మలుపులోనూ ప్రశ్నవై స్వరం తప్పడమెందుకు?

ఇంతకీ నువ్వు నిండుగడపలా మిడిసిపడుతున్నట్టా
పిల్లల్లేని ఇంటిలా వెళుసుబారినట్టా
మలిపేసుకున్న దీపంలా మిగులుపడ్డట్టా
మరి, ఒడుపు కాలాన్ని ఒడిసిపట్టి
వలేసి దూసుకున్న మెరుపులన్నీ
నిన్ను పొగమంచు పొద్దుల్లోకి
వలస పంపుతున్నాయెందుకు?

ఇంతకీ నువ్వు బహువచనమై విరజల్లుకున్నట్టా
ఏకవచనమై దిక్కుల్ని పగలగొట్టుకున్నట్టా
లయలెరుగని లోయల్లో సుడిగుండమైపోయినట్టా
మరి, నీ నట్టింట్లోకి నడిచొచ్చిన గెలుపులన్నీ
ఒక్కొక్కటిగా ఓటముల వెనక్కి వెలేస్తుంటే
ఎక్కుపెట్టుకోవడమెరుగని బాణమై
గుటకలు మింగడమెందుకు?

మట్టినీ, మబ్బునీ తడిమి
గుట్టనూ, గువ్వనూ నిమిరి
ఆకునూ అడవినీ అల్లుకుపోయినప్పుడు
కొత్త కవిత్వంలా భూలచ్చిమి
కళలు పోయిన కాలాల మీద
వెన్నమీగడలా రుచులు పోయిన సందర్భాల మీద
ఇప్పుడే పలకరింత వాలుతోంది-
ఎదుగుతున్న కన్నీటి ఊట తప్ప
చివరి ఘట్టాల కవాతు తప్ప

బతుకుపొరం బిక్కచచ్చిపోయిన దిబ్బల్లో
ఏరుకున్న ముళ్లపాటలకు
బాణీలు వెతుక్కునే వేళల్లో
కొత్త భాషలాడాల్సిన రుతుశోభల మీద
ఇప్పుడే ఆకాశం వంగి వంగి వడ్డించుకుంటోంది-
నేలనేలంతా నువ్వు పేనిన తలాపిదీపాల
మిణుకు మిణుకులు తప్ప!
చైనా మాంజాలో గింజుకుంటున్న పిట్టల రెక్కలు
విరిగిపోతున్న చప్పుడు తప్ప!

***

కణాన్ని తరచి, అణువును విరిచి, ఖగోళాన్ని ఈది
అంతరిక్షం ఆవలకు అడుగులు పరచి
జీవాండ పిండ బ్రహ్మాండాలన్నిటినీ చెరచి
శోధించి పరమాణు బలాన్ని ఛేదించి చెరపట్టావు సరే...
లోకాన్నంతా ఆయాసపడమని శపించి
నువ్వు విరజిమ్మిన విషాల్లో మరగబెట్టి
అనంతంగా శ్వాసల్ని వడగొట్టి
వెన్నెలల్ని పిండుకుంటున్నావు సరే...
మరి, అప్పుడో ఇప్పుడో-
కన్ను కానని గత్తర కణాలు
కసికొద్దీ నిన్నే ప్రయోగశాలని చేసుకుని
విహ్వలత అంచున వేలాడదీసి
నాడుల నిండా కార్చిచ్చుల్ని పేర్చుతుంటే
కనీసం మిణుగురుల తొవ్వల్ని కూడ
మిగుల్చుకోలేని నువ్వేం విజేతవి?
జీవమని కూడా అనలేని అర్ధజీవాలు
నిన్నే పీనుగుల కుప్పని చేసి తాండవమాడుతుంటే
ఊపిరి కొసన కాసిన్ని నక్షత్రాలు కూడ వేలాడక
నవ్వులపొద్దుల విడిదిళ్ల కోసం
కాలం మళ్లేసుకొచ్చే ఉగాదుల కోసం
ఉగాదులు వెంటేసుకొచ్చే కోయిలల కోసం
గుక్కపట్టే నువ్వేం మనిషివి?

***

సరేలే,
ఊపేసే గాలికి ఊగిపోయే కొమ్మంచున
తూలితూలి వాలిన పిట్టలా
చివరికి నువ్వే గెలుస్తావేమోలే కానీ
నీ గెలుపెంత రెక్కచాచుకున్న ఓటమో
తెలిసొస్తున్న ప్రతిసారీ- నువ్వెప్పుడూ-
కాలం గర్భగుడి ముందు దిగుడు మెట్టువే!
శార్వరి ఒడిలో తలనరుక్కున్న సూరీడువే!

■ యార్లగడ్డ రాఘవేంద్రరావు
9985411099






# కెవిఆర్‌తో ఉద్యమ స్నేహానుబంధం

ఆధునిక తెలుగు సాహిత్యంలో మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడిగా కవిగా కె.వి.రమణారెడ్డి గారికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఆయన నిరంతర రచనా వ్యాసంగం, అధ్యయనం, ముక్కుసూటిదనం, ఉద్యమశీలతను మరిచిపోలేం. కెవిఆర్ గాంభీర్యం, వ్యక్తిత్వంలో స్నేహం, హాస్యప్రియత్వం దాగి ఉండేవి. ఉద్యమపరంగా, సాహిత్యరీత్యా రెండు దశాబ్దాలపాటు (1960-1980) మా స్నేహానుబంధం కొనసాగింది.

నేను మొదటి దశలో కె.యాదవరెడ్డిగా రచనలు చేస్తూ, ఆనాటి 'విశాలాంధ్ర' ఆదివారం సాహిత్యానుబంధంలోని రచనలను ఆసక్తిగా చదివేవాణ్ణి. ఆంధ్ర ప్రభ, ఆంధ్ర పత్రికల ద్వారా కూడా ఆనాటి సాహిత్యలోకం పోకడలను తెలుసుకునే అవకాశం ఉండేది. 'విశాలాంధ్ర'లో తరచుగా నా రచనలు వచ్చేవి.

ముఖ్యంగా 1961-62 మధ్య విశాలాంధ్ర ఆదివారం సంచికలో 'అక్షర తూణీరం' శీర్షికన కెవిఆర్ ఒక కాలమ్ నిర్వహిస్తూ తమ విమర్శనా వ్యాసాలను సంధించేవారు. ఆరుద్ర 'త్వమేవాహం', 'సినీవాలి' కావ్యాలను విశ్లేషణాత్మకంగా వివరిస్తూ, వాటిలోని అసంగతాలను, కవి చాపల్యాన్ని ఎండగట్టేవారు. అలానే నారప రెడ్డి 'నగరం' కావ్యాన్ని ఇతరత్రా వచ్చిన ఆనాటి రచనలను నిర్మొగమాటంగా విమర్శించేవారు. ఆ సందర్భంగా ఆరుద్ర రామ లక్ష్మి, దాశరథి మొదలైనవారు ఆ విమర్శలకు తట్టుకోలేక తీవ్ర పదజాలంతో కెవిఆర్‌కు ఉత్తరాలు రాసేవారు. చిత్తశుద్ధిగల సాహిత్య విమర్శకుడిగా, ఆనాటి polemicsని వాదోపవాదాలను ఎదుర్కొంటూ సవివరంగా సమాధానాలు ఇచ్చేవారు. తన కాలమ్‌లో ఒకసారి ప్రసిద్ధ ఉర్దూ కవి గురించి 'షకీల్ బదాయుని - గజల్ సుధావాహిని' అనే వాక్యం ఈనాటికీ గుర్తుండిపోయింది.

కెవిఆర్ 'భువనఘోష', 'అడవి' కవితా సంపుటాలు చదివిన తర్వాత, నా స్పందనగా ఆయనకు లేఖ రాయగా ప్రతిస్పందించారు. ఆ తర్వాత 1962లో నేను 'కోపోద్రిక్త యువతరం' శీర్షికన కొన్ని వ్యాసాలు, కవితలు (గోలకొండ పత్రికలో ప్రచురితం) రచించిన దశ. ఒక విధంగా ఆ ఆలోచన- యువ ఆగ్రహం 'దిగంబర కవుల' పూర్వరంగం. ఆ రచనలు వారికి పంపించాను.

ఇక కెవిఆర్ రచనా శైలి, భాష (నెల్లూరు మాండలిక పదాల తోపాటు), వాక్యనిర్మాణం కొంత క్లిష్టంగా వుండేవి. 'మహోదయం', 'కవికోకిల' గ్రంథాలు చదివితే ఆయన విమర్శనా పటిమ, లోతైన అవగాహన, పరిశోధన ఆశ్చర్యపరుస్తాయి. అలానే రచనా శైలి కొన్ని చోట్ల తికమక పెడతాడు.

ముఖ్యంగా 1962లో భారత చైనా యుద్ధం జరిగిన సందర్భం! నేను మిగతా కవి మిత్రులం చైనాను విమర్శిస్తూ రాసిన కర పత్రంలో భారత సైనికులను కీర్తిస్తూ కవితలు ప్రచురించాము. వాటిని కెవిఆర్‌కు పంపించగా, 19-11-1962లో ఆయన సమాధానం (లేఖలోంచి) "దేశం పేరుతో శివమెత్తిపోయేందుకు, ఆవేశంతో సత్యాసత్యాలను తారుమారు చేసేందుకు, వన్నెలనుబట్టి జాతులను ద్వేషించమనేందుకు నేను సిద్ధంగా లేను... న్యాయం ఎవరికైనా ఒక్కటే, తప్పో ఒప్పో నా దేశమే ఆరాధ్యమన్న ఉన్మాదాన్ని నేను దూరంగా పెట్టుకున్నాను." ఒక చరిత్ర-రాజనీతి శాస్త్ర ఉపాధ్యాయుడిగా వెల్లడించిన అభిప్రాయమిది! ఈనాటికీ వర్తించే నిజం!

కెవిఆర్ మొదటి దశలో దిగంబర కవులను ఆమోదించలేకపోయారు. అరాచక ధోరణిగా ఉందని విమర్శించారు. విచిత్రమేమిటంటే 1970 జనవరిలో జరిగిన శ్రీశ్రీ షష్టిపూర్తి ఉత్సవాల్లో మాత్రమే మొదటిసారి వారిని నేనూ, జ్వాల వ్యక్తిగతంగా కలుసుకోగలిగాము. అంతవరకు లేఖల ద్వారానే మా సాహిత్యానుబంధం సాగింది. ఆ తర్వాత విరసం ఆవిర్భావానికి ముందు, నేను మార్చి 1970లో ఒక లేఖ రాశాను. శ్రీకాకుళ గిరిజన పోరాటం నేపథ్యంలో రచయితలంతా విప్లవ మార్గాన్ని సమీకరించబడాలని, ఒక సీనియర్ అభ్యుదయ రచయితగా వారిని కలిసిరమ్మని కోరగా, ఆయన స్పందన (అప్పుడే నన్ను "నిఖిలేశ్వర్" అని సంబోధిస్తూ రాయడం ప్రారంభించారు): "...మీ మార్గం సవ్యమైనది, ఈ మహాప్రజలకు నిజంగా మేలు చేయగలిగేది అనే నమ్మకం నాకు కలిగినప్పుడు, మీలో ఒకడ్ని అవుతాను. ఈ లోపల మీకు కుడిఎడమలుగా నా దారిన నన్ను పోనివ్వండి." (కెవిఆర్ లేఖ- 12-3-70)

ఆ తర్వాత కొన్ని ముఖ్యమైన పరిణామాల మధ్య 1970 జులైలో హైదరాబాద్‌లో విరసం స్థాపన- కెవిఆర్‌తోపాటు కొకు, శ్రీశ్రీ, రావిశాస్త్రి, కాళీపట్నం లాంటి వారంతా కలిసి వచ్చారు. ఖమ్మంలో 1970 అక్టోబర్‌లో 'విరసం' చారిత్రాత్మక ఆవిర్భావ మహాసభ జరిగింది. కొత్తతరం-పాతతరం రచయితలు ఎందరో పాల్గొన్న ఆ ప్రారంభ మహాసభ సంస్థాపరంగా విప్లవ సాహిత్యానికి ఎంతో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని సమకూర్చింది. దిగంబర కవులలో (మహాస్వప్న, భైరవయ్య మినహా) మిగతా నలుగురు సంస్థాపక కార్యవర్గ సభ్యులుగా వున్నారు. అప్పుడే వెలువడిన 'ఝంఝ' కవితా సంకలనం జనంలోకి వెళ్లగానే చర్చనీయాంశంగా మారింది. వెంగళరావు హోమ్ మినిస్టర్‌గా వున్న ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం 'ఝంఝ' రెండు మూడు ముద్రణలు పొందగానే, నిషేధించింది. తర్వాత 'ఇప్పుడు వీస్తున్న గాలి' (కథాసంకలనం)ని కూడా! తదుపరి ఈ నిషేధాల పరంపర కొనసాగింది. 1971లో పిడి చట్టం కింద మా అరెస్టు- తర్వాత ఆం.ప్ర. హైకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు తర్వాత మా విడుదల! ఝంఝ, ఇ.వీ.గాలి పుస్తకాలను మద్రాస్‌లోని క్రాంతి ప్రింటర్స్‌లో కెవిఆర్, కొకులు స్వయంగా పూనుకొని, ప్రూఫులుదిద్ది అచ్చు వేయించి విరసంకు అందించారు. ఆనాడు ఆ ప్రెస్సు యజమాని ధనికొండ హనుమంతరావు.

విరసం ప్రణాళికను రూపొందించి, చర్చకు పెట్టి, కెవిఆర్ ప్రత్యేకించి కృషి చేశారు. ప్రతి కార్యవర్గ సమావేశంలో, వారు వివరంగా సమస్యలను, సిద్ధాంతాలను విపులీకరించేవారు. విజయవాడలోని ఆనాటి బృందావన్ లాడ్జిలో (గవర్నరుపేట) కెవిఆర్ విడిది చేసేవారు. కార్యవర్గ సభ్యులుగా మేమంతా అక్కడికి చేరేవాళ్లం. రోజంతా గంభీరంగా జరిగే సమావేశం తర్వాత, సాయంత్రాలు సరదాగా కబుర్లు సాగిపోయేవి. ఆ సందర్భంగానే ఒకసారి కెవిఆర్ అందరి మధ్య నన్ను "నిఖిల్, మీరు ఒక్కసారి ఒక బూతుపదం వాడి ఎవరినైనా తిట్టండి," అని అడిగారు. నేను ఎటూ తోచక, మాట్లాడలేదు. మిత్రులంతా కెవిఆర్‌ను సమర్థించారు. చివరికి ఒక బూతుపదాన్ని నాతో పలికించగలిగారు. నేను సౌమ్యంగా ఉంటానని, బూతులు మాట్లాడనని కెవిఆర్ నమ్మకం.

ఇక విరసం కార్యకలాపాల్లో మేమంతా తలమునకలైవున్న ఆ రోజుల్లో, కెవిఆర్ ఉత్తరాలు మార్గదర్శకంగా వుండేవి. విరసంలో సాహిత్య సృజనను బయటి విప్లవ గ్రూపులు శాసించడం ప్రారంభించాయి. ప్రధానంగా చారుమజుందార్ పంథాను సమర్థించే సభ్యుల మెజార్టీ పెరిగింది. తీర్మానాలు తదితర అంశాల్లో ఆ గ్రూపు మాట నెగ్గుతూ వచ్చింది. 1972లో గుంటూరు విరసం మహాసభల తర్వాత నన్ను కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఆ సభల ప్రత్యేక సంచిక సంపాదక బాధ్యతలు నేనే నిర్వహించాను.

ఆ తర్వాత తెనాలిలో విరసం కార్యవర్గ సమావేశం (1973). విరసం రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక అవగాహనలోని వైరుధ్యాలను ఈ కార్యవర్గ సమావేశం బహిర్గతం చేసింది. విప్లవ గ్రూపుల రాజకీయ పంథాలననుసరించి సభ్యులు ముఠాలుగా వ్యవహరించారు. ఎవరికి వారు తమ సాంస్కృతిక పంథా అని ప్రత్యేకించి పుస్తకాలు ప్రచురించి చర్చకు పెట్టారు. ఆ సమావేశంలోనే గుంటూరు మహాసభల ప్రత్యేక సంచికలోని రచనలు--ప్రత్యేకించి నా సంపాదకీయంపై తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. చారు మజుందార్ గ్రూపు సభ్యుల మెజార్టీ మూలంగా ఒక తీర్మానాన్ని ఆమోదించి, ఆ సంచికలోని నా సంపాదకీయాన్ని తొలగించి విడుదల చేయమన్నారు. నేను మనస్తాపానికి గురై వెంటనే అక్కడే నా కార్యదర్శి పదవికి రాజీనామా చేశాను. ఆ సంపాదకీయంలో నేను గ్రూపులను, చారు మజుందార్ పంథాను విమర్శించాను.

> "దేశం పేరుతో శివమెత్తిపోయేందుకు, ఆవేశంతో సత్యాసత్యాలను తారుమారు చేసేందుకు, వన్నెలను బట్టి జాతులను ద్వేషించమనేందుకు నేను సిద్ధంగా లేను... న్యాయం ఎవరికైనా ఒక్కటే, తప్పో ఒప్పో నా దేశమే ఆరాధ్యమన్న ఉన్మాదాన్ని నేను దూరంగా పెట్టుకున్నాను." - కె.వి. రమణారెడ్డి

విరసం అంతర్గత గ్రూపు రాజకీయాలలో సీనియర్స్‌కు ఆసక్తి ఉండేది కాదు. శ్రీశ్రీ అసలు పట్టించుకునేవారు కాదు. కొకు మొదటి నుంచి తటస్థుడి స్థానంలో ఉండిపోయారు. కెవిఆర్ ఎటూ తేల్చుకోలేక సంస్థ బాగోగులు, నిర్వహణ గురించి బాధపడేవారు. గతంలో వారి లేఖలు, ఇతరత్రా వచ్చిన కొన్ని రచనలలో ఆయన అంతర్గత సంఘర్షణ, మానసిక క్షోభ, కోపం వ్యక్తమైన వాస్తవాన్ని మనం గమనించవచ్చు. క్రమంగా విరసంలో గ్రూపు రాజకీయాలు ముదిరిపోగా- 1975 అనంతపురం మహాసభలలో నేనూ జ్వాలాముఖి మిత్రులతోపాటు సంస్థకు రాజీనామా చేశాము. మా అవగాహనను విశదీకరిస్తూ విస్పష్టంగా సాహిత్య సంఘం ప్రజాసంఘంగా స్వతంత్రంగా ఎలా వుండాలో వివరించాము. చారు పంథాను ఎండగట్టాము. ఈ పరిణామాల తర్వాత కెవిఆర్ కొన్ని సంశయాలతోనైనా చివరిదాకా విరసంలో కొనసాగారు.

వ్యక్తిగతంగా కెవిఆర్‌కు మా పట్ల ఎంతో స్నేహభావం వుండేది. కావలిలోని వారి ఇంటికి నేనూ జ్వాల వెళ్ళినపుడు ఎంతో ప్రేమగా ఆతిథ్యం ఇచ్చారు. కెవిఆర్ దంపతులు ఒకసారి హైదరాబాద్ వచ్చి జ్వాల, చెర, మా కుటుంబ సభ్యులను ప్రేమతో పలకరించారు. మేము కావలికి వెళ్ళినప్పుడు, ఆ సాయంత్రం కెవిఆర్ స్వయంగా నన్ను జ్వాలను వెంటబెట్టుకుని జవహర్ భారతి విద్యార్థుల హాస్టల్‌కు తీసుకువెళ్ళారు. ఆ తర్వాత కావలిలోనే వున్న పండిత కవులు ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారి ఇంటికి తీసుకువెళ్ళి పరిచయం చేశారు. 1975లో మేము విరసంతో విడిపోయినా, కెవిఆర్‌తో మరికొంతకాలం నా ఉత్తరప్రత్యుత్తరాలు కొనసాగాయి.

(నేడు కెవిఆర్ జయంతి)

■ నిఖిలేశ్వర్
91778 81201

## ధనికొండతో ఆనాటి పరిచయం



ప్రసిద్ధ రచయిత ధనికొండ హన్మంతరావుగారి శతజయంతి సంవత్సరమిది. ఆయన రచనలన్నీ సంపుటాలుగా వెలువడుతున్న ఈ సమయాన, ఈ తరంలో ఆయన జ్ఞాపకాన్ని పంచుకుంటున్నాను. ధనికొండ వారితో 1970 తర్వాత అనుకోకుండా పరిచయం ఏర్పడింది. మద్రాస్‌లో వున్న క్రాంతి ప్రింటర్స్ యజమానిగా ఆయన తెలుగు పుస్తకాలు కూడా అచ్చు వేసేవారు. విరసం ప్రచురణలు 'ఝంఝ', 'ఇప్పుడు వీస్తున్న గాలి' ఆ ప్రెస్సులోనే ముద్రించారు. కెవిఆర్ గారు, కొకు గారు స్వయంగా క్రాంతి ప్రింటర్స్‌కు వెళ్ళి ప్రూఫులు చూసివచ్చారు. ఈ రెండు పుస్తకాలను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నిషేధించిన సమయంలో ప్రెస్సు యజమాని ధనికొండ వారికి కూడా నోటీసులు వెళ్ళాయి (ప్రింటర్ కాబట్టి). అరెస్టు చేస్తారేమోననే అనుమానంతో ఆయన నాకు ఉత్తరాలు రాశారు. స్వయంగా ఏదో పని మీద సికింద్రాబాదుకు వచ్చినపుడు, ఒక లాడ్జి నుండి కబురు పెట్టారు. బొద్దుగా, లావుగా, ఫ్రెంచి మీసకట్టుతో వున్న హన్మంతరావుగారు నాతో "మీరంతా ఉద్యమాల్లో ఉన్నారు, నిర్బంధాలను ఎదుర్కొంటున్నారు. నన్ను విరసం పుస్తకాలు అచ్చువేసినందుకు అరెస్టు చేస్తారేమోననే భయంవుంది. ఈ వయస్సులో జైలుకెళ్ళి ఆ అవస్థలు పడలేను. ఆ పరిణామం వస్తే ఆ లీగల్ వ్యవహారాలేమిటో మీరే చూడాలి," అని అన్నారు. నేను "తమిళనాడు ప్రభుత్వం మిమ్మల్ని అరెస్టు చేయదు, నిశ్చింతగా వుండండి," అని ధైర్యం చెప్పాను.

## కెవిఆర్ పుస్తకాల ఆవిష్కరణ

రవీంద్రనాథ్ ఠాగూర్ కథలకు కె.వి. రమణారెడ్డి చేసిన అనువాదాలతో 'ఆటబొమ్మలు' కథా సంకలనం, 'కె.వి. ఆర్. స్మృతిలో' వ్యాస సంకలనం- ఈ రెంటి ఆవిష్కరణ సభ మార్చి 29 సా.5.30ని.లకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్, చల్లపల్లి బంగ్లా వద్ద, విజయవాడలో జరుగుతుంది. సింగంపల్లి అశోక్‌కుమార్, తాటి శ్రీకృష్ణ, ఎన్.అంజయ్య పాల్గొంటారు.

**కెవిఆర్-శారదాంబ స్మారక కమిటీ**

## పతంజలి పురస్కారం

కెఎన్‌వై పతంజలి పేరిట ఏటా ఇస్తున్న ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అట్టాడ అప్పలనాయుడు స్వీకరిస్తారు. పురస్కారం కింద రూ.5వేలు నగదు ఇస్తారు. పురస్కార ప్రదాన సభ ఏప్రిల్‌లో జరుగుతుంది.

**ఎన్‌కె బాబు**

## నవలలు, నానీల పోటీ

విశాలాక్షి సాహిత్య మాస పత్రిక ఆధ్వర్యంలో పోటీకి నవలలు, నానీలను ఆహ్వానిస్తున్నాం. ఉత్తమ నవలకు రూ.25వేలు, ఉత్తమ నానీలకు రూ. 3వేలు బహుమతి. ఈ రచనలను జులై 25లోగా చిరునామా: పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి, వంశీ నర్సింగ్ హోమ్, ఇందిరా భవన్‌రోడ్, నెల్లూరు-524001కు పంపాలి. మరిన్ని వివరాలకు ఫోన్: 94402 79594.

**ఈతకోట సుబ్బారావు**

## ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ పరిషత్‌కు విన్నపం

రాష్ట్ర విభజన తర్వాత ఉమ్మడి గ్రంథాలయ సంస్థ విభజన జరిగాక తెలంగాణ గ్రంథాలయ పరిషత్ ఇప్పటి వరకు మూడుమార్లు పుస్తకాల కొనుగోలు ప్రకటనలు ఇచ్చింది. కానీ ఇప్పటి దాకా ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ సంస్థ ఒకసారి కూడా కొనుగోలు ప్రకటన చేయలేదు. ఫలితంగా ఆం.ప్ర రచయితలు, ప్రచురణకర్తలు తెలంగాణకు క్యూ కడుతున్నారు. ఆం.ప్ర. గ్రంథాలయ పరిషత్ కూడా కొనుగోలు ప్రకటన ఇవ్వాలని కోరుతున్నాం.

*- సంగిశెట్టి శ్రీనివాస్, పసునూరి రవీందర్, యాకూబ్, మెర్సీ మార్గరెట్, నాళేశ్వరం శంకరం, వఝల శివకుమార్, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, వారాల ఆనంద్, సి.హెచ్. ఉషారాణి.*

# ఒక మెలకువలో



వర్క్ ఫ్రమ్ హోమ్
లెర్న్ ఫ్రమ్ హోమ్
ఇంతింతైన భయానికి,
ఇల్లిల్లూ ఓ బందిఖానా.
మూసివేతలు, మళ్ళింపులూ
మలుపు కొత్తదైనప్పుడు- నెమ్మది
అవసరం, అనివార్యం.

ఇకపై ఉండేవారెవరో,
ఉన్నవాళ్ళని ఊరడించేదెవరో
ఊపిరాడని నిమిషాల కల్లోలం మరపురాక
బ్రతుకంతా తల్లడిల్లేదెవరో
ఇప్పుడైతే ఏం తెలీదు కానీ,
ఇదీ సమసిపోతుంది
అన్ని విపత్తుల్లాగే,
అన్ని యుద్ధాల్లాగే,
ఇదీ ముగిసిపోతుంది.

మూతబడిన స్వేచ్ఛాప్రపంచపు
తలుపులు, మళ్ళీ తెరుస్తాం.
వెలుతురుతో, లోకంతో,
కరచాలనాలు చేస్తాం.

కానీ ఈ ఆపత్సమయాల్లో
దయగా తాకిన పదాలు నేర్పినదేదో
బ్రతుకంతా గుర్తుంచుకోగలమా
అపరిచితుల స్వస్థత కోసం మోకరిల్లి
ఇలా ఇంకెప్పుడైనా ప్రార్థించగలమా
చూసిన ప్రతి ఉదయానికీ,
చెరగా మారని ప్రతి రాతిరికీ
ఇలాగే కృతజ్ఞులమై ఉండగలమా,

దేహాన్ని హృదయం చేసి
సాటి మనిషి పిలుపునిలా వినగలమా
జాగురూకతతో శుభ్రతతో,
దేశాన్ని మనస్సుని మననివ్వగలమా
సమస్త మానవాళీ ఒకే కాంక్షతో
క్షణాలను దొర్లించడం ఊహించగలమా

నీ నుండి నాకింకా చాలా చాలా కావాలని
జీవితాన్నిలా జాలిగా ప్రాధేయపడగలమా
ముద్దాడకుండా, మాట్లాడకుండా
ప్రేమిస్తున్నామని ఎవరికైనా చెప్పగలమా

మిథ్యాప్రపంచపు రెక్కలు మూసి,
సొంత గూటిలోకి వాలిపొమ్మంటే
అనవసరపు ప్రయాణాలు మాని
ఉన్నచోటే ఉండిపొమ్మంటే,
ఉండగలమా
అన్ని తలుపులూ మూసి
నిండునిజంతోటి
రెపరెపలాడే హృదయం తోటి.
ఇలా, ఇంకెప్పుడైనా..?

■ మానస చామర్తి
manasa.chamarthi@gmail.com

# చరిత్ర శిఖరాధిరోహణకై..

మన మూలాలను లోలోతుల్లోకి వెళ్లి తెలుసుకోకపోతే, 'కాల యంత్రం'లో జారిగిలపడకపోతే, ఎప్పటికీ మన గురించి మనం తెలుసుకోలేం. ఇది మా జాతి అని, ఇది మా నేల అని భావించనూలేం. మనవైన వాటినెన్నింటినో అన్యులు మాది అంటూ సగర్వంగా చాటుకుంటూ, తొక్కుకుంటూ వెళ్లిపోతారు. ఈ స్థితికెదురుగా పదునైన ఆయుధాలు సమకూర్చుకోవడానికే 'నర్తనశాల'లో మార్చి 14, 15 తేదీల్లో మస్తిష్క మధనం ఆరంభమైంది.

సూరాడ వరప్రసాద్... ప్రసాద్‌సూరి... విశాఖ జిల్లా రాంబిల్లికి చెందిన 20 ఏళ్ల బీఎఫ్‌ఏ విద్యార్థి. చిత్తర్వు మధు... కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం మామిడికోళ్ళకు చెందిన 68ఏళ్ల హృద్రోగ నిపుణుడు. పోలికే లేని విభిన్న వ్యక్తుల సమూహం. అందరూ తమదైన శైలిలో ఆకట్టుకొనే కథనాలతో తెలుగు ప్రజలకు సుపరిచితులైన రచయితలే. అయితేనేం రెండురోజులపాటు... సుమారు 14గంటలపాటు... మాట్లాడే వారివైపు దీర్ఘంగా చూస్తూ చెవులు రిక్కించి విన్నారు. విషయ పరిజ్ఞానంతో పరిపుష్టమై ఏకధాటిగా సాగిన మాటలను పొల్లుపోకుండా తలలకెత్తుకున్నారు. తెలుగుభాష తలెత్తుకొనేలా చేసిన శప్తభూమి నవలా రచయిత బండి నారాయణస్వామిని ఆత్మీయంగా సత్కరించుకున్నారు. "కుల, ప్రాంతీయ అస్తిత్వాలే నన్ను నడిపించాయి. చరిత్రకారునికి స్వీయ దృక్కోణాలు ఉండకూడదు. కాని కాల్పనిక చారిత్రక సాహిత్యానికి రచయిత, వ్యక్తి దృక్కోణాలు ఉంటాయి," అంటూ ముఖాముఖి కార్యక్రమంలో నారాయణస్వామి పంచుకొన్న అభిప్రాయం.. కొన్ని సందేహాలను తీర్చినా మరికొన్ని ఆలోచనలను, ప్రశ్నలను లేవనెత్తింది.



> "తెలుగువాళ్లు చాలా బద్ధకస్తులు. వంట వండుకొనే తీరిక కూడా ఉండదు కాబట్టి ఆవకాయ పెట్టుకుంటారన్న మాట. వారికి నవల రాసేటంత శక్తి లేదు. ఈ తెలుగు వాళ్ళు మహాభారతాన్ని ఎలా అనువదించారో అస్సలు అర్థం కావడం లేదు. వందల పేజీల చారిత్రక నవలను తెలుగువాడు రాయడమనేది బహుశా ఓ వందేళ్ల తరువాత సాధ్యమేమో?" అంటూ వాడ్రేవు చినవీరభద్రుడు ఒకింత రెచ్చగొట్టేందుకు నవ్వుతూనే ప్రయత్నించినా... అది నిజంగా తెలుగుసాహితీలోకం అవలోకనం చేసుకోవాల్సిన విషయమేనేమో?

తొలిరోజు సమావేశం అర్ధగంట ఆలస్యంగా ఆరంభమైంది. కొవిడ్ 19 భయాందోళనలు ప్రపంచాన్ని వణికిస్తున్నవేళ వస్తారో రారో అన్న నిర్వాహకుల సందేహాలను పటాపంచలు చేస్తూ మొత్తం 36మంది హాజరయ్యారు. ఈమని శివనాగిరెడ్డి తొలి సమావేశానికి సమన్వయకర్త. "ఆది ఆంధ్రుని అడుగులు ఐదు లక్షల సంవత్సరాల క్రితమే ఉన్నాయి. కర్నూలు జిల్లాలోని జ్వాలాపురంలో 74 వేల సంవత్సరాలు క్రీస్తు పూర్వం ఇండోనేసియాలో బద్దలైన అగ్నిపర్వతపు లావా వచ్చిపడింది. దానికింద అవశేషాలు లభ్యమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో రాళ్లు, నాణాలు, శాసనాలు మన చరిత్రను మనకు పట్టిస్తాయి. మ్యూజియంలు ఎన్నో విశేషాంశాలను మనకు చెపుతాయి" అంటూ ఉత్తేజపూరితంగా ఆయన తొలి విభాగాన్ని ఆరంభించారు.

శ్రీకాకుళం వాసి, సాహిత్యంలో చరిత్రను, ప్రత్యేకించి కళింగాంధ్ర చరిత్రను తవ్వితీసే పనిలో నిరంతరాయంగా కృషి చేస్తున్న దీర్ఘాసి విజయభాస్కర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. గతం, వర్తమానం మధ్య సంభాషణే చరిత్ర అని, నదులు ప్రవహిస్తున్న పురాణాలనీ విడమరిచారు. కళింగ దేశ ప్రాచీనత, కళింగానికి జరిగిన అన్యాయాన్ని వివరించిన తీరు సిక్కోలు మాటకారితనాన్ని అందరికీ మరో మారు పరిచయం చేసింది. రామాయణ, మహాభారతాల్లోనే కళింగ దేశ ప్రస్తావన ఉందని ఆయన వివరించారు. రామాయణం, అయోధ్య కాండ 71వ సర్గలో కళింగ ప్రస్తావన ఉందన్నారు. దుర్యోధనుని భార్య భానుమతి కళింగ యువరాణి అనీ, చిత్రాంగదుని కుమార్తె అని చెపుతూ... మహాభారతంలోనూ మమ్మల్ని తొక్కేసారంటూ ఆప్రాంతవాసుల లోలోపలి పొరల్లో ఉన్న అసంతృప్తిని నవ్వుతూనే బయటపెట్టేశారు.

"చరిత్ర మెదడుని బరువెక్కించాలి. చారిత్రక సాహిత్యం మనస్సును తేలిక చేయాలి" అంటూ తెలంగాణవాసి కట్టా శ్రీనివాస్ తన మాటలను ప్రారంభించారు. తెలంగాణ పల్లెల్లో తనకు దొరికిన ఆధారాలు, వాటి ఆధారంగా చరిత్రను తవ్వుతూ వెళ్లిన సందర్భాలను పరిచయం చేశారు. తమ తవ్వకాల్లో వెలుగులోకి వచ్చిన చరిత్రను యథాతథంగా దినపత్రికలో ప్రముఖంగా ప్రచురితమైనప్పుడు రాని స్పందన, దానికి సాహిత్య విలువలను జోడిస్తూ ప్రచురించినపుడు వచ్చిన విషయాన్ని సందర్భోచితంగా వివరించారు. రాయలసీమ నుంచి వచ్చిన వేంపల్లి గంగాధర్ తాను రాస్తున్నప్పటికీ అవి చాలవని, ఇంకా రాయాల్సింది ఎంతో ఉందని నిజాయితీగా ఒప్పుకొన్నట్లే కనిపించింది. సీమలో చరిత్రను చాటిచెప్పే చారిత్రక స్థలాలు ఎలా ధ్వంసమవుతున్నాయో, అసాంఘిక కార్యకలాపాలకు ఎలా నిలయాలవుతున్నాయో చెపుతూ దీని గురించి కూడా రాయాలేమో? అంటూ ధర్మాగ్రహాన్ని ప్రదర్శించాడు. కాలగమనంలో దేవుళ్లను మనిషి ఎలా మారుస్తాడో కళ్లకు కట్టాడు. కడప జిల్లా దానవులపాడులోని పార్శ్వనాథుని విగ్రహం, బిత్తల సామిగా మారిన ఉదంతం ఒక్కటి చాలు... మన దేశంలోని అనేకానేక చారిత్రక ప్రార్థనాలయాల్లో ఏం జరిగి ఉంటుందో ఊహించుకోవడానికి.

చర్చోపచర్చల అనంతరం తలెత్తిన సందేహాలకు, అనుమానాలకు సాయి పాపినేని సమాధానమిచ్చారు. చరిత్ర వక్రీకరణకు గురవుతుందన్న భయంతో ఎక్కడా సాహితీ సృజన ఆగలేదని వివరించారు. విషయసేకరణ కష్టమూ, కొంత ఖర్చుతో కూడినదేనని అంగీకరిస్తూ అందుకు మనం సంసిద్ధులం కావల్సిందేనని స్పష్టం చేశారు. అయితే కార్యశాల ప్రధానోద్దేశం... చారిత్రక నవలలు, కథలు రాయడానికి ముందుకు వచ్చిన రచయితలకు తగిన సూచనలు, సమాచారం అందించడమేనంటూ హామీ ఇచ్చారు.

ఆదిత్య కొర్రపాటి... 28 సంవత్సరాల యువకుడు దక్షిణ భారత దేశ భాషలన్నింటిలోనూ ప్రవేశాన్ని కలిగి ఉండడం, ఆయా భాషల్లో ప్రముఖుల పుస్తకాలను తడిమి ఉండడం... అప్పుడే చూసిన వాళ్లందరికీ అబ్బురమే. మలిరోజు తొలి మాటలు తనవే. రాత్రంతా, మెలుకువ నిండిన నిద్రతో పడిన తాపత్రయం కనిపించింది. 'కాలం నిరవధికం... పృథ్వీ విపులం' అన్న స్లైడ్‌తో మాటలను ఆరంభించాడు. చారిత్రక నవలను ప్రత్యేకంగా నిర్వచించుకోవాల్సిన అవసరాన్ని చెపుతూనే చరిత్ర కథగా మారిన తీరును, అదే సమయంలో కథ చరిత్రగా రూపుతీసుకోవడాన్ని వివరించాడు.

రెండు రోజుల చర్చలను ఒక కొలిక్కి తీసుకు వచ్చే బాధ్యతను తీసుకొన్న చినవీరభద్రుడు... మన చరిత్ర ప్రధానంగా మౌఖికమేనని, చరిత్రను ప్రత్యేకించి రికార్డు చేయడం ఉండదనీ, రాస్తూ పోతే చరిత్ర అవుతుందని అన్నారు. చరిత్రకీ, సాహిత్యానికి మధ్య ఉన్న సున్నితమైన తేడాను ఆయన చిన్న ఉదాహరణతో హత్తుకొనేలా చెప్పారు. "తెలుగు వాళ్లు చాలా బద్ధకస్తులు. వంట వండుకొనే తీరిక కూడా ఉండదు కాబట్టి ఆవకాయ పెట్టుకుంటారన్న మాట. వారికి నవల రాసేటంత శక్తి లేదు. ఈ తెలుగు వాళ్ళు మహాభారతాన్ని ఎలా అనువదించారో అస్సలు అర్థం కావడం లేదు. వందల పేజీల చారిత్రక నవలను తెలుగువాడు రాయడమనేది బహుశా ఓ వందేళ్ల తరువాత సాధ్యమేమో?" అంటూ వాడ్రేవు చినవీరభద్రుడు ఒకింత రెచ్చగొట్టేందుకు నవ్వుతూనే ప్రయత్నించినా... అది నిజంగా తెలుగు సాహితీలోకం అవలోకనం చేసుకోవాల్సిన విషయమేనేమో?

కొండవీడు మ్యూజియం, కోట చూడడానికి బయలుదేరే ముందు సాయి చేసిన ప్రకటన అందరిలోనూ చిన్న కదలికను తెచ్చింది. ఏప్రిల్ 25 నాటికి హాజరైన వారంతా తలా ఒక కథ రాయాలని, జూలై నాటికి పుస్తకంగా తీసుకు వస్తామని చెప్పారు. రాయాల్సిందే అనుకుంటూ బయలుదేరిన సాహితీ బృందంలో సభ్యులు... పాపినేని శివశంకర్, వాడ్రేవు చినవీరభద్రుడు, ఈమని శివనాగిరెడ్డి, దీర్ఘాసి విజయభాస్కర్, బండి నారాయణ స్వామి, మహి బెజవాడ, కుమార్ కూనపరాజు, బీఏ శివప్రసాద్, అనురాధ, ఖదీర్ బాబు, అన్వర్, ఝాన్సీ పాపుదేశి, వేంపల్లి గంగాధర్, బీ సరోజినీ దేవి, బొడ్డేడ బలరామస్వామి, జీవీ శ్రీనివాస్, ముని సురేశ్‌పిళ్ళై, బొల్లోజు బాబా, వెంకట్ శిద్ధారెడ్డి, మత్తి భానుమూర్తి, ఉమ నూతక్కి, దేవదానం రాజు, పూదూరి రాజిరెడ్డి, అనిల్ డ్యానీ, బీ ప్రసూన, చిత్తర్వు మధు, సూరాడ, వరప్రసాద్, హనీఫ్, పూర్ణిమ తమ్మిరెడ్డి, ఆదిత్య కొర్రపాటి, రాణి శివశంకర శర్మ, కట్టా శ్రీనివాస్, అకునూరు హసన్, అరవింద్ ఆర్య, దగ్గుమాటి పద్మాకర్, మనోహర్...

■ చిగురుపాటి సతీష్ బాబు



భర్త విజయ్‌తో...

కళ

# గోడలపై గ్రేట్ ఆర్ట్!

**సాధారణంగా అమ్మాయిలు త్వరగా చదువు పూర్తిచేసి, ఉద్యోగంలో స్థిరపడాలని చూస్తారు. అలాంటి కోర్సులనే ఎంచుకుంటారు. కానీ అందుకు భిన్నంగా 'బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్' (బీఎఫ్ఏ)ను ఎంచుకుని, అందులో రాణిస్తున్నారు కంది స్వాతి. వీధి చిత్రలేఖన ప్రదర్శన ద్వారా తన భర్త విజయ్‌తో కలిసి ఈ రంగంలో ఒక్కో అడుగు ముందుకేస్తున్నారు. ఖమ్మంలో రూ.కోటితో ఇటీవల నిర్మించిన బాస్కెట్‌బాల్ ఇండోర్ స్టేడియం ప్రవేశ ద్వారం గోడ మీద అంతర్జాతీయ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు కోబీ బ్రయంట్ భారీ బొమ్మను అద్భుతంగా గీసి ప్రశంసలు అందుకున్నారు. పలు సామాజిక అంశాలను జోడిస్తూ దేశ విదేశాల్లో తన కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్న ఆమె 'నవ్య'తో ముచ్చటించారు. ఆ విశేషాలే ఇవి...**









"నాది ఖమ్మం పట్టణంలోని ద్వారకా నగర్... అయితే ప్రస్తుతం వృత్తిరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నా. మా నాన్న నాగాచారి కో ఆపరేటివ్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసి రిటైరయ్యారు. అమ్మ శశికళ గృహిణి. నాకొక తమ్ముడు న్నాడు. ఇంటర్ వరకు ఇక్కడే చదివా. మా మేనమామలు కల్లూరి శ్రీధర్, కల్లూరి కరుణాకర్ ఇద్దరు కూడా చిత్రకారులే. వారికి చెందిన 'శ్రీధర్ ఆర్ట్స్' ఇప్పటికీ ఖమ్మంలో ఫేమస్. నా చిన్నప్పటి నుంచి వాళ్లు బొమ్మలు వేస్తుంటే చూసి నేనూ అలాగే వేసేదాన్ని. అలా నాకు కూడా చిత్రకారిణి కావాలనే ఆసక్తి కలిగింది. పాఠశాలలో, కాలేజీలో డ్రాయింగ్ వేసేదాన్ని. ఆ ఆసక్తితోనే ఇంటర్ పూర్తవ్వగానే 'బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్'లో చేరాలనుకున్నా. అయితే అందుకు అమ్మానాన్న ఒప్పుకోలేదు. 'ఈ రంగంలో పెద్దగా అవకాశాలుండవు. ఇంజనీరింగ్ చేసి ఉద్యోగం చూసుకుంటే మంచిది' అని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ నాకు ఆసక్తి ఉన్న రంగంలోనే డిగ్రీ చేయాలనుందని చెప్పడంతో వారు కూడా సరేనన్నారు. ఆ విధంగా హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్‌లో ఎంట్రన్స్ రాసి పెయింటింగ్ విభాగంలో సీటు పొందా. అక్కడే నా సహ విద్యార్థి విజయ్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం, ప్రేమగా మారి ఇద్దరం చదువు అనంతరం ఇంట్లోవాళ్లను ఒప్పించి పెళ్లి చేసుకున్నాం. మేమిద్దరం ఇదే రంగంలో ఉండడం వల్ల ఒకరి పట్ల మరొకరికి అవగాహన ఉంది.

### స్ట్రీట్ ఆర్ట్ వైపు...

చదువు పూర్తి కాగానే ఆర్థికంగా నిలబడాలనుకున్నాం. అందుకు 'స్ట్రీట్ ఆర్ట్'ను వేదికగా చేసుకున్నాం. స్వచ్ఛభారత్, తెలంగాణ ఉద్యమం, రైతాంగ సమస్యలు, రైతుల ఆత్మహత్యలు... ఇలా పలు కోణాల్లో వీధుల్లో ఉండే ఖాళీగోడలపై బొమ్మలు గీసేవాళ్లం. ఇందు కోసం మొదట్లో మేమే ఖర్చులు భరించి మా కళను ప్రదర్శించాం. వరంగల్ జిల్లా రంగశాయిపేట గ్రామంలో ఒక ప్రభుత్వ పాఠశాల అధ్వాన్నంగా ఉంటే, అక్కడకు వెళ్లి మా సొంత డబ్బుతోనే ఆ పాఠశాల పైనుంచి అక్షరాలు జాలువారుతున్నట్టుగా... పిల్లలు వాటిని పట్టుకుంటున్నట్టుగా పెయింటింగ్ వేశాం. దాంతో ఆ పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. అది చూసి అప్పటి ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన స్వగ్రామం కల్లూరు మండలం నారాయణపురంలో ప్రభుత్వ పాఠశాలకు పెయింటింగ్, బొమ్మలు వేయాలని కోరారు. ఆ పాఠశాల గోడలపై కూడా అందమైన బొమ్మల గీసి అందర్నీ ఆకట్టుకునేలా తీర్చిదిద్దాం.

2013లో ఫ్రెంచ్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్నాం. దానికి ఎంపిక అవడంతో నా భర్త విజయ్, నేను 9 నెలలు పారిస్‌లో 'స్ట్రీట్ ఆర్ట్‌'పై ప్రదర్శనలు ఇచ్చాం. అక్కడి ఇళ్లపై, అపార్టుమెంట్లపై అందమైన బొమ్మలు గీశాం. జపాన్ ఎగ్జిబిషన్‌కు కూడా అవకాశం లభించింది. ఇందు కోసం అవసరమైన ఆర్థిక సాయాన్ని (లక్షా 50వేల రూపాయలు) తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసింది. ఇలా విదేశాలతో పాటు మన దేశంలోని పలు రాష్ట్రాల్లో కూడా స్ట్రీట్ ఆర్ట్ వేశాం. 'స్ట్రీట్ ఆర్ట్'ను ప్రమోట్ చేస్తుండడంతో 2016లో 'వోవ్' మేగజైన్ నన్ను గుర్తించింది.

'స్ట్రీట్ ఆర్ట్' అనేది ఇప్పుడిప్పుడే మన దేశంలో గుర్తింపు తెచ్చుకుంటోంది. ఆర్టిస్టులు చాలామంది ఉన్నప్పటికీ 'స్ట్రీట్ ఆర్ట్' వేసేవారు మనదగ్గర చాలా తక్కువ. అందుకే ఈ కళను ప్రభుత్వం ప్రోత్సహించాలి. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలతో పాటు జాతీయ, అంతర్జాతీయ కళాకారులు, క్రీడాకారులు, స్ఫూర్తిదాతలు, చరిత్రకారుల బొమ్మల ప్రదర్శనకు స్ట్రీట్ ఆర్ట్స్ వేదిక కావాలి. ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వ భవనాలు, పాఠశాలల్లో కూడా స్ఫూర్తిని కలిగించే చిత్రాలు, సూక్తులను పెయింటింగ్ ద్వారా వేయించాలి.

### ధైర్యం కావాలి...

గోడలపై పెద్ద పెద్ద పెయింటింగ్ కోసం అపార్టుమెంట్లు, ఎత్తయిన భవనాలకు స్ట్రక్చర్ ఏర్పాటుచేసుకుని, క్రేన్ సాయంతో వేయాల్సి ఉంటుంది. ఇందుకోసం భద్రతపరంగా జాగ్రత్తలు తీసుకుంటాం. అంత ఎత్తున బొమ్మలు వేయాలంటే ధైర్యం కావాలి. అయితే పెయింటింగ్ వేసేప్పుడు అందులో లీనమైపోతాం కాబట్టి ఎప్పుడూ భయపడలేదు. అమ్మాయిలు ఈ రంగంలో తక్కువగా ఉంటారు. అయితే ఆసక్తి ఉంటే దేన్నయినా సాధించొచ్చు. నేను నా భర్త దశాబ్దకాలంగా 'స్ట్రీట్ ఆర్ట్' ద్వారా అనేక బొమ్మలు వేస్తూ ఈ రంగంలో ముందుకు వెళ్తున్నాం. ఇద్దరం ఒకే రంగంలో పనిచేయడం ద్వారా ఒకరి అభిప్రాయాలు ఒకరం పంచుకుంటాం... మొదట్లో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నా ఇప్పుడిప్పుడే ఆ ఇబ్బందుల నుంచి బయటపడి ఆనందంగా ముందుకు సాగుతున్నాం."

● **నలజాల వెంకటరావు**, ఖమ్మం
ఫొటోలు: **వి. రవిశంకర్**



### కేటీఆర్ ప్రశంసించారు...

ఆ మధ్య ఇవాంకా ట్రంప్ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు హైటెక్‌సిటీ ఫ్లైఓవర్ కింద మేము వేసిన స్ట్రీట్ ఆర్ట్స్ పెయింటింగ్ అందర్నీ ఆకట్టుకుంది. 2017లో హైదరాబాద్‌లో 'స్ట్రీట్ ఆర్ట్' ఇంటర్నేషనల్ సెమినార్ జరిగింది. అప్పుడు సెల్‌ఫోన్‌లో మనిషి చిక్కుకుపోయిన దృశ్యాన్ని ఇంటర్‌నెట్ మొబైల్‌ట్రక్ పేరుతో వేశాను. దాన్ని కేటీఆర్ చూసి మమ్మల్ని అభినందించారు. ఖమ్మంలో ఇటీవల పెవిలియన్ గ్రౌండ్‌లో నిర్మించిన ఇండోర్ బాస్కెట్‌బాల్ స్టేడియం గోడ మీద ఇటీవల హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు కోబీ బ్రయంట్ బొమ్మ గీయాలని జిల్లా కలెక్టర్ ఆర్వీకర్ణన్ సూచించారు. వారం రోజుల పాటు నా భర్త, నేను, మరో నలుగురు సహాయకులతో ఆ బొమ్మ వేశాం. స్టేడియం ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి కేటీఆర్ ఆ బొమ్మను చూసి మెచ్చుకున్నారు.



---

**మాతృభూమి దాస్య విముక్తి కోసం 23 ఏళ్లకే ఉరితాడును ముద్దాడిన మహా వీరుడు షహీద్ భగత్‌సింగ్. ఆయన సహచరుడు విజయ్‌కుమార్ సిన్హా మన తెలుగువారి అల్లుడే! భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఉరితీసి నేటికి 90 ఏళ్లు. ఈ సందర్భంగా భగత్‌సింగ్, విజయ్‌ల మైత్రి, మరికొన్ని జాతీయోద్యమ విశేషాలను విజయ్‌కుమార్ కోడలు, పద్మశ్రీ డాక్టర్ శాంతా సిన్హా 'నవ్య'తో పంచుకున్నారు.**

## భగత్‌సింగ్ సహచరుడు
# తెలుగింటి అల్లుడు

జ్ఞాపకం



సుఖ్‌దేవ్, భగత్‌సింగ్, రాజ్‌గురు

"సమాజంపట్ల బాధ్యత, సాటి మనుషులతో ప్రేమగా మెలగడం, భవిష్యత్తు పట్ల ఆశాభావం, జీవితం మీద సానుకూల దృక్పథం... ఇవన్నీ మా మామయ్య, ప్రఖ్యాత స్వాతంత్ర్య సమరయోధుడు విజయ్‌కుమార్ సిన్హా నుంచి నేర్చుకున్నాను.. అప్పుడప్పుడు మనుమరాళ్లు సుధ, దీపలతో తన జాతీయోద్యమ అనుభవాలను చెబుతుండేవారు. మామయ్య స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్. ఆయన తల్లిదండ్రులు శరత్‌కుమారి, మార్కండ్. మామయ్య పెద్దన్న రాజకుమార్ హిందూస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్ (హెచ్‌ఆర్‌ఏ)లో క్రియాశీల సభ్యుడు. ఆయనను 1925, అక్టోబరులో కకోరి కుట్ర కేసులో అరెస్టు చేశారు. ఆ బెంగతో తండ్రి చనిపోయారు. అన్న అరెస్టు, తండ్రి మరణంతో కుటుంబ బాధ్యతలన్నీ మామయ్య మీద పడ్డాయి. అప్పుడు ఆయన వయసు 16 ఏళ్లు. ఆ తరువాత ఇండియన్ టెలిగ్రాఫ్, పయనీర్, స్టేట్స్‌మేన్ లాంటి ప్రఖ్యాత పత్రికల్లో పనిచేశారు.



డాక్టర్ శాంతా సిన్హా

### భగత్‌సింగ్‌తో పరిచయం...

కాన్పూర్‌కు చెందిన ప్రఖ్యాత జాతీయోద్యమకారులు అజయ్‌కుమార్ ఘోష్, బటుకేశ్వర్‌దత్, సచీంద్రనాథ్ సన్యాల్ తదితరులు మా మామయ్యకు చిన్ననాటి స్నేహితులు. హెచ్‌ఆర్‌ఏ ప్రభావంతో ప్రపంచ పోరాటాలపై మామయ్య లోతుగా అధ్యయనం చేశారు. కార్మిక ఉద్యమాల్లో పాల్గొనేవారు. 1927లో భగత్‌సింగ్ కాన్పూర్ వచ్చిన సందర్భంలో ఆయనతో మామయ్యకు పరిచయమయింది. ఆ తరువాత ఢిల్లీలో జరిగిన హెచ్‌ఆర్‌ఏ మహాసభ ఏర్పాట్లు భగత్‌సింగ్, శివవర్మ, సుఖ్‌దేవ్, మా మామయ్య చేశారు.

### వేళాకోళం నిజమైంది!

భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, సుఖ్‌దేవ్‌లతో మామయ్యకున్న తీపి జ్ఞాపకాలెన్నో. వారు ఒక చోట చేరారంటే, అక్కడ నవ్వులు పూయాల్సిందేనని మా అత్తయ్య రాజ్యం ప్రత్యేకంగా చెప్పేవారు. ఆ బృందంలో మామయ్యే అందరికన్నా చిన్న. అందుకే వాళ్ళు ఆయనను 'బచ్చు' (చిన్నోడు) అని పిలిచేవారు. మామయ్యకు, భగత్‌సింగ్‌కు సినిమాలంటే ఇష్టం. వాటిపై చర్చలు కూడా చేసేవారు. వాళ్ళు మామయ్యని ఎప్పుడూ 'విజయ్ సినిమా చూస్తున్నప్పుడే పోలీసులకు దొరికిపోతాడు' అని వేళాకోళం ఆడేవారట! ఆ మాటలు నిజమయ్యాయి. 1929, సెంట్రల్ అసెంబ్లీలో బాంబు దాడి అనంతరం భగత్‌సింగ్ అరెస్టు అయ్యారు. అదే ఏడాది ఆగస్టులో బరేలీలోని ఒక సినిమా థియేటర్‌లో మామయ్యను బ్రిటిష్ పోలీసులు అరెస్టు చేశారు. నిర్బంధంలోనూ ఒక్కోజైలు గదిలో నుంచి ఒకరు పెద్దగా స్వాతంత్ర్యం, దోపిడీ లేని సమాజాన్ని కాంక్షిస్తూ పాట పాడితే, ఆ పక్క గదిలోని ఖైదీ మరో పంక్తిని అందుకొనేవారట..



విజయ్‌కుమార్ సిన్హా, రాజ్యం దంపతులతో పెద్ద మనుమరాలు సుధా సిన్హా

### నేతాజీతో సాన్నిహిత్యం

లాహోర్ కుట్రకేసులో 1930, అక్టోబరు 20న భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు ఉరిశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువడింది. శివవర్మ, మామయ్యతో సహా మిగిలిన వారందరికీ జైవిత ఖైదు విధించింది. తర్వాత ఏడాది మార్చి 23న రోజున ఉరి తీర్పు అమలుచేశారు. ఆ ఏడాది నవంబరు 5న లాహోర్ నుంచి రాజమండ్రి సెంట్రల్ జైలుకు మామయ్యతోపాటూ శివవర్మను తరలించారు. అప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో జాతీయోద్యమంలో పాల్గొని ఖైదీలుగా ఉన్న పట్టాభి సీతారామయ్య, టంగుటూరి ప్రకాశం పంతులు, మా అత్తగారి తండ్రి, గాంధేయవాది అన్నే అంజయ్య తదితరులతో మా మామయ్యకు పరిచయం ఏర్పడింది. అక్కడ రాజకీయ ఖైదీల హక్కులకోసం ఆయన నిరంతర పోరాటం సాగించారు. మామయ్య కుటుంబంతో నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కి సాన్నిహిత్యం ఉండేది. స్వాతంత్ర్యానంతరం కూడా భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, నేతాజీ తదితర యోధుల కుటుంబ సభ్యులతో మామయ్య ఆత్మీయానుబంధం కొనసాగింది.

### అహింస మీదే విశ్వాసం!

అండమాన్ జైలులో తన ఉద్యమ సహచరులతో కలిసి రాజకీయ ఖైదీల హోదా కోసం సుదీర్ఘ కాలం మామయ్య పోరాడారు తోటి ఖైదీలకు హిందీ, ఇంగ్లీషు భాషలనూ నేర్పేవారు. ఆ నిర్బంధంలో అనుభవించిన చిత్రహింసల గురించి మామయ్య ప్రస్తావించేవారు కాదు. 1938లో అనారోగ్యం కారణంగా మామయ్యని విడుదల చేశారు. తర్వాత "అండమాన్ దీవులు-భారతీయ బాస్టిల్" పుస్తకం రాశారు. కానీ బ్రిటిష్ ప్రభుత్వం ఆ పుస్తకాన్ని నిషేధించింది. 1941లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, మరో నాలుగేళ్లు జైలుశిక్ష అనుభవించారు. 14వ ఏట జాతీయోద్యమంలోకి అడుగుపెట్టిన మామయ్య సుమారు 14 ఏళ్ళు జైలులోనే గడిపారు. మా అత్తగారు రాజ్యంతో మామయ్య పరిచయం, పెళ్లి ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్యోద్యమ ఘట్టాల్లో భాగమే! 1946లో ఇరువురి వివాహం జరిగింది. అప్పటికే అత్తయ్య ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌లో కీలకంగా పనిచేస్తున్నారు. ఆమె శాంతినికేతన్‌లో ఉన్నత విద్యను పూర్తిచేశారు. తర్వాత ఇరువురూ హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. 1992, జూలై 16న తెలుగు నేల మీదే మామయ్య కన్నుమూశారు. మామయ్య అనుభవాలను అత్తయ్య 'విజయ్‌కుమార్ సిన్హా - ఎ రెవల్యూషనరీస్ క్వెస్ట్ ఫర్ శాక్రిఫైస్' పేరుతో రాశారు. సమాజ పరివర్తనకు అహింసా మార్గమే శరణ్యమని మామయ్య విశ్వసించారు. భగత్‌సింగ్ పేరు వింటేనే పులకించేవారు. ఆ మహనీయునితో ఆయనకున్న మధుర జ్ఞాపకాలను అప్పుడప్పుడు ఇతరులతో పంచుకునేవారు. 'ది లెజెండ్ ఆఫ్ భగత్‌సింగ్' సినిమాలోనూ మామయ్య పాత్రను చూపించారు."

● **కె.వెంకటేశ్**

---

అవగాహన

# సెల్‌ఫోన్ శుభ్రం కరోనా

కరోనా బారినపడకుండా ఉండడం కోసం శానిటైజర్‌తో ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకుంటున్నారు. మాస్క్‌లు ధరిస్తున్నారు. పదే పదే ముఖంపై చేతులు పెట్టుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అంతవరకు బాగానే ఉంది కానీ పదే పదే ఉపయోగించే మీ ఫోన్ సంగతేంటి? కరోనాకు చెక్ పెట్టాలంటే ఫోన్‌ను శానిటైజ్ చేసుకోవాలి అంటున్నారు డాక్టర్లు.

- ఆఫీసులో డెస్క్‌పై, కంప్యూటర్స్‌పై ఎక్కడ పడితే అక్కడ ఫోన్ పెడుతూ ఉంటారు. కరోనా వ్యాప్తి చెందడానికి ఫోన్ కూడా కారణం కావచ్చు. ఈ విషయాన్ని డాక్టర్లు సైతం గుర్తు చేస్తున్నారు. అందుకే చేతులు మాత్రమే శుభ్రం చేసుకోవడం కాకుండా, ఫోన్‌ను సైతం శుభ్రం చేయాలని సూచిస్తున్నారు.
- ఒక వ్యక్తి సగటున ఒక రోజులో 2600 సార్లు ఫోన్ ముట్టుకుంటున్నాడు. అధ్యయనంలో భాగంగా 94 మందిని పరిశీలించి ఈ విషయాన్ని వెల్లడించారు.
- కరోనా వేగంగా విస్తరించడానికి ఫోన్ కూడా ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు.
- ఫోన్‌పై ఒక చదరపు అంగుళం విస్తీర్ణంలో సుమారు 25 వేల బ్యాక్టీరియా ఉంటుందట. ఈ సంఖ్య టాయిలెట్ సీట్‌పై ఉండే క్రిముల కన్నా ఎక్కువట.
- స్మార్ట్‌ఫోన్ స్క్రీన్‌పై వైరస్ 96 గంటలపాటు సజీవంగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది ఫోన్ ఉపయోగిస్తున్న వారి ఆరోగ్యంపైనే కాకుండా, ఇతర ప్రదేశాలకు విస్తరించడానికి కారణమవుతోంది.
- చేతులను శానిటైజర్‌తో శుభ్రం చేసుకున్నట్టుగానే ఫోన్‌ను శుభ్రం చేసుకోవడానికి శానిటైజర్ తయారుచేసుకోవాలి.
- ఆల్కహాల్ ఉన్న శానిటైజర్‌ను ఫోన్ శుభ్రం చేసుకోవడానికి ఉపయోగించవచ్చు. అయితే దీనివల్ల ఫోన్ దెబ్బతినే అవకాశం ఉంటుంది. దీనికి ప్రత్యామ్నాయంగా ఇథనాల్, హైడ్రోజన్ పెరాక్సైడ్ కలిపిన ద్రావణాన్ని ఫోన్ శుభ్రం చేసుకోవడానికి ఉపయోగించుకోవచ్చు.
- 70 శాతం ఐసోప్రొపైల్ ఆల్కహాల్ ఉన్న శానిటైజర్ కూడా వాడొచ్చు. క్లోరోక్స్ వైప్స్‌నూ ఉపయోగించవచ్చని ఆపిల్ కంపెనీ తెలిపింది.
- ఫోన్‌ను శుభ్రం చేయడానికి మైక్రోఫైబర్ క్లాత్‌ను ఉపయోగించాలి.
- ఫోన్‌ను శుభ్రం చేసేటప్పుడు ఛార్జింగ్‌లో పెట్టవద్దు.
- ఫోన్‌కు ఉన్న ప్రొటెక్టింగ్ కవర్లను తొలగించాలి.
- శానిటైజర్‌ను నేరుగా ఫోన్‌పై స్ప్రే చేయడం సరైన పద్ధతి కాదు. వస్త్రంపై ద్రావణాన్ని స్ప్రే చేసి నెమ్మదిగా శుభ్రం చేసుకోవాలి. ప్రొటెక్టింగ్ కవర్‌ను కూడా శుభ్రం చేయాలి. తరువాత కాసేపు ఆరనివ్వాలి.
- పవర్‌బ్యాంక్, ఇయర్‌ఫోన్స్‌ను సైతం శానిటైజ్ చేసుకోవడం మరువద్దు.



---

స్ఫూర్తి





# బైక్ ట్యాక్సీ బతుకునిచ్చింది!

ఆపదలో ఉన్నప్పుడు బంధువులు ఆదుకోకపోవచ్చు, మిత్రులు స్నేహహస్తం అందించకపోవచ్చు, కానీ కష్టపడేతత్వం ఉంటే క్లిష్టపరిస్థితుల్లో మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడవచ్చు అని నిరూపిస్తున్నారు కాంతా చౌహాన్. పంజాబ్‌లోని జలంధర్‌కు చెందిన కాంత చిన్నపిల్లగా ఉన్నప్పుడే తండ్రి మరణించాడు. కుటుంబం గడవకపోవడంతో ఇంటర్‌తో చదువు ఆపి తల్లిని, ముగ్గురు తోబుట్టువులను చూసుకోవాల్సిన బాధ్యత ఆమె మీద పడింది. ఆ కష్టాలు పెళ్లయ్యాక కూడా కొనసాగాయి. భర్తకు యాక్సిడెంట్ అవ్వడంతో కుటుంబ పోషణ కష్టమైంది. అతనికి వైద్యం చేయించడం, కూతురును సాకడం కోసం ఆమె 'ర్యాపిడో' బైక్ డ్రైవర్‌గా కొత్త అవతారం ఎత్తారు.

తొలుత ఆమెను చూడగానే రైడర్లు ముందు షాక్ అవుతున్నారు. తరువాత 'ఈ బైక్ ట్యాక్సీ డ్రైవర్ ఉద్యోగాన్ని ఎందుకు ఎంచుకున్నారు' అని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. కాంత వారి ప్రశ్నలన్నింటికీ ఓపిగ్గా సమాధానాలు చెబుతారు. 'కుటుంబం కోసం బాగా కష్టపడుతున్నావు' అని కొంతమంది రైడర్లు కాంతను అభినందిస్తుంటే, కొంతమంది మాత్రం ఆడవాళ్లు నడిపే బైక్ ఎక్కడాన్ని నామోషీగా భావించి రైడ్ రద్దు చేసుకుంటున్నారు.

పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, చండీగఢ్ రాష్ట్రాల్లో 'ర్యాపిడో' బైక్ ట్యాక్సీ నడిపే మొదటి మహిళా కెప్టెన్‌గా కాంత గుర్తింపు దక్కించుకున్నారు. "మహిళలు మనసు పెట్టాలే గానీ ఏ ఉద్యోగమైనా సరే చక్కగా చేయగలరు" అంటారు కాంత.

"ర్యాపిడోలో బైక్ డ్రైవర్‌గా పనిచేయడం వల్ల ఆదాయం రావడమే కాదు, మనకు కుదిరిన సమయంలో పనిచేయవచ్చు. 'ర్యాపిడో'తో నా కూతురును చదివించుకోగలను, కుటుంబాన్ని పోషించుకోగలను అనే నమ్మకం కలిగింది. ఇలాగే కష్టపడి తొందర్లోనే మాకోసం ఓ ఇల్లు కూడా కట్టుకుంటాను" అని ఆమె ఆత్మవిశ్వాసంతో చెప్పారు.



భారతదేశం ప్రధానంగా వ్యవసాయిక దేశం. ఇప్పటికీ అధిక శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. వ్యవసాయ, దాని అనుబంధ రంగాల అభివృద్ధి ప్రక్రియను శాస్త్రీయంగా అధ్యయనం చేయడం కోసం ఎన్నో కోర్సులు అందుబాటులో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో అగ్రికల్చర్ సంబంధిత కోర్సులను అభ్యసించాలంటే ఎంసెట్ రాయాల్సిందే. అయితే దీనికి ప్రత్యామ్నాయంగా ఉన్న మరో వేదిక ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐకార్). దీని ద్వారా జాతీయ స్థాయి విద్యా సంస్థల్లో అగ్రికల్చర్ కోర్సులు చదివే అవకాశం లభిస్తుంది. 2020-21 విద్యా సంవత్సరానికి ఐకార్ అనుబంధ కాలేజీలు, యూనివర్సిటీల్లో యూజీ, పీజీ, డాక్టోరల్ కోర్సుల్లో ప్రవేశం కోసం నోటిఫికేషన్ వెలువడింది. సంబంధిత వివరాలు..

# వ్యవసాయ కోర్సులకు జాతీయ మార్గం

యూజీ, పీజీ, పోస్ట్ డాక్టోరల్ కోర్సుల్లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)గా ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించే రాత పరీక్షల ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. ఎంచుకున్న కోర్సును బట్టి రాత పరీక్ష వేర్వేరుగా ఉంటుంది. ఐకార్ తరపున నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ రాత పరీక్షలను నిర్వహిస్తుంది.

## కోర్సులు.. ప్రవేశం

### యూజీ

- **కోర్సులు:** బీఎస్సీ (ఆనర్స్), అగ్రికల్చర్, బీఎస్సీ (ఆనర్స్), హార్టీకల్చర్, బీఎఫ్ఎస్సీ, బీఎస్సీ (ఆనర్స్), ఫారెస్ట్రీ, బీఎస్సీ (ఆనర్స్) కమ్యూనిటీ సైన్స్, ఫుడ్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్, బీఎస్సీ (ఆనర్స్), సెరికల్చర్, బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బీటెక్ డెయిరీ టెక్నాలజీ, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, బీటెక్ బయోటెక్నాలజీ. కాలపరిమితి మూడు సంవత్సరాలు.
- **అర్హత:** ఇంటర్ (మ్యాథమెటిక్స్ / బయాలజీ / అగ్రికల్చర్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో).
- **ప్రవేశం:** ఐకార్ - ఆల్ ఇండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ఫర్ అడ్మిషన్ (ఏఐఈఈఏ)-యూజీ పరీక్ష ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. ఇందులో 150 ప్రశ్నలు ఉంటాయి. సమాధానాలను గుర్తించడానికి కేటాయించిన సమయం 150 నిమిషాలు. సరైన సమాధానానికి 4 మార్కులు. నెగిటివ్ మార్కింగ్ ఉంది. ప్రతి తప్పునకు 1 మార్కు కోత విధిస్తారు. ఎంచుకున్న కోర్సును బట్టి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, బయాలజీ, అగ్రికల్చర్‌లలో ఏవైనా మూడు సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సబ్జెక్ట్ నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. ఇంటర్మీడియెట్ స్థాయిలో ప్రశ్నల క్లిష్టత ఉంటుంది.

### పీజీ

- **కోర్సులు:** ప్లాంట్ బయోటెక్నాలజీ, ప్లాంట్ సైన్సెస్, ఫిజికల్ సైన్స్, ఎంటమాలజీ అండ్ నెమటాలజీ, అగ్రోనమీ, సోషల్ సైన్సెస్, స్టాటిస్టికల్ సైన్సెస్, హార్టీకల్చర్, ఫారెస్ట్రీ / అగ్రోఫారెస్ట్రీ అండ్ సిల్వీకల్చర్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, వాటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, హోమ్‌సైన్స్ / కమ్యూనిటీసైన్స్, యానిమల్ బయోటెక్నాలజీ, వెటర్నరీ సైన్స్, యానిమల్ సైన్స్, ఫిషరీస్ సైన్స్, డెయిరీ సైన్స్, డెయిరీ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ, అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్.
- **అర్హత:** కోర్సులను అనుసరించి బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ / హార్టీకల్చర్ / ఫారెస్ట్రీ / కమ్యూనిటీసైన్స్ / సెరికల్చర్, బీఎఫ్ఎస్సీ, ఫుడ్ న్యూట్రిషన్ అండ్ డైటిటిక్స్, బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బీటెక్ డెయిరీ టెక్నాలజీ, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, బీటెక్ బయోటెక్నాలజీ.
- **ప్రవేశం:** ఐకార్ ఏఐఈఈఏ - పీజీ పరీక్ష ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. ఇందులో 120 ప్రశ్నలు ఉంటాయి. సమాధానాలను గుర్తించడానికి కేటాయించిన సమయం 120 నిమిషాలు. సరైన సమాధానానికి 4 మార్కులు. నెగిటివ్ మార్కింగ్ ఉంది. ప్రతి తప్పునకు 1 మార్కు కోత విధిస్తారు. ఎంచుకున్న స్పెషలైజేషన్‌ను బట్టి ప్లాంట్ బయోటెక్నాలజీ, ప్లాంట్ సైన్సెస్, ఫిజికల్ సైన్స్, ఎంటమాలజీ - నెమాటలజీ, అగ్రోనమీ, సోషల్ సైన్సెస్, స్టాటిస్టికల్ సైన్సెస్, హార్టీకల్చర్, ఫారెస్ట్రీ / అగ్రోఫారెస్ట్రీ / సిల్వీకల్చర్ తదితర ప్రధాన సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

### పోస్ట్ డాక్టోరల్

- **కోర్సులు:** క్రాప్ సైన్సెస్ - 1, క్రాప్ సైన్సెస్ - 2, క్రాప్ సైన్సెస్ - 3, హార్టీకల్చర్, వెటర్నరీ అండ్ యానిమల్ సైన్సెస్ - 1, వెటర్నరీ అండ్ యానిమల్ సైన్సెస్ - 2, వెటర్నరీ అండ్ యానిమల్ సైన్సెస్ - 3, డెయిరీ సైన్స్, డెయిరీ టెక్నాలజీ అండ్ ఫుడ్ టెక్నాలజీ, అగ్రికల్చర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, హోమ్ సైన్స్ / కమ్యూనిటీ సైన్సెస్, ఫిషరీ సైన్సెస్, అగ్రికల్చర్ ఎకనామిక్స్ అండ్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్, అగ్రికల్చర్ స్టాటిస్టిక్స్ తదితర సబ్జెక్టులు.
- **అర్హత:** ఆయా విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ.
- **ప్రవేశం:** ఐకార్ ఏఐఈఈఏ - జేఆర్ఎఫ్ / ఎస్ఆర్ఎఫ్ పరీక్ష ద్వారా ప్రవేశం కల్పిస్తారు. ఇందులో 120 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో పార్ట్-ఏ కింద 20 ప్రశ్నలు జనరల్ ఎబిలిటీ, రీజనింగ్ ఎబిలిటీ నుంచి వస్తాయి. పార్ట్-బి కింద 50 ప్రశ్నలు కోర్ గ్రూప్ స్పెషలైజేషన్ ఆధారంగా ఉంటాయి. పార్ట్-సిలో 50 ప్రశ్నలు ఎంచుకున్న స్పెషలైజేషన్ నుంచి వస్తాయి. సరైన సమాధానానికి 4 మార్కులు. ప్రతి తప్పునకు 1 మార్కు కోత విధిస్తారు. సమాధానాలను గుర్తించడానికి ఉండే సమయం 120 నిమిషాలు.

## సీట్ల కేటాయింపు

ఏఐఈఈఏ యూజీ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లోని 15 శాతం సీట్లను భర్తీ చేస్తారు. ఝాన్సీలోని రాణీ లక్ష్మీబాయి సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, కర్నాల్‌లోని నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పూసాలోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలోని 100 శాతం సీట్లను ఏఐఈఈఏ యూజీ ద్వారా భర్తీ చేస్తారు. పీజీ, జేఆర్ఎఫ్ / ఎస్ఆర్ఎఫ్ విద్యార్థులకు మాత్రం దేశవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లోని 25 శాతం సీట్లు కేటాయిస్తారు. డీమ్డ్ యూనివర్సిటీలైన ఇండియన్ అగ్రికల్చర్ యూనివర్సిటీ (ఐఏఆర్ఐ), ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐవీఆర్ఐ), నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌డీఆర్ఐ), సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్ (సీఐఎఫ్ఈ) లలో మాత్రం 100 శాతం సీట్లను ఐకార్ ఏఐఈఈఏ - పీజీ/జేఆర్ఎఫ్ /ఎస్ఆర్ఎఫ్ ద్వారానే భర్తీ చేస్తారు.

## ముఖ్యమైన సమాచారం

- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31, 2020
- రాత పరీక్ష తేదీ: జూన్ 1, 2020.
- వెబ్‌సైట్: ntaicar.nic.in

### స్కాలర్‌షిప్

పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం ఉంది. ఇందుకోసం ఐకార్ పీజీ స్కాలర్‌షిప్, నేషనల్ టాలెంట్ స్కాలర్‌షిప్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. మెరిట్ ఆధారంగా 600 మందిని ఎంపిక చేస్తారు. వారికి నెలకు రూ.12,640తో పాటు కంటింజెంట్ గ్రాంటు కింద సంవత్సరానికి రూ. 6000 ప్రోత్సాహకం లభిస్తుంది. పీహెచ్‌డీలో చేరిన వారికి మొదటి రెండేళ్లు నెలకు రూ. 31,000 మూడో ఏడాది నుంచి నెలకు రూ. 35,000 ఇస్తారు.

### ఆవిష్కరణలకు కేరాఫ్

వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఆవిష్కరణల కోసం కేంద్ర ప్రభుత్వం ఐకార్ సంస్థను ఏర్పాటు చేసింది. వ్యవసాయ యూనివర్సిటీలు, కాలేజీలకు గుర్తింపునిచ్చే నేషనల్ అగ్రికల్చరల్ ఎడ్యుకేషన్ అక్రెడిటేషన్ బోర్డు కూడా ఈ సంస్థ ఆధ్వర్యంలోనే పని చేస్తుంది. ఐకార్‌కు అనుబంధంగా దేశవ్యాప్తంగా 15 జాతీయ పరిశోధన కేంద్రాలు, 3 కేంద్రీయ వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, 4 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, 4 డీమ్డ్ యూనివర్సిటీలు, 64 స్టేట్ అగ్రికల్చర్, వెటర్నరీ, హార్టీకల్చర్, ఫిషరీ యూనిర్సిటీలు ఉన్నాయి.

### మన యూనివర్సిటీలు

తెలుగు రాష్ట్రాల్లోని ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ - గుంటూరు, వైఎస్ఆర్ హార్టీకల్చర్ యూనివర్సిటీ - తాడేపల్లిగూడెం, శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ - తిరుపతి, కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టీకల్చర్ యూనివర్సిటీ - హైదరాబాద్, పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ - హైదరాబాద్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ - హైదరాబాద్‌లలో కూడా ఐకార్ నిర్దేశించిన విధంగా నేషనల్ పూల్ సీట్లు ఉంటాయి. వీటికోసం ఇతర రాష్ట్రాల విద్యార్థులతోపాటు తెలుగు విద్యార్థులు కూడా పోటీపడొచ్చు.

---

దేశంలో సాంకేతిక విద్యను అందించడంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల తరవాతి స్థానం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లదే. మారుతున్న అవసరాలకు అనుగుణంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరిశ్రమలు కోరుకుంటున్న నైపుణ్యాలను పెంపొందించే విధంగా విద్యను బోధించడంలో నిట్‌లది అందవేసిన చేయి. అందుకే నిట్‌లలో అడ్మిషన్లకు ఎంతో పోటీ నెలకొని ఉంటుంది. ఇంజనీరింగ్‌తోపాటు ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సులను కూడా నిట్‌లో బోధిస్తారు. ఈ క్రమంలో 2020-21 విద్యా సంవత్సరానికి ఎంసీఏ (మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సులో ప్రవేశానికి వీలు కల్పించే నిమ్ సెట్ (నిట్ ఎంసీఏ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)-2020కు ప్రకటన వెలువడింది. వివరాలు..



# నిట్‌లో చేద్దాం ఎంసీఏ

నిమ్‌సెట్-2020 పరీక్షను నిట్-రాయ్‌పూర్ నిర్వహిస్తుంది. ఈ పరీక్ష ద్వారా 10 నిట్‌లతోపాటు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఎంసీఏలో కూడా అడ్మిషన్ పొందొచ్చు. **నిమ్‌సెట్‌లో పాల్గొంటున్న ఇన్‌స్టిట్యూట్‌ల వారీగా సీట్ల సంఖ్య:** నిట్-అగర్తలా - 30; నిట్-అలహాబాద్ - 116; నిట్-భోపాల్ - 115; నిట్ - కాలికట్ - 58; నిట్-జెంషెడ్‌పూర్ - 115; నిట్ - కురుక్షేత్ర - 64; నిట్-రాయ్‌పూర్ - 110; నిట్-సూరత్కల్ - 58; నిట్-తిరుచారపల్లి - 115; నిట్-వరంగల్ - 58; నిట్-కురుక్షేత్ర సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు- 32.

### పరీక్ష ఇలా

నిమ్‌సెట్‌ను ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లీష్ భాషలో మాత్రమే ఉంటుంది. ప్రతి సరైన సమాధానానికి నాలుగు మార్కులు కేటాయిస్తారు. నెగిటివ్ మార్కులు కూడా ఉన్నాయి. ప్రతి తపునకు ఒక మార్కు కోత విధిస్తారు. సమాధానాలను గుర్తించడానికి 120 నిమిషాల (రెండు గంటలు) సమయం ఇస్తారు. ఇందులో నాలుగు విభాగాల నుంచి 120 ప్రశ్నలు ఇస్తారు. అవి.. మ్యాథమెటిక్స్ (50 ప్రశ్నలు), అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ (40 ప్రశ్నలు), కంప్యూటర్ అవేర్‌నెస్ (10 ప్రశ్నలు), జనరల్ ఇంగ్లీష్ (20 ప్రశ్నలు).

### అర్హత

60 శాతం మార్కులు లేదా 6.5 సీజీపీఏ (ఎస్సీ / ఎస్టీలకు 55 శాతం లేదా 6 సీజీపీఏ)తో బీఎస్సీ / బీఎస్సీ (ఆనర్స్) / బీసీఏ / బీఐటీ (మ్యాథమెటిక్స్ లేదా స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా) లేదా బీఈ / బీటెక్. చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

### మార్కుల గణన

నిమ్‌సెట్‌లో మ్యాథమెటిక్స్ విభాగం లేదా మొత్తం పరీక్షలో నెగిటివ్ మార్కులు / సున్నా మార్కులను వచ్చిన వారిని అనర్హులుగా పరిగణనిస్తారు. మార్కులను గణించే క్రమంలో ఒక ప్రత్యేక విధానాన్ని అనుసరిస్తారు. మ్యాథమెటిక్స్ విభాగంలో వచ్చిన మార్కులను 3తో, అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ విభాగంలో వచ్చిన మార్కులను 1 1/2తో, కంప్యూటర్ అవేర్‌నెస్ మార్కులను 2తో, జనరల్ ఇంగ్లిష్ మార్కులను 1తో గుణిస్తారు. ఈ ప్రక్రియలో 1000 మార్కుల వరకు వెయిటేజీ ఇస్తారు. తరవాత మొత్తం మార్కులను గణించి దాని ఆధారంగా ర్యాంక్ కేటాయిస్తారు. ఇద్దరు అభ్యర్థులకు సమాన మార్కులు వచ్చిన పక్షంలో మ్యాథమెటిక్స్‌లో అధిక మార్కులు స్కోర్ చేసిన వారికి ప్రాధాన్యం ఇస్తారు. తరవాత అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్, కంప్యూటర్ అవేర్‌నెస్ మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు. అప్పటికీ మార్కులు సమానంగా ఉంటే ఎక్కువ వయసు ఉన్న వారికి ప్రవేశం ఖరారు చేస్తారు.

### వేర్వేరుగా దరఖాస్తు

నిమ్‌సెట్ ర్యాంక్ ఆధారంగా ఆసక్తి ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లకు అభ్యర్థి వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రతి నిట్‌లో సాధారణంగా ఆల్ ఇండియా కోటా, హోమ్ స్టేట్ కోటా కింద సీట్లను విభజిస్తారు. కానీ ఎంసీఏ కోర్సుకు ఈ నిబంధన వర్తించదు. ఎంసీఏ కోర్సులోని సీట్లన్నీ ఆల్ ఇండియా కోటా కింద ఉంటాయి. వీటికి ఎవరైనా పోటీపడొచ్చు. ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేస్తారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంసీఏలో చేరాలనుకున్న వారు ఆ సంస్థ ప్రకటన వెలువడినపుడు నిమ్‌సెట్ స్కోరుతో దరఖాస్తు చేసుకోవచ్చు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంసీఏ కోర్సులో 60కిపైగా సీట్లు ఉన్నాయి.

### ముఖ్య సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31, 2020
- రాత పరీక్ష తేదీ: మే 24, 2020
- వెబ్‌సైట్: www.nimcet.in/

---

విశేషం



## ఒకేసారి రెండు చేతులతో..!

ఒక చేత్తో అందంగా బొమ్మలు గీయడం నైపుణ్యమున్న చిత్రకారుని వల్లే అవుతుంది. కానీ అదే ఆర్టిస్టును రెండు చేతులతో బొమ్మలేయమంటే నావల్ల కాదని చేతులెత్తేస్తాడు. అయితే డెట్రాయిట్‌కు చెందిన కోలిన్ డార్క్ అనే ఆర్టిస్టు ఏకకాలంలో రెండు చేతులతో బొమ్మలేయడంలో సిద్ధహస్తుడు. అతని నైపుణ్యం చూస్తే ఎవరైనా మెచ్చుకోకుండా ఉండలేరు. కుడి చేత్తో ఎంత బాగా బొమ్మ వేయగలరో, ఎడమ చేత్తో అంతే బాగా బొమ్మలు వేసే వాళ్లుంటారు. కానీ కోలిన్ మాత్రం రెండు చేతులను ఒకేసారి ఉపయోగిస్తూ, రకరకాల రంగులు వాడుతూ బొమ్మ వేసేస్తాడు. సెలబ్రిటీల బొమ్మలతో మొదలు సినిమా క్యారెక్టర్ల బొమ్మలు, జంతువుల బొమ్మలు, ప్రకృతిని ప్రతిబింబించే చిత్రాలను అవలీలగా వేస్తుంటాడు. ఇన్ని రోజులు తన ప్రతిభ గురించి ఎవరికీ చెప్పుకోలేదు. కానీ ఇటీవలే ఒక మోటివేషనల్ స్పీకర్ ప్రసంగం విని స్ఫూర్తి పొందిన కోలిన్ ఒకేసారి రెండు చేతులతో బొమ్మలు గీస్తోన్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టాడు. ఇక చెప్పేదేముంది సోషల్ మీడియాలో కోలిన్ టాలెంట్‌ను అభినందిస్తూ సందేశాలు వెల్లువెత్తుతున్నాయి.

### జత ఉన్న బొమ్మ ఏది?



### ఏ భాగం ఎక్కడ?





చుక్కలు కలిపి రంగులు వేయండి

### సరైన నీడను గుర్తించండి



### డైలీ సుడోకు - 316

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 1 | | | | 7 | | 3 |
| | 5 | | | 7 | | | | |
| | | | 9 | 8 | | | | 6 |
| | | 6 | | | | 8 | 2 | |
| | | | 3 | | 1 | | | |
| | 2 | 9 | | | | 5 | | |
| 3 | | | | 1 | 2 | | | |
| | | | | 9 | | | 8 | |
| 4 | | 7 | | | | 1 | | |

### సుడోకు- 315 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 4 | 7 | 6 | 8 | 9 | 3 | 5 | 2 |
| 8 | 6 | 2 | 3 | 7 | 5 | 4 | 9 | 1 |
| 9 | 5 | 3 | 4 | 2 | 1 | 7 | 8 | 6 |
| 5 | 1 | 4 | 9 | 6 | 7 | 2 | 3 | 8 |
| 7 | 8 | 9 | 1 | 3 | 2 | 5 | 6 | 4 |
| 2 | 3 | 6 | 8 | 5 | 4 | 1 | 7 | 9 |
| 4 | 7 | 5 | 2 | 9 | 8 | 6 | 1 | 3 |
| 6 | 9 | 1 | 7 | 4 | 3 | 8 | 2 | 5 |
| 3 | 2 | 8 | 5 | 1 | 6 | 9 | 4 | 7 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

## 'ఆటో' ప్లాంట్ల మూసివేత

న్యూఢిల్లీ: కోవిడ్-19 వ్యాప్తిని అరికట్టేందుకు ఆటోమొబైల్ కంపెనీలు ఉత్పత్తిని నిలిపివేస్తున్నాయి. హరియాణాలోని గురుగ్రామ్, మనేసర్ ప్లాంట్లలో ఉత్పత్తి నిలిపివేస్తున్నట్టు మారుతి సుజుకీ ప్రకటించింది. అలాగే హరియాణాలోని రోహ్‌తక్‌లోని కంపెనీ ఆర్ అండ్ డీ కేంద్రాన్ని వెంటనే మూసివేస్తున్నట్టు తెలిపింది. హీరో మోటోకార్ప్, హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ), సుజుకీ మోటార్ సైకిల్ తమ ప్లాంట్లను మూసివేస్తున్నట్టు ప్రకటించాయి. మహీంద్రా నాగ్‌పూర్‌లోని ఉత్పత్తి యూనిట్‌ను ఇప్పటికే మూసివేసింది. సోమవారం రాత్రి నుంచి పుణె, ముంబైలోని రెండు ప్లాంట్లను మూసివేస్తోంది. రాజస్థాన్‌లోని తపుకరా, ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాల్లో ఉన్న రెండు ప్లాంట్లను సోమవారం నుంచి మూసివేస్తున్నట్టు హోండా కార్స్ ఇండియా ప్రకటించింది.

## యథాతథంగా స్టాక్ మార్కెట్ లావాదేవీలు

ముంబై: ముంబై లాక్‌డౌన్ స్టాక్ మార్కెట్లకు వర్తించదు. బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సోమవారం యథాతథంగా పనిచేస్తాయి. ఈ మేరకు సెబీ, బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ప్రకటన విడుదల చేశాయి. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ట్రేడింగ్ సమయాన్ని కుదించాలన్న సూచనలను తోసిపుచ్చాయి. స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన అన్ని విభాగాల్లో యథావిధిగా ట్రేడింగ్ జరుగుతుందని తెలిపాయి. కాగా, స్టాక్ బ్రోకర్లకు కూడా 'వర్క్ ఫ్రం హోమ్' సదుపాయం కల్పిస్తున్నట్టు ప్రకటించాయి.

**ఫారం గేటు అమ్మకం ధరలు** ( నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 22వ తేదీకి.. | | విజయవాడ | 225 |
| హైదరాబాద్ | 210 | విశాఖపట్నం | 245 |
| 23వ తేదీకి.. | | వరంగల్ | 213 |
| చిత్తూరు | 223 | డజను గుడ్లు రూ. 40 | |
| గోదావరి | 225 | | |

**ఫామ్‌గేట్ ధర** (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 33 | విజయవాడ | 30 |
| వరంగల్ | 33 | గుంటూరు | 30 |
| మహబూబ్‌నగర్ | 33 | ఒంగోలు | 30 |
| కరీంనగర్ | 35 | చిత్తూరు | 40 |
| కర్నూలు | 33 | నెల్లూరు | 40 |
| విశాఖపట్నం | 28 | అనంతపురం | 36 |
| గోదావరి | 33 | | |

# కొలువులపై కోవిడ్-19 పంజా

**ఇంటర్వ్యూలను రద్దు చేస్తున్న కంపెనీలు**



ముంబై: కోవిడ్-19 ప్రభావం కొత్త కొలువులపైనా కనిపిస్తోంది. ఇంటర్వ్యూలకు ఎంపికైన 60-65 శాతం మందికి పలు కంపెనీలు ముఖాముఖి పరీక్షలను రద్దు చేయటమో లేదంటే వాయిదా వేస్తున్నాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ), రిటైల్, లాజిస్టిక్స్ వంటి సేవల కంపెనీల్లో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోందని టీమ్‌లీజ్ సర్వీసెస్ బిజినెస్ హెడ్ అమిత్ వదేరా అన్నారు. దీంతో ఈ ఏడాది కొత్త ఉద్యోగులు కొలువుల్లో చేరటం బాగా ఆలస్యమయ్యే అవకాశముందని ఆయన చెప్పారు. అయితే, కొత్త నియామకాలు ఆలస్యమైనా ఉత్పాదకత తగ్గకుండా ఉండేందుకు కంపెనీలు సరికొత్త టెక్నాలజీలపై దృష్టిపెడుతున్నాయన్నారు.

### కొన్ని రంగాల పరిస్థితి మరీ ఘోరం

కరోనా వైరస్ దెబ్బకు ఇప్పటికే కొన్ని రంగాలు నీరసించాయి. ఆతిథ్యం, పర్యాటక, విమానయానం వంటి రంగాలకు చెందిన కొన్ని కంపెనీల పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. దీంతో చాలా కంపెనీల ఆదాయాలు పడిపోయి ఖర్చులు తగ్గించుకునే పనిలో పడ్డాయి. ఇందుకోసం కొన్ని కంపెనీలు ఉన్న సిబ్బందికే జీతాలు ఇవ్వలేక 'లీవ్ విత్ నో పే' అమలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే త్రైమాసికంలో కొత్త నియామకాలు ఎంత లేదన్నా 10-15 శాతం తగ్గే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

### ప్లేస్‌మెంట్లపైనా ప్రభావం

మరోవైపు క్యాంపస్ ప్లేస్‌మెంట్లపైనా కోవిడ్-19 ప్రభావం కనిపిస్తోంది. ఆర్థిక మందగమనం కారణంగా గత ఏడాదితో పోలిస్తే కంపెనీలు ఇప్పటికే క్యాంపస్ ప్లేస్‌మెంట్లు తగ్గించాయి. దీనికి కోవిడ్-19 తోడవడంతో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఇంటర్న్‌షిప్ వచ్చిన విద్యార్థులకూ ఉద్యోగ హామీ లేకుండా పోయింది. ఖర్చులు తగ్గించుకునేందుకు కొన్ని కంపెనీలు వీరిని మధ్యలోనే ఇంటికి పంపిస్తున్నట్టు సమాచారం.

## రూ.2 లక్షల కోట్ల ప్యాకేజీ ఇవ్వండి: సీఐఐ

న్యూఢిల్లీ: కరోనా ద్వారా ఎదుర్కొంటున్న కష్టాల నుంచి బయటపడేందుకు రూ.2 లక్షల కోట్ల ప్రత్యేక సహాయ ప్యా కేజీ కావాలని భారత పారిశ్రామిక రంగం కోరింది. కంపెనీలు బ్యాంకులకు చెల్లించాల్సిన రుణాలను ఏడాది వాయి దా వేయడంతో పాటు పన్ను రేట్లను తగ్గించాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ రూ.2 లక్షల కోట్లను నేరుగా నగదు బదిలీ పథకం కిం ద ప్రజలకు బదిలీ చేయాలని కోరింది. ప్రభుత్వం వెంటనే ఈ చర్యలు తీసుకోకపోతే 2020-21లో జీడీపీ వృద్ధి రేటు 5% దిగువకు పడిపోయే ప్రమాదం ఉందని తెలిపింది.

### ఎల్ఐసీ ప్రీమియం చెల్లింపులకు మరింత గడువు

ముంబై: కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో బీమా ప్రీమియంను నిర్దేశిత కాలంలో చెల్లించలేని పాలసీదారులకు భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) మరింత గడువు ఇచ్చింది. ప్రీమియం చెల్లింపునకు వచ్చే ఏప్రిల్ 15వ తేదీ వరకు గడువు పొడిగించింది.

### ప్రజా బలానికి హ్యాట్సాఫ్

● బాంబినో గ్రూప్ చైర్మన్ కిషన్ రావు



హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి): జనతా కర్ఫ్యూ దేశ ఐక్యతను ప్రతిబింబించిందని బాంబినో గ్రూప్ చైర్మన్ ఎం కిషన్ రావు అన్నారు. 'నా 82ఏళ్ల జీవితంలో ఎన్నో కర్ఫ్యూలు చూశాను. మరెన్నో బంద్‌లు చూశాను. కానీ ప్రజాబలాన్ని చాటి చెప్పింది మాత్రం ఇదే' అని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు దేశ ప్రజలు స్పందించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారందరికీ హ్యాట్సాఫ్ అని అన్నారు.

# 25% రాబడులు హాంఫట్

**ఈక్విటీ ఎంఎఫ్ పథకాలపై కరోనా దెబ్బ**



న్యూఢిల్లీ: కరోనా వైరస్ దెబ్బతో దేశీయ స్టాక్ మార్కెట్లు విపరీతంగా నష్టపోయాయి. ఇన్వెస్టర్లకు లక్షల కోట్ల రూపాయల నష్టంవాటిల్లింది. ఇదేతరుణంలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) పథకాల్లో పెట్టుబడులు పెట్టిన వారికీ నష్టాలు తప్పలేదు. గత నెల రోజుల కాలంలో ఈక్విటీ ఎంఎఫ్ పథకాలు దాదాపు 25 శాతం ప్రతికూల రాబడులను నమోదు చేశాయి. ప్రస్తుతం దేశీయంగా 44 మ్యూచువల్ ఫండ్ సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. కోవిడ్-19కు ఈ సంస్థలు ఏమీ అతీతంగా లేవు. రానున్న కాలంలో కూడా మార్కెట్లలో తీవ్ర హెచ్చుతగ్గులు ఉండవచ్చని, ఫలితంగా స్వల్పకాలం నుంచి మధ్యకాలంలో చిన్న, మధ్యకాలిక ఈక్విటీ పథకాలపై ఒత్తిడి కొనసాగే అవకాశం ఉందని ఐఫాస్ట్ ఫైనాన్షియల్ ఇండియా సీనియర్ రీసెర్చ్ ఎనలిస్టు కృష్ణ కర్వా తెలిపారు. అన్ని ఈక్విటీ స్కీమ్ కేటగిరీల్లో (ఈక్విటీ లింక్డ్ సేవింగ్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్), మిడ్‌క్యాప్, లార్జ్ అండ్ మిడ్‌క్యాప్, లార్జ్ క్యాప్, స్మాల్‌క్యాప్, మిడ్ క్యాప్, మల్టీ క్యాప్) ప్రతికూల రాబడులు వచ్చాయని, ఫిబ్రవరి 19 నుంచి మార్చి 18 వరకు ఇవి 25-26 శాతం శ్రేణిలో ఉన్నట్టు మార్నింగ్‌స్టార్ ఇండియా గణాంకాల ద్వారా వెల్లడైంది. లార్జ్, మిడ్ క్యాప్ ఫండ్స్ 26.63 శాతం, లార్జ్ క్యాప్ ఫండ్స్ 26.58 శాతం, ఈఎల్ఎస్ఎస్ 26.47 శాతం, మల్టీ క్యాప్ 26.45 శాతం, స్మాల్ క్యాప్ 26.32 శాతం, మిడ్ క్యాప్ 24.84 శాతం ప్రతికూల రాబడులనిచ్చాయి. బేర్ మార్కెట్ కారణంగా అన్ని ఫండ్స్ కూడా వాటి బెంచ్‌మార్క్ సూచీలకన్నా దిగువకు పడిపోయాయి. ఇంతకు ముందు కూడా మార్కెట్లో ఇలాంటి పతనాలను చూశామని, అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో మార్కెట్లో నిరాశావాదం కొంత కాలం కొనసాగే అవకాశం ఉందని మార్నింగ్ స్టార్ ఇండియా డైరెక్టర్ (మేనేజర్ రీసెర్చ్) కౌస్తుబ్ బెలాపుర్కర్ తెలిపారు.

### సిప్‌లపై కన్నేయండి

ఇన్వెస్టర్లు ఆస్తుల కేటాయింపు, పెట్టుబడులు, క్రమానుగత పెట్టుబడి ప్లాన్ల (సిప్స్)పై దృష్టిని కొనసాగించాలన్నారు. రిస్క్‌ను బట్టి ఇప్పటిదాకా ఈక్విటీలకు తక్కువ కేటాయింపులు జరిపిన ఇన్వెస్టర్లు ప్రస్తుత తక్కువ వాల్యుయేషన్లలో ఈక్విటీలో పెట్టుబడులు పెంచుకునే అవకాశాన్ని పరిశీలించవచ్చని తెలిపారు. ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టే ఇన్వెస్టర్లు 7-10 ఏళ్ల పెట్టుబడుల కాలాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఇటీవలి కాలంలో నికర ఆస్తుల విలువ (ఎన్ఏవీ) తగ్గినప్పటికీ లార్జ్ క్యాప్, బ్లూచిప్ ఫండ్స్ వేగంగా పూర్వస్థాయికి చేరుకోవచ్చన్నారు. ఇక ప్రస్తుత పరిస్థితుల్లో ఏడాది వరకు కాలపరిమితి కలిగిన డెట్ ఫండ్స్‌పై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టవచ్చని విశ్లేషకులు సలహా ఇస్తున్నారు.

## కొనసాగనున్న బేరిష్ ట్రెండ్

**టెక్ వ్యూ**



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత సోమవారం బేరిష్ ధోరణిలోనే ప్రారంభమై బలమైన డౌన్‌ట్రెండ్ కొనసాగించింది. ఎక్కడా రికవరీ సంకేతం ఇవ్వలేదు. కాని శుక్రవారం నాడు అనూహ్యమైన రికవరీ సాధించి 500 పాయింట్ల వృద్ధితో మానసిక అవధి 8000 వరకు బౌన్స్‌బ్యాక్ అయింది. కాని టెక్నికల్‌గా ఇది డెడ్ క్యాట్ బౌన్స్ పాటర్న్ మాత్రమే. గత కొద్ది వారాలుగా మార్కెట్ తీవ్రమైన ఆటుపోట్లలో ట్రేడవుతోంది. ఈ ఆటుపోట్లు తగ్గి కనీసం కొద్ది రోజులు నిలదొక్కుకున్న తర్వాతే అప్‌ట్రెండ్‌కు ఆస్కారం ఉంటుంది. కనీసం ఒక వారం పాటు కన్సాలిడేట్ అయితే తప్ప ట్రెండ్‌లో కూడా స్పష్టత రాదు. వారం మొత్తం మీద నిఫ్టీ 1200 పాయింట్లు దిగజారింది. గత కొన్నేళ్లలో ఒక వారంలో ఏర్పడిన గరిష్ఠ నష్టం ఇదే. టెక్నికల్‌గా మాత్రం చారిత్రక గరిష్ఠ స్థాయి 12200 నుంచి ఏర్పడిన డౌన్‌ట్రెండ్ కొనసాగుతోంది. ఆ స్థాయి నుంచి 4300 పాయింట్లు దిగజారింది. అయితే విదేశీ మార్కెట్ల సంకేతాలను బట్టి సోమవారంనాడు కూడా బేరిష్ ట్రెండ్ కొనసాగే ఆస్కారం ఉంది. వచ్చే రెండు రోజుల్లో బాటమ్ వరకు దిగజారవచ్చు.

**బుల్లిష్ స్థాయిలు :** సోమవారం ఏర్పడుతుందనుకుంటున్న పతనం అనంతరం పాజిటివ్ ట్రెండ్‌లో పడితే ప్రధాన నిరోధం 8500 వద్ద ఉంది. మరింత అప్‌ట్రెండ్ కోసం ఆ పైన నిలదొక్కుకోవాలి.

**బేరిష్ స్థాయిలు :** 8500 వద్ద విఫలమైతే మరింత డౌన్‌ట్రెండ్‌లో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 8200 వద్ద తప్పనిసరిగా రికవరీ సాధించాలి. అంతకన్నా దిగజారితే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 7900.

**పాటర్న్ :** మార్కెట్ ప్రస్తుతం "ఏటవాలుగా దిగువకు కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా చాలా దిగువన ఉంది. అప్‌ట్రెండ్ సాధించడానికి మరికొంత సమయం పట్టవచ్చు. అలాగే 8200 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద మద్దతు ఉంది. మంత్లీ చార్టుల ప్రకారం సైతం మార్కెట్ ఓవర్‌సోల్డ్ స్థితిలోకి ప్రవేశిస్తున్నందు వల్ల తదుపరి కనిష్ఠ స్థాయిల్లో మద్దతు తీసుకునే ఆస్కారం ఉంది. **టైమ్ :** ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి రివర్సల్ ఉంది.

వాసిరాజు సుందర్ రాజా
www.sundartrends.in

## 9050 పైన ముగిస్తే బుల్లిష్

**ఆస్ట్రో గైడ్**

**(మార్చి 23-27 తేదీల మధ్య వారానికి)**

నిఫ్టీ గత వారం పాయింట్ల 9602-7233 పాయింట్ల మధ్యన విస్తృత పరిధిలో కదలాడి 1210 పాయింట్ల భారీ నష్టంతో 8745 వద్ద నెగెటివ్‌గా ముగిసింది.

- మార్చి 23-25 తేదీల మధ్య కాలంలో కొత్త ఆస్ట్రో మాసంలో ఏర్పడే పరిధి మూడు వారాలకు కీలకం. గరిష్ఠ స్థాయికి పైన బుల్లిష్‌గాను, కనిష్ఠ స్థాయికి దిగువన బేరిష్‌గాను భావించాలి.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 10513, 11479, 11760, 11574 వద్ద ఉన్నాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా (గోల్డెన్ క్రాస్) పైనే ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం. ఈ వారాంతంలో 9050 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలిక ట్రెండ్ బుల్లిష్ అవుతుంది.

**బ్రేకౌట్ స్థాయి :** 9050 **బ్రేక్‌డౌన్ స్థాయి :** 8450

**గ్రహగతులివే..**

● కుంభంలోని పూర్వాభాద్ర పాదం 2 నుంచి మేషంలోని భరణి పాదం 1 మధ్యలో చంద్ర సంచారం ● మీనంలోని ఉత్తరాభాద్ర పాదం 2-3 మధ్యలో రవి సంచారం ● కుంభంలోని శతభిషం పాదం 2-3 మధ్యలో బుధ సంచారం ● మేషంలోని భరణి పాదం4 నుంచి కృత్తిక పాదం1 మధ్యలో శుక్ర సంచారం ● మకరంలోని ఉత్తరాషాఢ పాదం2లో కుజ సంచారం ● మకరంలోని ఉత్తరాషాఢ పాద 3లో కుంభ నవాంశలో శని సంచారం ● ధనుస్సులోని ఉత్తరాషాఢ పాదం1లో ధనుస్సు నవాంశలో బృహస్పతి సంచారం ● మిథునంలోని ఆర్ద్ర పాదం 2లో రాహువు, ధనుస్సులోని మూల పాదం4లో కేతువు సంచారం

**గత వారం నిఫ్టీ : 8745 (-1210)**



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

**నిరోధ స్థాయిలు :**8890, 8975, 9050 (8815 పైన బుల్లిష్)
**మద్దతు స్థాయిలు:**8600, 8225, 8450 (8675 దిగువన బేరిష్)

**సాధారణంగా మెరుగు (సోమవారానికి)**

**తిథి:** ఫాల్గుణ బహుళ చతుర్దశి **నక్షత్రం:** పూర్వాభాద్ర
**అప్రమత్తం :** అశ్విని, మఖ, మూల నక్షత్ర జాతకులు, మీన, కర్కాటక రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 11.52**

**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 వరకు మెరుగ్గా ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 12.45 వరకు నిలకడ/నిస్తేజంగా ఉండి, తదుపరి 3 గంటల వరకు మెరుగ్గా, ఈ తర్వాత చివరి వరకు నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.
**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 10.45 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 12.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. ఒంటి గంట తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 3 గంటల సమయంలో క్లోజ్ చేసుకోవచ్చు.

**నిరోధం : 8800, 8850, 8925**
**మద్దతు స్థాయిలు : 8675, 8625, 8550**

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి



## కరోనా ప్రభావం ఎంత?

**సభ్య దేశాలకు ఐఓసీ ప్రశ్నావళి**

ప్యారిస్: అథ్లెట్ల సన్నాహకాలపై కరోనా వైరస్ ప్రభావం ఎలాఉందో తెలియజేయాలని సభ్య దేశాలను ఐఓసీ కోరింది. ఈమేరకు పలు అంశాలతో కూడిన ప్రశ్నావళిని దేశాల ఒలింపిక్ కమిటీలకు పంపింది. విశ్వక్రీడలను వాయిదా వేయాలని పలు దేశాల ఒలింపిక్ కమిటీలతోపాటు అథ్లెట్లు సైతం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఐఓసీ ఈ ప్రశ్నావళిని పంపినట్టు సమాచారం. అవి వచ్చాక ఒలింపిక్స్ వాయిదాపై నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది.



సచిన్



సింధు

## వైద్య సిబ్బందికి క్రీడాలోకం సెల్యూట్

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ మహమ్మారిపై పోరాటంలో అలుపెరగకుండా శ్రమిస్తున్న వైద్య సేవల సిబ్బందికి దేశ క్రీడాలోకం సెల్యూట్ చేసింది. ఈ మేరకు సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, పీవీ సింధు సహా పలువురు సామాజిక మాధ్యమాల్లో వీడియోలు పోస్ట్ చేశారు. బెంగళూరులో శిక్షణ శిబిరంలో ఉన్న పురుషుల హాకీ జట్టు చప్పట్లతో తెలిపిన సంఘీభావ వీడియోను కోచ్ సొజొర్డ్ మారిన్ తన ట్విటర్‌లో పోస్ట్ చేశాడు. 'కొవిడ్-19పై అలుపెరగని పోరు సలుపుతున్న వీరులకు సెల్యూట్' అని సెహ్వాగ్ పేర్కొన్నాడు. 'కరోనాపై యుద్ధం చేస్తున్న వైద్య సిబ్బందే నిజమైన హీరోలు. మీకు జేజేలు' అని రెజ్లర్ బజ్‌రంగ్ పూనియా ట్వీట్ చేశాడు. 'కొవిడ్-19 బారినుంచి మమ్మల్ని రక్షించడానికి కృషి చేస్తున్న మీకు కృతజ్ఞతలు' అని మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే అన్నాడు. అలాగే వెయిట్‌లిఫ్టర్ మీరాబాయ్ చాను, స్ప్రింటర్ హిమాదాస్, రెజ్లర్ వినేష్ ఫొగట్, షూటర్ హీనా సిద్ధు కూడా సంఘీభావం తెలిపారు.

# వాయిదా వైపే!

**గుట్టుగా ఏర్పాట్లు చేస్తున్న ఒలింపిక్ నిర్వాహక కమిటీ**





**టోక్యో:** కరోనా మహమ్మారి సెగ ఎట్టకేలకు టోక్యో ఒలింపిక్స్ నిర్వాహకులకు తాకింది. విశ్వక్రీడలను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తామంటూ పదేపదే చెబుతూ వస్తున్న నిర్వాహక కమిటీ పునరాలోచనలో పడింది. ఒలింపిక్స్‌ను జరపాలన్న జపాన్ ప్రభుత్వ ఆలోచనకు భిన్నంగా..వాటిని వాయిదా వేయడంతోపాటు ప్రత్యామ్నాయ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్టు ఈ వ్యవహారాలతో సంబంధం ఉన్న ఇద్దరు అధికారులు ఆదివారం వెల్లడించారు. వాస్తవంగా టోక్యో ఒలింపిక్స్ జూలై 24 నుంచి ఆగస్టు 9 వరకు జరగాల్సి ఉంది. కానీ కరోనా వైరస్ ధాటికి క్రీడా రంగం కుదేలైంది. పలు పోటీలు వాయిదా పడ్డాయి. అలాగే ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలు రద్దయ్యాయి. అథ్లెట్ల శిక్షణ కార్యక్రమాలూ బందయ్యాయి. దాంతో ఒలింపిక్స్‌ను వాయిదా వేయాలని పలు దేశాల ఒలింపిక్ కమిటీలు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)ని కోరాయి. చాలామంది అథ్లెట్లు కూడా వాయిదాకే మొగ్గు చూపుతున్నారు. పరిస్థితులు ఇంత తీవ్రంగా ఉన్నా...జపాన్ ప్రభుత్వంతోపాటు ఐఓసీ కూడా ఒలింపిక్స్‌ను యథాప్రకారం నిర్వహించాలన్న పట్టుదలతో ఉన్నాయి. ఒలింపిక్స్ రద్దయితే..రూ. 21,500 కోట్ల స్వదేశీ స్పాన్సర్‌షిప్, ఏర్పాట్లపై వెచ్చించిన రూ. 90 వేల కోట్లు నష్టపోతామని జపాన్ ప్రధాని షింజో అబే ఇటీవల ఆందోళన వ్యక్తంజేశారు. 'వాయిదా వేసేందుకు అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్ల వివరాలను తయారు చేయాల్సిందిగా మమ్మల్ని కోరారు' అని నిర్వాహక కమిటీకి చెందిన ఇద్దరు అత్యున్నత అధికారులు వెల్లడించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ముసాయిదా తయారీలో ఈ ఇద్దరు కీలక పాత్ర పోషిస్తుండడం గమనార్హం. 'బీ, సీ, డీ అనే మూడు ప్రత్యామ్నాయ సమయాలతో కూడిన ప్రణాళికలను మేం రూపొందిస్తున్నాం' అని వారు తెలిపారు. ఒలింపిక్స్ ఆలస్యమైతే ఎంత నష్టం వస్తుందన్న వివరాలనూ వారు సేకరిస్తున్నారు. అయితే ఈ విషయమై స్పందించేందుకు అటు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ, ఇటు జపాన్ ప్రభుత్వ వర్గాలు అందుబాటులో లేవు. నిర్వాహక కమిటీ రెండు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఒకటి క్రీడలను ఒకటి లేదా రెండు సంవత్సరాలు వాయిదా వేయడంకాగా..ప్రేక్షకులు లేకుండా నిర్వహించడం రెండోది. వీటిపై ఈ నెలాఖరులో జరిగే నిర్వాహక కమిటీ చర్చించనుందని ఆ అధికారులు చెప్పారు. అయితే నెల లేదా నెలన్నరపాటు వాయిదా వేసే ఆలోచన కూడా ఉన్నట్టు సమాచారం. ఏ నిర్ణయమైనా జపాన్ ప్రభుత్వంకాక ఐఓసీనే వెల్లడించాల్సి ఉంది. ఈవారంలో ఐఓసీ బోర్డు సమావేశం జరగనుంది.

## ఇద్దరు ఫుట్‌బాలర్లకు కరోనా



ప్రేయసితో డైబాల

**రోమ్:** అర్జెంటీనా స్ట్రయికర్, జువెంటస్ ఆటగాడు పౌలో డైబాల, ఏసీ మిలాన్ మాజీ డిఫెండర్ పౌలో మల్దీని కరోనా బారిన పడ్డారు. తనతోపాటు గార్ల్‌ఫ్రెండ్ ఒరినా సబాని కూడా కరోనా పాజిటివ్‌గా తేలిందని డైబాల ట్వీట్ చేశాడు. అయితే, ఇద్దరూ క్షేమంగా ఉన్నట్టు తెలిపాడు. కాగా, మల్దీనీతోపాటు అతడి కుమారుడు డానియెల్‌కు కూడా వైరస్ సోకింది. వీరిద్దరూ క్వారంటైన్‌ను పూర్తి చేసుకున్నట్టు ఏసీ మిలాన్ క్లబ్ ప్రకటించింది.

### కరోనాతో మాడ్రిడ్ క్లబ్ మాజీ చీఫ్ మృతి

రియల్ మాడ్రిడ్ ఫుట్‌బాల్ క్లబ్ మాజీ అధ్యక్షుడు లోరెంజో శాంజ్ కరోనా వైరస్‌తో మరణించాడు. 76 ఏళ్ల శాంజ్ 1995-2000 మధ్య మాడ్రిడ్ అధ్యక్షుడిగా పని చేశాడు. కరోనా లక్షణాలు కనిపించడంతో ఆసుపత్రిలో చేర్చామని.. చికిత్స పొందుతూ శాంజ్ మరణించాడని అతడి కుమారుడు చెప్పాడు.

## ఇందులో నా ఫొటో ఏది?

**ఐసీసీకి రోహిత్ ప్రశ్న**



**న్యూఢిల్లీ:** భారత స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ ఆడే చక్కటి పుల్ షాట్లకు ఫిదా కాని వారుండరు. ప్రస్తుత క్రికెట్‌లో ఈ షాట్ ఆడడంలో అతడిని మించిన వారు లేరనే వ్యాఖ్యలు వినిపిస్తుంటాయి. కానీ ఐసీసీ నిర్వహించిన ఓ పోల్‌ను చూసిన రోహిత్ వ్యంగ్యంగా స్పందించాడు. 'మీ అభిప్రాయం ప్రకారం గత, ప్రస్తుత క్రికెటర్లలో ఉత్తమ పుల్‌షాట్ ఆడే క్రికెటర్ ఎవరు?' అంటూ రిచర్డ్స్, పాంటింగ్, కోహ్లీ, గిబ్స్‌ల ఫొటోలు ఉంచింది. అయితే, అందులో తన ఫొటో లేకపోవడంపై రోహిత్ స్పందిస్తూ.. 'ఇందులో ఒకరు మిస్ అయ్యారు. నా అంచనా ప్రకారం వర్క్ ఫ్రమ్ హోమ్ చేయడం అంత సులువు కాదు' అని ట్వీట్ చేశాడు. అటు ఫ్యాన్స్ కూడా రోహిత్ సూపర్ అంటూ ఐసీసీకి ట్వీట్లు చేస్తున్నారు. 'రోహిత్, పాంటింగ్‌ల పుల్‌షాట్లు అదుర్స్' అని హర్భజన్ ట్వీట్ చేశాడు.

## ఆ గాయని హోటల్లోనే సఫారీ క్రికెటర్లు





**న్యూఢిల్లీ:** బాలీవుడ్ గాయని కనికా కపూర్ బస చేసిన హోటల్‌లోనే దక్షిణాఫ్రికా క్రికెటర్లు కూడా ఉండడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఇంగ్లండ్ నుంచి స్వదేశానికి తిరిగి వచ్చిన కనికా స్వీయ నిర్బంధంలో ఉండకుండా పార్టీలకు వెళ్లగా ఆమెకు కరోనా పాజిటివ్‌గా ఉన్నట్టు తేలింది. మార్చి 14 నుంచి 16 వరకు ఆమె లఖ్‌నవ్‌లోని ఓ హోటల్‌లో ఉన్న సమయంలో భారత్‌తో రెండో వన్డే కోసం సఫారీలు కూడా అక్కడే బస చేశారు. అయితే కనికా ఎవరెవరిని కలుసుకున్నది సీసీటీవీ ఫుటేజీ ద్వారా తెలుసుకుంటామని పోలీసులు చెప్పారు. ఇక కోల్‌కతా నుంచి దుబాయ్ మీదుగా స్వదేశానికి వెళ్లిన డికాక్ సేన అక్కడ క్వారంటైన్‌లోనే ఉంది.

## 'క్వారంటైన్'గా సాయ్ సెంటర్లు

**న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారి విజృంభిస్తుండడంతో క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) కేంద్రాలను క్వారంటైన్ సెంటర్లుగా ఉపయోగించనున్నట్టు కేంద్ర క్రీడా మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఆరోగ్య శాఖ అభ్యర్థన మేరకు సాయ్ రీజినల్ సెంటర్లు, స్టేడియాలు, హోటళ్లను క్వారంటైన్ కేంద్రాలుగా ఉపయోగించడానికి అనుమతినిస్తున్నట్టు రిజిజు ఆదివారమిక్కడ చెప్పారు.

## పురుషులతో సమంగా వేతనాలు ఇవ్వాలి

**బీబీసీ అధ్యయనంలో భారతీయులు**

**న్యూఢిల్లీ:** పురుష క్రీడాకారులతో సమానంగా మహిళా అథ్లెట్లకూ వేతనాలు చెల్లించాలని ఎక్కువ మంది భారతీయులు అభిప్రాయపడ్డారు. అయితే, పురుషులతో పోల్చితే మహిళల టోర్నీలు అంత మజాగా ఉండవని 38 శాతం మంది అభిప్రాయపడినట్టు బీబీసీ అధ్యయనం తెలిపింది. దేశంలోని 14 రాష్ట్రాల్లో 10,181 మంది అభిప్రాయాలను బీబీసీ సేకరించింది. జీవితంలో క్రీడలు ఎంతో అవసరమని సర్వే చేసిన వారిలో 75 శాతం మంది అభిప్రాయపడినా.. 36 శాతం మంది మాత్రమే ఏదో ఒక ఆట లేదా శారీరక వ్యాయామాల్లో పాల్గొంటున్నట్టు ఆ నివేదిక పేర్కొంది. క్రీడల పట్ల పురుషులు 42 శాతం ఆసక్తిని ప్రదర్శించగా.. మహిళలు 29 శాతం మాత్రమే ఉన్నారు. బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, కబడ్డీ లాంటి ఆటలు అమ్మాయిలకు అంతగా సరిపడవని.. క్రికెట్ ఆడే పురుషులు, మహిళల్లో ఎంతో అంతరం ఉందని చాలామంది అభిప్రాయపడ్డారు.

## అదే జరిగితే నా టీమ్ చెన్నై...



**న్యూఢిల్లీ:** మహిళా ఐపీఎల్ కార్యరూపం దాల్చితే తాను చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టు తరఫున ఆడేందుకు ఇష్టపడతానని లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ తెలిపింది. ఐపీఎల్‌లో ఏ జట్టుకు ఆడాలనుకుంటున్నావని ట్విటర్‌లో అభిమాని అడిగిన ప్రశ్నకు.. 'అవకాశం దక్కితే చెన్నై తరఫున బౌలింగ్ చేయాలనుకుంటున్నా' అని పూనమ్ సమాధానమిచ్చింది.

## 1800 5992 4365

**కరోనా వైరస్‌పై అవగాహనకు టోల్‌ఫ్రీ**

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కంట్రోల్ రూములు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ విజయకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో టోల్‌ఫ్రీ 180059924365 నంబరు నిరంతరం అందుబాటులో ఉంటుందని, పట్టణ ప్రాంత ప్రజలు సంప్రదించి కరోనా వైరస్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు పొందవచ్చని సూచించారు. పరిసరాల పారిశుధ్య సమస్యలపైనా ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చని పేర్కొన్నారు.



పోలవరం నిర్మాణ పనులపైనా జనతా కర్ఫ్యూ ప్రభావం పడింది. కాంక్రీట్ మిక్సింగ్ లారీలు ఆదివారం ఇలా నిలిచిపోయాయి



జనతా కర్ఫ్యూ దృష్ట్యా కాకినాడ జగన్నాథపురంలో నిలిచిపోయిన పడవలు

# 31 దాకా లాక్‌డౌన్

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబానికి ఏప్రిల్ 4న రూ.1000 అందిస్తామని తెలిపారు. బడ్జెట్ పెట్టక తప్పదన్నారు. అది తన చేతుల్లో లేదని, బడ్జెట్ ఆమోదం పొందకపోతే చెల్లింపులు చేయలేం కాబట్టి బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

### అత్యవసరమైతే తప్ప..

'అందరూ 14 రోజుల పాటు ఇళ్లలో నుంచి కదలొద్దు. అత్యవసరమైతే తప్ప బయటకురావొద్దు. 31 వరకు అందరూ ఇళ్లలో కూర్చోగలిగితే కరోనాను తరిమికొట్టగలం. తర్వాత పరిస్థితులను సమీక్షించి తదుపరి నిర్ణయం తీసుకుంటాం. అత్యవసర సరుకులు బ్లాక్‌చేస్తే కఠిన చర్యలుంటాయి. ఏ వస్తువు ఏ ధరకు అమ్మాలో ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. అంతకుమించి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతిజిల్లాలో కలెక్టరు నిత్యావసరాల ధరలు నిర్ణయించి, ప్రకటిస్తారు. దానిపై ఫోన్ నంబరు కూడా ఉంటుంది. ధరలు ఉల్లంఘిస్తే ఫోన్‌చేసి ఫిర్యాదు చేయొచ్చు. సరుకుల కొనుగోలుకు ఇంటినుంచి ఒకరే వెళ్లాలి. అలా వెళ్లినవారు కూడా 2మీటర్ల సామాజికదూరం పాటించాలి. నీళ్లు, కూరగాయలు, పాలు, విద్యుత్, టెలికాం, మందుల షాపులు, పెట్రోలు బంకులు అందుబాటులో ఉంటాయి.'

### టెన్త్ పరీక్షలు కొనసాగుతాయ్

'టెన్త్, ఇంటర్ పరీక్షలు పెట్టక తప్పని పరిస్థితి నెలకొంది. జ్వరం, దగ్గు, జలుబు ఉన్న విద్యార్థులకు ప్రత్యేక గదుల్లో పరీక్షలు నిర్వహిస్తాం. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థికి విద్యార్థికి మధ్య 2 మీటర్ల దూరం ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలిచ్చాం. విద్యా సంస్థలు, సినిమా థియేటర్లు, మాల్స్, స్విమ్మింగ్ పూల్స్, జిమ్‌లు, సామాజిక, సాంస్కృతిక కేంద్రాల మూసివేతకు గతంలోనే ఆదేశించాం. దేవాలయాలు, చర్చిలు, మసీదులు 31 వరకు మూసి ఉంచాలి. సామాజిక దూరం, ఐసొలేషన్‌తోనే కరోనాను తరిమేయగలమన్న అభిప్రాయానికి దేశనాయకులు వచ్చారు. ప్రజారవాణా నిలిచిపోయి, ఎవరి ఇళ్లలో వాళ్లుంటేనే ఇదిసాధ్యం కాబట్టి ఇప్పటికే 12 రాష్ట్రాలు లాక్‌డౌన్‌కు, అంతర్రాష్ట్ర సరిహద్దుల మూసివేతకు ఆదేశాలిచ్చాయి. మనమూ అంతర్రాష్ట్ర సరిహద్దుల మూసివేత దిశగా అడుగు వేయక తప్పదు. ప్రభుత్వ, ప్రైవేటు రవాణా నిలిపివేస్తున్నాం. ఆటోలు, టాక్సీలను అత్యవసర సేవలకే వాడాలి. వాటిలో ఇద్దరి కంటే ఎక్కువమందిని ఎక్కించుకోకూడదు. బంగారం, బట్టల షాపుల్లాంటివి 31వరకు కచ్చితంగా మూసేయాలి. ఎస్టాబ్లిష్‌మెంట్లు, ఆఫీసులు, గోడౌన్లు, ఫ్యాక్టరీలను తక్కువ ఉద్యోగులతోనే నిర్వహించాలి. ప్రభుత్వం కూడా వంతులవారీ పనివిధానం అమలు చేస్తోంది.'

### 14 రోజులు క్వారంటైన్‌లో..

'విదేశాల నుంచి వచ్చిన వారంతా 14 రోజులు క్వారంటైన్‌లో ఉండాలి. పెద్ద వయసు, షుగర్, బీపీ, కిడ్నీ సమస్యలున్న వారిపై కరోనా ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కరోనా సోకిన తర్వాత ఇళ్లలోఉండి నయం చేసుకునేవారు 80% ఉండగా, 13.8% చేరుతున్నారు. వీరిలో 4.5% ఐసీయూకి వెళ్తున్నారు. జాగ్రత్తలు తీసుకోకపోతే వైరస్ వ్యాప్తి ఏ దశకు చేరుతుందోననే భయం ఉంది. అవ్వాతాతలు ఇంటి నుంచి బయటకు రాకూడదు. పదేళ్లలోపు పిల్లలను కూడా బయటకు పంపించొద్దు.'

### ఉచితంగా రేషన్

'సకలం బంద్‌తో పేదవాళ్లు ఇబ్బందులు పడతారని ఆలోచన వచ్చింది. కానీ చేయక తప్పదు. వాళ్లందరికీ ఎక్కువగా చేయలేకపోయినా, పేదలందరికీ 29గా రేషన్ అందుబాటులో ఉంచుతాం. ఉచితంగా రేషన్ ఇస్తున్నాం. కిలో కందిపప్పు ఇస్తాం. ప్రతి కుటుంబానికి రూ.వెయ్యి చొప్పున ఏప్రిల్ 4న ప్రతి ఇంటికి గ్రామ వలంటీర్ వచ్చి ఇస్తారు. ఈ మాత్రం చేయడానికి దాదాపు రూ.1,500 కోట్లు ఖర్చవుతుంది. దేశం మొత్తం ఒకేరకమైన అడుగులు వేస్తోంది. అవే అడుగులు మనం కూడా వేయగలిగితేనే ఈ వైరస్‌ను కట్టడి చేయగలం.'

'దేవుడి దయతో మిగిలిన రాష్ట్రాల కంటే మన రాష్ట్రం మెరుగ్గా ఉందని గర్వంగా చెప్పవచ్చు. దేశం మొత్తమ్మీద 4,035 కేసులు నమోదైతే ఐదుగురు చనిపోయారు. మన రాష్ట్రంలో 6కేసులు నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో తీసుకోవాల్సిన చర్యలు ఇంకా ఎక్కువగానే ఉన్నాయి. చైనాలో మొదలైన ఈ వైరస్ దక్షిణ కొరియాలో ఒకరికి వచ్చింది. ఒక్కడు దక్షిణ కొరియా అంతా వ్యాపింపచేశాడు. కట్టడి కాకపోతే నగరాలకు నగరాలే నష్టపోతాం. రాష్ట్రంలో 10,091మందిని ఐసొలేషన్‌లో ఉంచాం. 24మందికి ఆస్పత్రిలో చికిత్స అందించాం. 1550 మందిని హోం ఐసొలేషన్‌లో ఉంచాం. ప్రతి నియోజకవర్గంలో 100 ఐసొలేషన్ పడకలతో క్వారంటైన్ సౌకర్యం ఏర్పాటు చేయాలి. ప్రతి జిల్లా కేంద్రంలో 200 ఐసొలేషన్ పడకలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీచేశాం. గొంతునొప్పి, జ్వరం, జలుబు లక్షణాలు ఉండి, విదేశాల నుంచి వచ్చినవారిని కలిసిన సందర్భంలో తప్పనిసరిగా 104కి ఫోన్ చేసి సమాచారం అందించాలి. ప్రజలు పరిస్థితులను గమనిస్తున్నారు. అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను. అందరం ఒకటి కావాలి. భాగస్వాములు కావాలి.'

# లాక్‌డౌన్ అంటే?

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అంటు వ్యాధుల చట్టం-1897 లోని సెక్షన్ 2,3,4 ప్రకారం.. కరోనా (కోవిడ్-19) వ్యాధి నియంత్రణ, నివారణకు కఠినమైన నిబంధనలు అమలు చేస్తారు. గాలి ద్వారా, లేదా మనిషి నుంచి మనిషికి వ్యాధి సోకకుండా నియంత్రించేందుకు అత్యవసరం మినహా సకల వ్యవస్థలను దిగ్బంధించే ప్రయత్నం చేస్తారు. దీన్నే లాక్‌డౌన్‌గా పిలుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం, కృష్ణా, ప్రకాశం జిల్లాలనే లాక్‌డౌన్ జాబితాలో చేరుస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అయితే, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఏపీ సర్కారు ప్రకాశం, విశాఖ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, కడప, చిత్తూరు, నెల్లూరు, అనంతపురం తదితర జిల్లాల్లో లాక్‌డౌన్ నిబంధనలను అమలు చేసే అవకాశం ఉంది.

### లాక్‌డౌన్ నుంచి మినహాయింపులుండేవి





- శాంతి భద్రతలు, న్యాయవిధులు నిర్వహించే అధికారులు. జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, తహసీల్దార్‌లు. పోలీసులు, వైద్య, ఆరోగ్యం, స్థానిక సంస్థలు, ఫైర్, విద్యుత్, తాగునీరు, బ్యాంకులు, ఏటీఎమ్‌లు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులకు మినహాయింపు ఉంటుంది.
- నిత్యావసరమైన ఆహారం, కిరాణా, పాలు, బ్రెడ్, పండ్లు, కూరగాయలు, మాంసం, చేపలు, వీటి నిర్వహణ, నిల్వలకు సంబంధించిన రవాణాకు వీలు కల్పిస్తారు.
- ఆస్పత్రులు, ఫార్మసీ, మందుల దుకాణాలు, మందుల తయారీ, ఉత్పత్తి, రవాణా, నిల్వ వ్యవహారాలకు మినహాయింపు ఉంటుంది.
- టెలికామ్, ఇంటర్‌నెట్, పోస్టల్ సేవలు కొనసాగుతాయి.
- నిత్యావసరాల సరఫరా సంస్థలు, వాటి రవాణా ఉంటుంది.
- ఆహారం, మందులు, వైద్య పరికరాలను సరఫరా చేసే ఈ-కామర్స్ డెలివరీ సంస్థలు పనిచేస్తాయి.
- నిత్యావసరాలను ఇంటికి అందించేవి, నేరుగా ఇంటికే ఆహార పదార్థాలను సరఫరాచేసే రెస్టారెంట్లకు అనుమతిస్తారు.
- పెట్రోలు బంకులు, వంటగ్యాస్, ఆయిల్ ఏజెన్సీలు, వాటి గోడౌన్‌లు, రవాణా సంబంధ కార్యకలాపాలు కొనసాగుతాయి.
- నిరంతర సేవలు అందించే తయారీ, ఉత్పత్తి సంస్థలు కలెక్టర్ అనుమతితో పనిచేయవచ్చు.
- నిత్యావసరాలతో ముడిపడిన తయారీ, ఉత్పత్తి సంస్థలు, వాటి కార్యకలాపాలు కొనసాగుతాయి.
- కరోనా నియంత్రణలో పాలుపంచుకొనే, లేదా ఆ చర్యలతో సంబంధం ఉండే ప్రైవేటు సంస్థలకు వెసులుబాటు కల్పిస్తారు.
- రైతులు, సాధారణ వ్యక్తులు నిత్యావసర సరుకులు, ఆహారపదార్థాలపై తమ రోజువారీ కార్యాచరణ చేపట్టడానికి అనుమతించాలి. అయితే, వారు కూడా సమూహదూరం పాటించేలా చర్యలు తీసుకోవాలి.

### ఏది అత్యవసరం?



ఇదిలా ఉంటే.. ఏది అత్యవసరం, ఏది నిత్యావసర సర్వీసు పరిధిలోకి వస్తుందన్నదానిపై చాలా మందికి సందేహం వస్తుంది. వీటిని కలెక్టర్, లేదా పురపాలక అధికారులతో నివృత్తి చేసుకోవాలి. కరోనా నియంత్రణలో భాగంగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, పోలీసు కమిషనర్‌లు, ఎస్పీలు, పోలీసు యంత్రాంగం, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, తహసీల్దారు, ఎంపీడీఓ, ఇతర అధికారులు క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షిస్తారు. కరోనా నియంత్రణకోసం తీసుకుంటున్న చర్యలకు విఘాతం కలిగించేలా, లేదా వ్యాధి నిరోధానికి చేపట్టిన చర్యలకు భంగం కలిగించేలా వ్యవహరించే వ్యక్తులపై ఐపీసీ 188 సెక్షన్ కింద చర్యలు తీసుకుంటారు.



### ఇవి పనిచేయవు..

- ప్రజా రవాణాను నిలిపివేస్తారు. టాక్సీలు, ఆటోలు తిరగనివ్వరు. వాటిని కూడా బంద్ చేస్తారు. అయితే అత్యవసర రవాణాకు మినహాయింపు ఉంటుంది. అంటే, ఆస్పత్రులకు వెళ్లడానికి, ఆస్పత్రుల నుంచి ఇళ్లకు రావడానికి వీలు కల్పిస్తారు. అంబులెన్స్‌లు తిరుగుతాయి.
- నిత్యావసరం కేటగిరీలో రాని దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఆఫీసులు, ఫ్యాక్టరీలు, వర్క్‌షాపులు, గోడౌన్లను మూసివేయాలి.
- విదేశాల నుంచి వచ్చిన వారు విధిగా జిల్లా కలెక్టర్ ఇచ్చే నోటిఫికేషన్‌కు కట్టుబడి ఇంట్లో క్వారంటైన్ (స్వీయ వైద్య సంరక్షణ)లో ఉండాలి.
- విదేశాల నుంచి వచ్చే వారిని గుర్తించి వెంటనే తగిన సంరక్షణ చర్యలు తీసుకునేందుకు వీలుగా వారిపై నిరంతరం పోలీసు నిఘా, నియంత్రణ కొనసాగించాలి.
- వ్యాధి నియంత్రణ చర్యల్లో భాగంగా ప్రజలు ఇంట్లోనే ఉండాలి. అత్యవసరమైతేనే బయటకు రావాలి. సమూహ దూరం(సోషల్ డిస్టాన్స్) ను పాటించాలి.
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల సామర్థ్యం కలిగిన క్వారంటైన్ కేంద్రాలను నెలొకల్పాలి. దీనిపై 24 గంటల్లోగా కలెక్టర్లు ఆదేశాలు ఇవ్వాలి.
- ప్రతి జిల్లా ప్రధాన కేంద్రంలో కోవిడ్-19 చికిత్స కోసం 200-300 పడకల సామర్థ్యం కలిగిన ఆస్పత్రులను సిద్ధం చేయాలి. ఒకటి రెండు జిల్లాలు మినహా మిగతా ప్రాంతాల్లో బోధనాస్పత్రులు ఉన్నాయి. వాటినే ఇందు కోసం సిద్ధం చేస్తారు.
- నిత్యావసరాలు, మందుల ధరలను ప్రకటించి ఎప్పటికప్పుడు వాటి అమలు, పర్యవేక్షణకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. ధరలపై ప్రకటనలు జారీ చేయాలి. అత్యధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలి.

9. బహిరంగ ప్రదేశాల్లో పదిమందికి పైగా గుమిగూడి ఉండటాన్ని నిషేధించాలి.





విజయవాడ బెంజి సర్కిల్‌లో జనతా కర్ఫ్యూను పరిశీలిస్తున్న డీజీపీ గౌతం సవాంగ్, నగర పోలీస్ కమిషనర్ ద్వారకా తిరుమల రావు

## విదేశీ ప్రయాణికులపై నిఘా

### స్వచ్ఛంద పరీక్షలు చేయించుకోవాలి

**ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు : డీజీపీ**

అమరావతి/విజయవాడ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ఇప్పటి వరకు 12వేల మంది విదేశీ ప్రయాణికులు వచ్చారని, వారందరిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని డీజీపీ గౌతమ్ సవాంగ్ వెల్లడించారు. జనతా కర్ఫ్యూను ప్రజలంతా స్వచ్ఛందంగా విజయవంతం చేశారని చెప్పారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'విదేశాల నుంచి వచ్చే వారిపై గట్టి నిఘా ఏర్పాటు చేయండి... ఐసోలేషన్ వార్డుకు తరలిస్తారని కొందరు వాస్తవాలు చెప్పడంలేదు... అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోండి' అని జిల్లాల ఎస్పీలు, విజయవాడ, విశాఖ పోలీసు కమిషనర్లను డీజీపీ ఆదేశించారు. ప్రజలు కూడా సమాజ శ్రేయస్సు దృష్ట్యా సహకరించాలని, విదేశాల నుంచి వచ్చేవారి వివరాలు పోలీసులకు తెలియజేయాలని కోరారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై విమానాశ్రయాల నుంచి రాష్ట్రంలోకి వచ్చేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షలు జరగకుండా రానివ్వద్దని ఆదేశించారు. అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కరోనా వ్యాప్తిని అరికట్టడంతో ప్రభుత్వానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. విదేశాల నుంచి వచ్చేవారు స్వచ్ఛందంగా వైద్య ఆరోగ్యశాఖకు సమాచారం ఇచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పొరుగు రాష్ట్రాల విమానాశ్రయాల్లో దిగి నేరుగా ఇళ్లకు చేరుకునేవారిపై, ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం వాటిల్లేలా వ్యవహరించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# రాష్ట్రంలో రెండో దశకు కరోనా

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలో కరోనా వైరస్ తీవ్రరూపం దాల్చి రెండో దశకు చేరుకుంది. ఇప్పటి వరకూ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిలోనే పాజిటివ్ కేసులు తేలగా తాజాగా స్థానిక వ్యక్తికి వైరస్ నిర్ధారణ అయింది. ఇటీవల మక్కా నుంచి వచ్చిన విశాఖలోని అల్లిపురం వాసి (66) కరోనా వైరస్ బారినపడినట్టు నాలుగు రోజుల క్రితం అధికారులు నిర్ధారించారు. దీంతో ఆయన కుటుంబసభ్యులను కూడా ఆస్పత్రికి తరలించి వారి నమూనాలు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి పంపించారు. వారిలో ఒకరు కొవిడ్-19 బారినపడినట్టు ఆదివారం నిర్ధారణ అయింది. దీంతో రాష్ట్రంలో ఆరో కేసు నమోదైనట్టయింది. విదేశాల నుంచి వచ్చిన వారి నుంచి స్థానికులకు పాకడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. కాగా.. రోజుల కిందట విశాఖలోని ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రిలో చేరిన 9 మందికి వ్యాధి లేదని తేలింది. ఇదిలావుండగా, ఆదివారం మరో ఏడుగురు కరోనా అనుమానిత లక్షణాలతో ఛాతీ, అంటువ్యాధుల ఆసుపత్రిలో చేరారు. వారి నమూనాలు సేకరించి హైదరాబాద్ పంపించారు.

### బెజవాడలో హై అలర్ట్

కరోనా మహమ్మారి కమ్ముకుంటున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు కృష్ణా జిల్లావ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించారు. దీంతో విజయవాడలో హైఅలర్ట్ అమలవుతోంది. పాజిటివ్ కేసు నమోదైన వన్‌టౌన్‌లోని మేకావారి వీధి నుంచి సుమారు 3 కిలోమీటర్ల పరిధిలో ఉన్న 30 కార్పొరేషన్ డివిజన్లలో మనుషులు, వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. ఈ నెల 31 వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని ప్రకటించారు. కాగా.. కృష్ణా జిల్లాలో మూడు అనుమానిత కేసులు కలకలం రేపాయి. ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెం గ్రామ శివారు కేశ్యా తండాకు చెందిన యువకుడు కేరళలోని నిట్‌లో బీటెక్ చదువుతూ.. ఈనెల 13న స్వగ్రామానికి వచ్చాడు. దగ్గు, జ్వరం ఉండడంతో అతన్ని విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక పరీక్షల అనంతరం వైద్యులు అతనికి కరోనా వైరస్ సోకలేదని నిర్ధారించారు. కాగా.. మల్లంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి పంజాబ్‌లో ఇంజనీరింగ్ చదువుతూ... ఈనెల 16న విజయవాడ చేరుకున్నాడు. అతడు అతను కూడా చల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించగా.. పరీక్షలు నిర్వహించిన వైద్యులు 14 రోజుల పాటు ఇంటి నుంచి బయటకు వెళ్లవద్దని సూచించారు. విజయవాడ వన్‌టౌన్‌లో దుబాయ్ నుంచి వచ్చిన వ్యక్తిని కరోనా అనుమానంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### కుర్లా ఎక్స్‌ప్రెస్‌లో కోవిడ్ బాధితుడు

ముంబై నుంచి కోయంబత్తూరు వెళ్లే కుర్లా ఎక్స్‌ప్రెస్‌లో ఓ ప్రయాణికుడు కరోనా లక్షణాలతో అస్వస్థతకు గురవడంతో సహప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. టీసీ సాయంతో అతన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం జిల్లా ఎల్.ఎన్.పేట మండలానికి చెందిన ఒక వ్యక్తి క్రొయేషియా నుంచి రాగా.. వైద్యులు కరోనా అనుమానిత కేసుగా గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. చిత్తూరు జిల్లాలోని గంగాధరనెల్లూరు మండలంలోని వ్యక్తి బెంగళూరులోని చైనాకు చెందిన కంపెనీలో పనిచేస్తున్నాడు. వారాంతం కావడంతో సొంత గ్రామానికి వచ్చిన అతను జ్వరంతో బాధపడుతూ స్థానిక పీహెచ్‌సీ వైద్యుడిని సంప్రదించాడు. అతడిని 108 అంబులెన్స్‌లో రుయా ఆస్పత్రికి తరలించారు.

### తప్పుడు వార్త ప్రచారం.. అరెస్ట్

ఒడిసాలోని రాయగడ జిల్లా జె.కె.పూర్ వ్యక్తికి కరోనా పాజిటివ్‌గా తేలిందని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన ఓ ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్ట్ చేసినట్టు ఎస్పీ శరవణ తెలిపారు. పితామహల్ గ్రామానికి చెందిన విన్నపల్లి శ్రీనివాసరావు (44)అనే ఉపాధ్యాయుడు వాట్సాప్‌లో పెట్టాడు.

### కోలుకున్నాడు.. నెల్లూరు వాసి రిపోర్టు నెగెటివ్!

నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కరోనా వైరస్ పాజిటివ్ యువకుడు పూర్తిగా కోలుకుంటున్నాడు. ఐసోలేషన్‌లో చేరి 14 రోజులు పూర్తయిన సందర్భంగా శనివారం అతని నమూనాలు సేకరించి తిరుపతి స్విమ్స్‌కు పంపగా.. కరోనా నెగెటివ్ అని వచ్చింది. కాగా.. మరోసారి శాంపిల్స్ పంపి పరీక్షించిన తర్వాతే అతన్ని డిశ్చార్జి చేసే అవకాశం ఉంది. కాగా.. ఐసోలేషన్‌లో ఉన్న కావలి నుంచి తీసకొచ్చిన తల్లీ కొడుకులతోపాటు, బార్బర్, కొడవలూరుకు వచ్చిన ఆస్ట్రియా దేశస్థుడికి రిపోర్టులో నెగెటివ్ వచ్చింది. ఆదివారం జ్వరం, జలుబుతో బాధపడుతున్న వ్యక్తిని మద్రాసు బస్టాండ్ వద్ద గుర్తించిన పోలీసులు జీజీహెచ్‌కు తరలించారు.



రాష్ట్ర ప్రజలందరూ మరో మూడు రోజులపాటు జనతా కర్ఫ్యూలో పాల్గొనాలని హోంమంత్రి మేకతోటి సుచరిత పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన జనతా కర్ఫ్యూలో భాగంగా కుటుంబ సభ్యులతో గుంటూరు బ్రాడీపేటలో గల తన ఇంటిలోనే గడిపారు. పోలీస్‌శాఖ ఎంతో అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు. ప్రజలు సహకరిస్తే వైరస్ నుంచి బయటపడతామన్నారు.

# 3 జిల్లాల్లో సంపూర్ణ లాక్‌డౌన్

## పరిస్థితి తీవ్రత దృష్ట్యా ప్రకాశం, కృష్ణా, విశాఖ బంద్‌కు కేంద్రం నిర్ణయం

**ఈ జిల్లాల్లో 31వ తేదీ వరకు 'కర్ఫ్యూ'**

అమరావతి/న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతుండడంతో ఆస్పత్రులకు అనుమానితుల తాకిడి కూడా పెరుగుతోంది. రోజూ 5 -10 మంది అనుమానితులు ఆస్పత్రులకు వస్తున్నారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో 6పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా పాజిటివ్ కేసులు రానురాను అధికమవుతుండడంతో కేంద్రం దేశవ్యాప్తంగా 80 ప్రభావిత జిల్లాల్లో లాక్‌డౌన్ ప్రకటించింది. అత్యధిక అప్రమత్తత ప్రకటించింది. ఇందులో ప్రకాశం, కృష్ణా, విశాఖ జిల్లాలు కూడా ఉన్నాయి. ఈ నెల 31వరకు ఈ జిల్లాల్లో 'జనతా కర్ఫ్యూ'లా పాటించాలని కలెక్టర్లను కేంద్రం ఆదేశించింది. విశాఖ, కృష్ణా, ప్రకాశంలో కొంచెం ప్రమాదకర పరిస్థితులున్నాయని కేంద్రం గుర్తించింది. విశాఖ, కృష్ణా జిల్లాల్లో ప్రధాన నగరాలున్నాయి. నగరాల్లో వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటోంది. మరోవైపు పాజిటివ్ కేసులుగా నమోదైన వాళ్లు ఇప్పటికే నగరాల్లో తిరిగివచ్చారు. విశాఖలో మొదటి పాజిటివ్‌గా నమోదైన వ్యక్తి ఈనెల 9న మదీనా నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. అక్కడ నుంచి రైల్లో 12న విశాఖ చేరుకున్నారు. 17న చెస్ట్ ఆస్పత్రిలో చేరారు. 18న కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. ఇప్పుడు విశాఖలో మరో పాజిటివ్ కేసు నమోదైంది. కృష్ణాజిల్లా విజయవాడ నగరంలో ఓ వ్యక్తికి కరోనా పాజిటివ్ నిర్ధారణైంది. ఫ్రాన్స్ నుంచి వచ్చిన అతడు.. 15వ తేదీన ఢిల్లీకి, 17వ తేదీన హైదరాబాద్‌కు విమానంలో వచ్చారు. అదే రోజు హైదరాబాద్ నుంచి విజయవాడకు కారులో వచ్చారు. 20వ తేదీన కరోనా లక్షణాలు కనిపించడంతో విజయవాడ ఆస్పత్రిలో చేరారు. శనివారం అతడికి పాజిటివ్ నిర్ధారణయింది. ప్రకాశం జిల్లాలో పాజిటివ్ కేసుగా నమోదైన వ్యక్తి 10న లండన్ నుంచి బయలుదేరి 11న ఢిల్లీకి చేరుకున్నారు. అదేరోజు హైదరాబాద్ వచ్చారు. 14న ఉదయం బస్సులో ఒంగోలు చేరారు. 15 ఉదయం ప్రభుత్వాస్పత్రిలో చేరారు. 16న పాజిటివ్ నిర్ధారణయింది. ఈ మూడు కేసుల ట్రావెల్ హిస్టరీ ఆధారంగా కేంద్రం ఈ మూడు జిల్లాల్లో లాక్ డౌన్ పాటించాలని నిర్దేశించింది. నెల్లూరులో పాజిటివ్ వచ్చిన వ్యక్తి ఆరోగ్యం మెరుగ్గా ఉంది. మరో మూడు రోజుల్లో అతడిని డిశ్చార్జ్ చేసే అవకాశముంది. ఈ 75 ప్రభావిత జిల్లాల్లో తెలంగాణకు చెందిన 5 జిల్లాలు.. భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ కూడా ఉన్నాయి.



విజయవాడలో కరోనా నివారణకు స్ప్రే చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

### 31 వరకు రైల్వే రిజర్వేషన్ కౌంటర్లు మూసివేత

**యాప్ బుకింగ్, పార్శిల్ ఆఫీసులు కూడా..**

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 22: ఇప్పటికే అన్ని రకాల ప్రయాణికుల రైళ్ల రాకపోకలను నిలిపివేసిన దక్షిణ మధ్య రైల్వే.. సోమవారం నుంచి అన్ని రైల్వేస్టేషన్లలోని రిజర్వేషన్ కౌంటర్లు, అన్ రిజర్వ్‌డ్ టికెట్ కౌంటర్లు, పార్శిల్, లగేజీ ఆఫీసులను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నెల 31వ తేదీ వరకు ఇది అమల్లో ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే టికెట్లు రిజర్వ్ చేసుకున్న వారందరికీ జూన్ 21వ తేదీలోపు రీఫండ్ చేస్తామని వెల్లడించారు. కౌంటర్ల ద్వారా రిజర్వేషన్లు చేసుకున్నవారు కౌంటర్లు తెరిచాక గడువులోపు వచ్చి రీఫండ్ పొందవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా చేసుకున్నవారు ఆన్‌లైన్‌లోనే రీఫండ్ పొందే సౌలభ్యం ఉందని తెలిపారు. యాప్ ద్వారా అన్‌రిజర్వ్‌డ్ టికెట్లు బుకింగ్ చేసే సౌకర్యాన్ని కూడా ఈ నెలాఖరు వరకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

# కరోనా కలవరం

విజయవాడ ● సోమవారం 23 మార్చి 2020



నిత్యం రద్దీగా ఉండే విజయవాడ ఎంజీరోడ్ ఆదివారం నిర్మానుష్యంగా మారిన దృశ్యం



కర్నూలు కొండారెడ్డి బురుజు సెంటర్‌లో ఆదివారం నాటి పరిస్థితి ఇదీ..!

# జయహో 'జనతా'!

**కరోనా కర్ఫ్యూ విజయవంతం**

**రాష్ట్రమంతా నిర్మానుష్యం**

**పల్లెల్లోనూ అదే వాతావరణం**

**డిపోలకే పరిమితమైన బస్సులు**

**సాయంత్రం మార్మోగిన చప్పట్లు**

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కరోనాను కట్టడి చేసేందుకు ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం నిర్వహించిన జనతా కర్ఫ్యూ విజయవంతమైంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ప్రజలంతా స్వచ్ఛందంగా ఇళ్లకే పరిమితమయ్యారు. రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ప్రధాన నగరాలు, పట్టణాలతో పాటు గ్రామాల్లో సైతం ఇదే పరిస్థితి కనిపించింది. ఎక్కడా టీ దుకాణాలు, పాన్ షాపులు కూడా తెరుచుకోలేదు. ప్రైవేటు వాహనాలు, ఆటోలు నిలిచిపోయాయి. ఇతర రాష్ట్రాల సరిహద్దులను పూర్తిగా మూసివేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ రోడ్ల పైకి వచ్చిన పోలీసులు కర్ఫ్యూ పూర్తిస్థాయిలో విజయవంతమయ్యేలా కృషి చేశారు. పోలవరం ప్రాజెక్టులోని పనులు నిలిపివేసి కార్మికులు కర్ఫ్యూ పాటించారు. ఆంధ్రా-తెలంగాణ సరిహద్దు జీలుగుమిల్లి వద్ద పెద్దఎత్తున వాహనాలు నిలిపివేశారు. శ్రీకాకుళం జిల్లాలో ఆంధ్ర-ఒడిశా సరిహద్దు మెళియాపుట్టి మండలంలో రాకపోకలు నిలిచిపోవడంతో చెన్నై నుంచి ఒడిశాలో పర్లాకిమిడి వచ్చిన అనేకమంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు తదితర ప్రధాన పట్టణాల్లో రోడ్లు బోసిపోయాయి. కృష్ణాజిల్లా జగ్గయ్యపేట వద్ద, నల్లగొండ, ఖమ్మం సరిహద్దుల వద్ద 52 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. విజయనగరంలో ప్రధాన మార్కెట్, వస్త్ర, హోల్‌సేల్ మార్కెట్లన్నీ మూతపడ్డాయి. విశాఖలో ఉదయం 6గంటల నుంచే రహదారులు నిర్మానుష్యంగా మారిపోయాయి. కరోనా లక్షణాలతో ఎవరైనా వ్యక్తి ఆస్పత్రికి వస్తే.. వారికి ఏ విధమైన పరీక్షలు చేయాలి? ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే అంశాలపై అవగాహన కోసం కింగ్ జార్జి ఆస్పత్రిలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుపతి, చిత్తూరులో జనం స్వచ్ఛందంగా ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రకాశం జిల్లాలో కరోనా పాజిటివ్ కేసు నమోదైన ఒంగోలు నగరం, ఇతర పట్టణాలు నిర్మానుష్యమయ్యాయి. కడప, అనంతపురం, తూర్పు గోదావరి జిల్లాల్లో కర్ఫ్యూ విజయవంతమైంది. "మీరు ఇళ్లలో ఉండండి.. మేము బయట ఉంటాం" అనే ప్లకార్డులతో నెల్లూరుజిల్లా ఆత్మకూరులో ఆర్డీవో ఉమాదేవి, మున్సిపల్ కమిషనర్, పోలీసు అధికారులు రోడ్లపై తిరిగారు. గుంటూరు రైల్వే డివిజన్‌లో కొన్ని స్టేషన్లు ఆదివారం ఉదయం నుంచే మూతబడగా అన్ని స్టేషన్లు అర్ధరాత్రి నుంచి మూసేశారు. కాగా, సాయంత్రం 5గంటలకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు బాల్కనీలు, వరండాల్లోకి వచ్చి హర్షధ్వానాలతో కరోనా కట్టడికి కృషిచేస్తున్న యంత్రాంగానికి అభినందనలు తెలిపారు.



కరోనాపై పోరుకు విజయవాడ ఆర్టీసీకాలనీలో ఓ కుటుంబం చప్పట్లతో మద్దతు

## ఉదయం 6.30కే అంత్యక్రియలు!

జనతా కర్ఫ్యూ నేపథ్యంలో ఓ వృద్ధురాలి మృతదేహానికి ఆదివారం ఉదయం 6.30గంటలకే అంత్యక్రియలు పూర్తిచ చేసిన ఘటన గుంటూరు ఏటుకూరు రోడ్డులో చోటు చేసుకుంది. ఈ ఘటన ఎందరికో స్ఫూర్తిగా నిలిచింది. గుంటూరు డీఎస్ నగర్‌కు చెందిన గుంటుపల్లి సుబ్బమ్మ(95) శనివారం రాత్రి మృతిచెందింది. ఆమె కుమారులు, కుమార్తెలు దూరప్రాంతాల్లో ఉండిపోయారు. వారు వచ్చే అవకాశం లేకపోవడంతో బంధువులు, స్థానికులు ఉదయం 6గంటలకే అంత్యక్రియలు ప్రారంభించారు. 7గంటల కల్లా ఆ కార్యక్రమం పూర్తిచేసి జనతా కర్ఫ్యూలో పాలుపంచుకున్నారు.

## 31వరకు పొగాకు కేంద్రాలు మూత

కరోనా వైరస్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని పొగాకు వేలం కేంద్రాలను ఈనెలాఖరు వరకు మూసివేస్తున్నట్లు ఈడీ కె.సునీత తెలిపారు. పొగాకు కొనుగోళ్లు, వేలం కేంద్రాలు తదితర అంశాలపై వ్యాపారులు, పొగాకు వేలం కేంద్రాల అధ్యక్షులు, అధికారులతో ప్రధాన కార్యాలయం గుంటూరులో సమీక్షించినట్లు తెలిపారు. పొగాకు రైతుల్లో వైరస్ నివారణ, రాక ముందు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఈడీ వివరించారు.



**సేవకులకు సెల్యూట్!** కరోనా కట్టడికి కృషి చేస్తున్న సిబ్బందిని చప్పట్లతో అభినందిస్తున్న సీఎం జగన్, ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ల నాని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని



వైద్య సిబ్బందికి మద్దతుగా గంట కొడుతున్న పవన్



కరోనా నివారణకు కృషిచేస్తున్న వారికి కన్నా ఇలా మద్దతు!



## టీచర్‌గా మారిన బాబు

కరోనా వైరస్ వ్యాప్తిని నియంత్రించే క్రమంలో 'జనతా కర్ఫ్యూ' దృష్ట్యా టీడీపీ అధినేత చంద్రబాబు సహా ఆ పార్టీ నేతలు ఆదివారం ఇళ్లలోనే గడిపారు. చంద్రబాబు తన కుటుంబంతో సహా హైదరాబాద్‌లో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన టీచర్‌గా మారి మనవడు దేవాన్ష్‌కు ఒక పుస్తకంలోని అంశాలను చదివి వివరించారు. సాయంత్రం ఐదు గంటలకు భార్య భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, మనవడు దేవాన్ష్‌లతో కలిసి బాల్కనీలో నిలబడి చప్పట్లు కొట్టారు. కరోనా నివారణకు కృషి చేస్తున్న వైద్య సిబ్బందిని చంద్రబాబు అభినందించారు. - అమరావతి, ఆంధ్రజ్యోతి

## 31 వరకూ బస్సుల్లేవ్

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కరోనా తీవ్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం 31వరకూ లాక్‌డౌన్ ప్రకటించడంతో.. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (పీటీడీ) నెలాఖరు వరకు బస్సులు ఆపేయాలని నిర్ణయించింది. ఈమేరకు రవాణా శాఖ మంత్రి పేర్ని నాని ఆదివారం ప్రకటించారు. ఈ 9రోజులు బస్సులను డిపోలకే పరిమితం చేస్తే సుమారు రూ.120కోట్ల వరకూ నష్టం రానుంది.

## 39 మంది ఏపీ వాసులకు నో ఎంట్రీ

సంగారెడ్డి/మెదక్, మార్చి 22: ముంబై నుంచి సంగారెడ్డి జిల్లాలోకి ప్రవేశిస్తున్న 39 మందిని పోలీసులు అడ్డుకున్నారు. ఓ ప్రైవేటు బస్సులో వస్తుండగా.. జిల్లా సరిహద్దులోని చిరాక్‌పల్లి వద్ద వారిని నిలిపివేశారు. వారంతా విజయవాడ, రాజమండ్రి సమీప ప్రాంతాలవారే. ఉపాధి కోసం వీరంతా ఖతర్, ఒమన్‌కు వెళ్లారు. ఖతర్ నుంచి 34మంది, ఒమన్ నుంచి ఐదుగురు ముంబై వచ్చారు. పరీక్షలు నిర్వహించిన ముంబై పోలీసులు.. ఏపీ వెళ్లేందుకు అనుమతించారు. వారి బస్సును జిల్లా సరిహద్దులో నిలిపివేశారు. దీంతో వారంతా కర్ణాటకలోని బొంగూరు గ్రామంలోని హోటళ్లకు వెళ్లారు.

## ఎన్పీఆర్, జనగణన తొలిదశ వాయిదా?

న్యూఢిల్లీ, మార్చి 22: జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్)ను అప్‌డేట్ చేయడం, జనగణన 2021 తొలి దశ ప్రక్రియ నిరవధికంగా వాయిదా పడనుంది. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవ్వాల్సిన ఈ ప్రక్రియను కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఒకట్రెండు రోజుల్లో ఈ విషయమై అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

## కొన్ని రోజులు హెచ్‌డీ వీడియోలు బంద్!

కరోనాను నిరోధించడంలో భాగంగా ఇంటికే పరిమితమైన ప్రజలు సినిమాలు, వీడియోలు చూస్తుండటంతో నెట్‌వర్క్ ట్రాఫిక్ పెరిగిపోతోంది. వీడియోల క్వాలిటీని హెచ్‌డీ నుంచి ఎస్‌డీకి తగ్గించి ప్రసారం చేయాలని టెలికాం శాఖతో పాటు నెట్‌ఫ్లిక్స్, హాట్‌స్టార్, అమెజాన్ ప్రైమ్ సంస్థలకు సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా లేఖ రాసింది.

# నెలాఖరు దాకా భారత్ 'బంద్'

- రైళ్లు, అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులు, మెట్రో సేవల నిలిపివేత: కేంద్రం
- నేటితో పార్లమెంట్ బడ్జెట్ భేటీ బంద్!
- మార్చి 31దాకా విమానాలు రద్దు



రైళ్ల రద్దుతో నిర్మానుష్యమైన లఖ్‌నవూ రైల్వే స్టేషన్

న్యూఢిల్లీ/శంషాబాద్ రూరల్, మార్చి 22: దేశ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా.. 17 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాల్లోని 80 జిల్లాలు 9 రోజులపాటు లాక్‌డౌన్ కానున్నాయి! సబర్బన్, మెట్రో సర్వీసులు సహా రైళ్లు, అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులు.. అన్నీ ఆదివారం అర్ధరాత్రి నుంచి ఆగిపోయాయి. మార్చి 31 దాకా గూడ్సు రైళ్లు తప్ప మామూలు రైళ్లు పట్టాలెక్కవు, కూత పెట్టవు!! రోజురోజుకూ పెరిగిపోతున్న కరోనా వ్యాప్తిని అడ్డుకునేందుకు ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలివి. కేంద్రం ప్రకటించిన 80 జిల్లాల్లో తెలంగాణలో ఐదు (భద్రాద్రి కొత్తగూడెం, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్), ఏపీలో మూడు (కృష్ణా, ప్రకాశం, విశాఖ) ఉన్నాయి. అవసరాన్ని బట్టి రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ రాష్ట్రాల్లో ఈ జాబితాను పెంచుకోవచ్చు. మార్చి 31 దాకా ఈ జిల్లాల్లో అత్యవసర సేవలే అందుబాటులో ఉంటాయి. ఈ మేరకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేస్తాయని కేంద్ర హోం శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అలాగే.. హోం క్వారంటైన్‌లో ఉండాల్సిందిగా అధికారులు సూచించినా రైళ్లల్లో ప్రయాణిస్తూ దొరికిపోయినవారిలో 12 మంది పాజిటివ్‌గా తేలారు. ఈ నేపథ్యంలో అనవసర ప్రయాణాలకు అడ్డుకట్ట వేసేందుకు.. గూడ్సు రైళ్లు మినహా అన్ని రైళ్లు, మెట్రో సర్వీసులు, సబర్బన్ రైళ్లను మార్చి 31 దాకా నిలిపివేస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. మార్చి 22 అర్ధరాత్రి నుంచి మార్చి 31 అర్ధరాత్రి వరకూ ఈ నిషేధం అమల్లో ఉంటుంది. ఆదివారం తెల్లవారుజామున నాలుగింటిలోపు బయల్దేరిన రైళ్లను మాత్రం.. గమ్యస్థానం చేరేదాకా అనుమతిస్తారు. రైళ్ల నిలిపివేతతో పాటు.. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే మ్యూజియమ్‌లు, హెరిటేజ్ గ్యాలరీలు, హెరిటేజ్ పార్కులను సైతం ఏప్రిల్ 15 దాకా మూసివేయాలని నిర్ణయించారు. రద్దు చేసిన రైళ్లకు సంబంధించి టికెట్ల క్యాన్సిలేషన్ గడువును 3 నెలలకు పెంచారు. ఇక కేంద్రం ఆదేశాల మేరకు శంషాబాద్ విమానాశ్రయంలో సోమవారం నుంచి అన్ని అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దు చేశారు. స్వదేశీ విమానాల రాకపోకలు మాత్రం యథాతథంగా సాగనున్నాయి. కాగా.. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు నిర్ణీత షెడ్యూలు కన్నా 12 రోజుల ముందే.. సోమవారం ముగిసిపోయే అవకాశం ఉంది. షెడ్యూలు ప్రకారం ఏప్రిల్ 3 దాకా సమావేశాలు కొనసాగాల్సి ఉంది. కానీ, కరోనా ముప్పు నేపథ్యంలో సోమవారం నుంచి సభకు హాజరు కాకూడదని పలు పార్టీలు భావిస్తున్నాయి. టీఎంసీ ఇప్పటికే ఈమేరకు నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో.. సోమవారం ఉభయసభల్లో ఆర్థిక బిల్లును ఆమోదించి సమావేశాలను ముగించనున్నట్టు తెలుస్తోంది. ఇక.. 10 లక్షల మంది సిబ్బంది ఉన్న పారామిలటరీ దళాలు కూడా ఏప్రిల్ 5 దాకా ఎక్కడివక్కడే ఉండనున్నాయి. అంతేకాదు.. ఇటీవలికాలంలో తాముగానీ, తమ కుటుంబసభ్యులుగానీ విదేశాలకు వెళ్లలేదని పేర్కొంటూ జవాన్లందరూ డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ ఎవరైనా అలా వెళ్లినట్టు పేర్కొంటే వారిని పరీక్షించి, అవసరమైతే ఐసోలేషన్‌కు తరలించనున్నారు.

## లాక్‌డౌన్ తక్షణమే అమల్లోకి

- ఈ నెలాఖరుదాకా వర్తింపు
- కలెక్టర్లకు సర్కారు ఆదేశం.. ఇది హెల్త్ ఎమర్జెన్సీయే?

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లాక్‌డౌన్ ప్రకటిస్తూ ప్రభుత్వం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. కరోనా వైరస్‌ను నిరోధించేందుకు, గాలి ద్వారా, మనిషి నుంచి మనిషికి వ్యాప్తి చెందకుండా నియంత్రించడానికి, కొత్త ప్రాంతాల్లో వ్యాధి ప్రబలకుండా తక్షణమే లాక్‌డౌన్ అమలవుతుందని పేర్కొంది. అంటువ్యాధుల చట్టం-1897 ప్రకారం.. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నియమావళి అనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని జీవో 209ని జారీచేశారు. ఈనెల 31దాకా ఇది కొనసాగుతుందని తెలిపారు. తాజా ఆదేశాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, వైద్య, ఆరోగ్యశాఖ, ఇతర నోడల్ అధికారులు తక్షణమే రంగంలోకి దిగి వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు, వ్యాధి ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లాక్‌డౌన్ ప్రకటించినందున వైరస్ ప్రబలకుండా, ముందస్తు చర్యల్లో భాగంగా తక్షణ వైద్య సంరక్షణ వ్యూహాలను అమలు చేయాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.

### కలెక్టర్లు, జేసీలకు పూర్తి అధికారాలు..

కాగా.. ఈ లాక్‌డౌన్‌కు, ఆరోగ్య అత్యవసర పరిస్థితి (హెల్త్ ఎమర్జెన్సీ)కి పెద్దగా తేడా ఏమీలేదు. ఇప్పటికే అంటువ్యాధుల చట్టం-1897కి కొన్ని నిబంధనలు జోడించి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇప్పుడు పూర్తిగా హెల్త్ ఎమర్జెన్సీ పరిధిలోకి తీసుకొచ్చింది. దీనిప్రకారం వైరస్ నివారణకు కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికార్లకు పూర్తి అధికారాలు కల్పించింది. నిజానికి ఆదివారం జనతా కర్ఫ్యూ మొత్తం ఆరోగ్య అత్యవసర పరిస్థితిని తలపించింది. ప్రజలంతా స్వచ్ఛందంగా ఇంటిలో నుంచి బయటకు రాకుండా ప్రభుత్వానికి సహకరించారు. ఇదే తరహాలో ఈ నెలా 31వ తేదీ వరకూ కొనసాగించాలని ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించింది. అంటే పూర్తిస్థాయి హెల్త్ ఎమర్జెన్సీ తరహాలో నిబంధనలు అమల్లోకి వచ్చినట్లేనని ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

## హైకోర్టు కార్యకలాపాలపై ఏం చేద్దాం?

- నేడు న్యాయమూర్తులతో సీజే చర్చ

అమరావతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణ చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 31వ తేదీ వరకు లాక్ డౌన్ ప్రకటించిన నేపథ్యంలో హైకోర్టు కార్యకలాపాల కొనసాగింపుపై సోమవారం నిర్ణయం వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి సోమవారం సహచర న్యాయమూర్తులతో సమావేశమై ఒక నిర్ణయం ప్రకటిస్తారని సమాచారం. లాక్‌డౌన్‌లో భాగంగా ప్రజా రవాణా వ్యవస్థను కూడా నిలిపివేస్తున్నందున ఉద్యోగులు, న్యాయవాదులు, కక్షిదారులు హైకోర్టుకు రావడానికి పలు ఇబ్బందులు తలెత్తడం ఖాయం. దీనిని ఇప్పటికే హైకోర్టు న్యాయవాద సంఘ ప్రతినిధులు సీజే దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో న్యాయమూర్తుల అభిప్రాయాలు సేకరించిన అనంతరం హైకోర్టు కార్యకలాపాల కొనసాగింపుపై ఆయన నిర్ణయం తీసుకోనున్నారు.

# 'క్వారంటైన్' కలకలం

**క్వారంటైన్‌కు వెళ్లకుండా జనాల్లోకి!**

**స్టాంప్ చూపి పట్టిస్తున్న ప్రజలు**

(న్యూస్‌నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

విదేశాల నుంచి వచ్చి ఎయిర్‌పోర్టులో క్వారంటైన్ ముద్ర వేయించుకున్న వారు కొందరు జన సమూహంలోకి వెళ్లిపోతున్నారు. వారి చేతులపై స్టాంప్‌లను కొందరు గుర్తించి పోలీసులకు పట్టిస్తున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దుబాయి నుంచి వచ్చిన ఓ మహిళ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో కాకినాడ రైలు ఎక్కింది. తోటి ప్రయాణికురాలి ఫిర్యాదుతో ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు ఆమెను బంధువుల ఇంటికి పంపించేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వైద్య పరీక్షల అనంతరం ఆమెకు క్వారంటైన్ స్టాంప్ వేశారు. అక్కడ నుంచి నేరుగా రైల్వేస్టేషన్‌కు వెళ్లి కాకినాడ రైలు ఎక్కడంతో కలకలానికి దారితీసింది. దుబాయి నుంచి వచ్చిన మరో నలుగురు యువకులు హైదరాబాద్ ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు వద్ద కనిపించారు. నిజామాబాద్ వెళ్లేందుకు బస్సుల కోసం కొన్ని గంటల సేపు అక్కడే వేచి చూశారు. ములుగు జిల్లాలోని ఏటూరునాగారం మండలకేంద్రంలో ఓ లాడ్జిలో ఇటలీ దంపతులు రెండు రోజుల పాటు బస చేసినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న ఓ ఎన్ఆర్ఐను యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి రైల్వేస్టేషన్‌లో ఆదివారం దింపేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు చెందిన ఆ యువకుడు ఆస్ట్రేలియా నుంచి వచ్చినట్టు తెలిసింది. ఖతర్ నుంచి వచ్చి స్వీయనిర్బంధం పాటించకుండానే అదృశ్యమైన వ్యక్తిపై, అతని బంధువులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## హోం ఇక్కడ లేదు.. హోం క్వారంటైన్ ఎలా?

(రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆంధ్రజ్యోతి): హోం క్వారంటైన్.. కరోనా వైరస్ అనుమానితులకు ఇప్పుడీ స్టాంప్ ఓ పీడకల! ఈ ముద్ర ఉందంటే చాలు నేరస్థులుగా పరిగణిస్తున్న విచిత్రమైన పరిస్థితి నెలకొంది. విదేశాల నుంచి వచ్చి తెలంగాణతో పాటు చుట్టుపక్కల రాష్ట్రాలకు వెళ్లాలంటే శంషాబాద్ విమానాశ్రయమే కీలకం. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన వారు ఎక్కువగా ఇక్కడే దిగుతుంటారు. వారికి వైద్యపరీక్షలు నిర్వహించి కరోనా వైరస్ ఉంటే క్వారంటైన్‌కు తరలిస్తున్నారు. ఆ ముప్పులేని వారికి 14 రోజులు హోం క్వారంటైన్‌లో ఉండాలని సూచిస్తూ స్టాంప్ వేస్తున్నారు. జనతా కర్ఫ్యూ నేపథ్యంలో ఆదివారం అనుమానితులు పలు ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్‌లో ఇళ్లు ఉన్న వారు మాత్రం ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా వెళ్లిపోగలిగారు. తెలంగాణ సరిహద్దుల్లోని ప్రాంతాలకు, పొరుగు రాష్ట్రాలకు వెళ్లాల్సిన వారు మాత్రం అవస్థలు పడ్డారు. బస్సులు, రైళ్లు, ఇతర ప్రయాణ సౌకర్యాలు లేక రైల్వేస్టేషన్లు, బస్‌స్టాపుల వద్దే ఉండిపోయారు. చేతిపై ముద్రలు చూసి కొందరు పోలీసులకు ఫోన్ చేసి పట్టించారు. అయితే ఎయిర్‌పోర్టు నుంచే రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని వారు వాపోయారు.

# కరోనా కల్లోలం



## చౌకగా, వేగంగా 'కరోనా' పరీక్షలు!

» అభివృద్ధి చేసిన ఐఐటీ ఢిల్లీ శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ/వాషింగ్టన్, మార్చి 22 : కరోనా గుర్తింపు పరీక్షల ఫలితాలు రావడానికి ప్రస్తుతం రెండు రోజులు పడుతోంది. అతివేగంగా పరీక్షా ఫలితాలను ఇవ్వగలిగే టెస్టింగ్ పద్ధతుల అభివృద్ధికి శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ఐఐటీ ఢిల్లీ శాస్త్రవేత్తలు కరోనాను గుర్తించే అతిచౌక పరీక్షా పద్ధతిని అభివృద్ధిచేశారు. దీని పరిధిలోని కుసుమ స్కూల్ ఆఫ్ బయాలజికల్ సైన్సెస్‌కు చెందిన ప్రొఫెసర్ వివేకానందన్ పెరుమాళ్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం ఈ ఘనత సాధించింది. ఈ టెస్టు ద్వారా కరోనా వైరస్ చుట్టూ ఉండే కొంకి వంటి నిర్మాణాల్లో ఉండే ప్రత్యేకమైన ప్రొటీన్లను విశ్లేషించి వ్యాధి ఉందో లేదో తేలుస్తారు. ప్రస్తుతం పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్‌వీవీ) ఈ కరోనా పరీక్ష ప్రామాణికత, ఫలితాల గుర్తింపులో కచ్చితత్వాన్ని పరిశీలిస్తోంది. మరోవైపు అమెరికాలోని సెఫైడ్ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు కరోనాను 45 నిమిషాల్లో తేల్చేసే పరీక్షా విధానాన్ని అభివృద్ధి చేశారు.

## ప్రజల చప్పట్లే.. వెయ్యేనుగుల బలం: వెంకయ్య



న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జనతా కర్ఫ్యూ ద్వారా దేశమంతటా ఆదివారం సాయంత్రం ఐదింటికి ఐక్యంగా చప్పట్లు కొట్టడంతో మనకు వెయ్యేనుగుల బలం చేకూరినట్టయిందని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. కలిసికట్టుగా కరోనా వైరస్‌ను ఎదుర్కొందామని పేర్కొన్నారు. జనతా కర్ఫ్యూలో భాగంగా సాయంత్రం ఐదింటికి ఉపరాష్ట్రపతి తన సతీమణి ఉషమ్మతో కలిసి చప్పట్ల ద్వారా సంఘీభావం తెలిపారు.

## శానిటైజర్ల ధర తగ్గింపు

న్యూఢిల్లీ, మార్చి 22 : కరోనా మహమ్మారి నేపథ్యంలో శానిటైజర్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో మార్కెట్‌లో ఏ దుకాణంలో కూడా శానిటైజర్లు దొరకని పరిస్థితి నెలకొంది. దీనికితోడు కొంతమంది వీటి ధరలను భారీగా పెంచి విక్రయించారు. ఈ నేపథ్యంలో శానిటైజర్ల ధరలు తగ్గించాలని, ప్రజలకు అవి అందుబాటులో ఉండేలా చూడాలని ఎఫ్ఎంసీజీ (ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్) కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆ కంపెనీలు శానిటైజర్ల ధరలను తగ్గించాయి. డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తులను పెంచాయి. కరోనా నేపథ్యంలో శానిటైజర్ల ధరలపై (ప్రతి 200 మిల్లీలీటర్ బాటిల్ రూ.100) జూన్ 30 వరకు కేంద్రం పరిమితి విధించింది.

## బ్రిటన్ రాణి సహాయకుడికి కరోనా

లండన్, మార్చి 22: బ్రిటన్ రాణి ఎలిజబెత్-2 సహాయకుల్లో ఒకరికి కరోనా పాజిటివ్ వచ్చింది. దీంతో ముందుజాగ్రత్త చర్యగా రాణిని గురువారం బకింగ్‌హామ్ ప్యాలెస్ నుంచి విన్సర్ కోటకు తరలించారు. బ్రిటన్‌లో కరోనా కారణంగా ఇప్పటి వరకు 233 మంది చనిపోయారు. మొత్తం 5,067 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

## నోట్లను తాకితే చేతులు కడుక్కోండి: ఐబీఏ

ముంబై, మార్చి 22 : కరోనా మహమ్మారి నేపథ్యంలో కరెన్సీ నోట్లను తాకిన తర్వాత చేతులను కనీసం 20 సెకండ్ల పాటు శుభ్రం చేసుకోవాలని ప్రజలకు భారతీయ బ్యాంకుల సంఘం (ఐబీఏ) విజ్ఞప్తి చేసింది. లావాదేవీలు చేయడానికి ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ వంటి చానళ్లను ఉపయోగించుకోవాలని, నగదు చెల్లింపులకు బదులు క్రెడిట్ లేదా డెబిట్ కార్డుతో చెల్లింపులు చేయాలని, అలాగే బ్యాంకు శాఖలను సందర్శించడం మానుకోవాలని ఐబీఏ సూచించింది.

## తప్పుడు వార్తలను తొలగించండి: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 22 : కరోనా వైరస్ గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తిచేసే వార్తలను వెంటనే తొలగించాలని సోషల్ మీడియా కంపెనీలను కేంద్ర సమాచార మంత్రిత్వశాఖ ఆదేశించింది. ప్రజల్లో భయాందోళనలను సృష్టించే, ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసే తప్పుడు సమాచారాన్ని పోస్టు చేయకూడదని యూజర్లకు తెలియజేయాలని ఓ ప్రకటనలో ఆ శాఖ విజ్ఞప్తి చేసింది.

### కరోనాకు ఆస్పత్రులు కేటాయించాలి

న్యూఢిల్లీ, మార్చి 22: కరోనా రోగులకు చికిత్స అందించేందుకు రాష్ట్రాల్లో ప్రత్యేకంగా కొన్ని ఆస్పత్రులు కేటాయించాలని కేంద్ర ఆరోగ్య శాఖ సూచించింది. ఆదివారం భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) సంచాలకుడు బలరాం భార్గవ విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతానికి కరోనా వైరస్ గొలుసు తెంపేందుకు లాక్‌డౌన్ అత్యవసరమన్నారు. ప్రతి రాష్ట్రం కరోనా రోగులకు ప్రత్యేకంగా ఆస్పత్రులను కేటాయించాలని స్పష్టం చేశారు.

## నట్టింట్లో... 'నెట్'ఇంట్లో!

» ఆదివారం మూడింతలు పెరిగిన నెట్ వినియోగం

హైదరాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జనతా కర్ఫ్యూ కారణంగా ఆదివారం ఇండియాలో ఇంటర్‌నెట్ వినియోగం మూడింతలు పెరిగిందని ఓ అంతర్జాతీయ ఐటీ సంస్థ అధ్యయనంలో తేలింది. ప్రపంచవ్యాప్తంగా సెకనుకు సగటున 65-70 వేల జీబీ డేటా వినియోగిస్తుండగా అది ఆదివారం రికార్డు స్థాయిలో 89,268 జీబీలుగా నమోదైందని తెలిపింది. ప్రపంచం మొత్తం ఇంటర్‌నెట్ వినియోగంలో భారత్ వాటా 9 శాతంగా ఉంది. ఆదివారం ఇది 23 శాతానికి చేరిందని ఆ సంస్థ వెల్లడించింది. ఆ సంస్థ అధ్యయనం ప్రకారం ఆదివారం అత్యధికులు యూట్యూబ్‌ను వీక్షించారు.

## ఆఫ్రికా గొరిల్లాలకూ కరోనా ముప్పు



కంపాలా, మార్చి 22 : ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా మహమ్మారితో ఆఫ్రికా పర్వతప్రాంత గొరిల్లాలకూ ముప్పు పొంచి ఉందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీంతో కాంగోలోని విరుంగ జాతీయ పార్కు జూన్ 1 వరకు పర్యాటకుల సందర్శనను నిషేధించనుంది. కాంగో పొరుగు దేశమైన రువాండా కూడా పర్యాటకం, మూడు జాతీయ పార్కుల్లోని పరిశోధక కార్యకలాపాలను మూసివేయనుంది. పర్వత ప్రాంత గొరిల్లాలు ఊపిరితిత్తుల వ్యాధులకు త్వరగా గురవుతాయని, సాధారణ జలుబు సైతం గొరిల్లాను చంపగలదని వరల్డ్‌వైడ్ ఫండ్ ఫర్ నేచర్ అనే స్వచ్ఛంద సంస్థ తెలిపింది.

## కాంగ్రెస్ నేత జితిన్ ప్రసాదకు నెగెటివ్

లఖ్‌నవూ, మార్చి 22: ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ సీనియర్ నేత జితిన్ ప్రసాదకు కరోనా పరీక్షలో నెగెటివ్‌గా తేలింది. బాలీవుడ్ గాయని కనికా కపూర్ ఇచ్చిన విందుకు ఆయన హాజరైన సంగతి తెలిసిందే. కనికాకు కరోనా పాజిటివ్‌గా తేలడంతో జితిన్ కూడా పరీక్షలు చేయించుకున్నారు. రాబోయే 14 రోజులు తాను స్వీయ నిర్బంధంలో ఉంటానని ప్రసాద వెల్లడించారు. మరోవైపు కాన్పూర్‌లో జరిగిన వేడుకలో కనికను కలిసిన 56 మందిలో 11 మందికి కరోనా నెగెటివ్ వచ్చినట్టు అధికారులు తెలిపారు. మిగిలినవారి పరీక్షల ఫలితాలు రావాల్సి ఉందని చెప్పారు. ఇక కనిక నివాసం సమీపంలోని 22 వేల మందికి కనీసం 48 గంటల పాటు ఇళ్లలోనే ఉండాలనిఅధికారులు సూచించారు. ఈనెల 14 నుంచి 16 వరకు కనిక ఓ స్టార్ హోటల్‌లో బస చేసింది. అక్కడే దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు సభ్యులు కూడా ఉన్నారు. ఆమె వారిని కలిసిందా అన్న విషయమై సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

## కేరళలో క్రిమిసంహారక ద్రావణం పిచికారీ

తిరువనంతపురం, మార్చి 22: కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు కేరళ రాష్ట్రం మొత్తం స్వీయ నిర్బంధంలోకి వెళ్లింది. ఆ రాష్ట్ర అగ్నిమాపక, సహాయక సిబ్బంది ఆరోగ్య శాఖతో కలిసి కరోనాపై పోరు ప్రకటించారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా క్రిమిసంహారక మందులను పిచికారీ చేశారు. జనతా కర్ఫ్యూ నేపథ్యంలో రాష్ట్ర ప్రజలంతా ఇళ్లకే పరిమితమయ్యారు.

## కరోనా టీకాకు చైనాలో క్లినికల్ ట్రయల్స్

» తొలిదశలో వూహాన్‌కు చెందిన 108 మందిపై పరీక్షలు

బీజింగ్, మార్చి 22: కరోనా టీకాకు సంబంధించి చైనా తొలి దశ క్లినికల్ ట్రయల్‌ను ప్రారంభించింది. ఈ నెల 16న మొదటి ట్రయల్ జరిగిందని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా 18-60 ఏళ్ల వయస్సున్న 108 మందిని మూడు బృందాలుగా విభజించి భిన్నమైన డోసులు ఇచ్చారు. వీరంతా వూహాన్‌కు చెందినవారే. అయితే అమెరికా కూడా "18 నెలల్లో టీకాను కనుగొంటాం" అని ఈ నెల 16నే ప్రకటన చేయడం గమనార్హం.

## లాక్‌డౌన్‌లతో ఓడించలేం : డబ్ల్యూహెచ్‌వో

లండన్, మార్చి 22 : కేవలం లాక్‌డౌన్‌లతో కరోనాను ఓడించలేమని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) స్పష్టంచేసింది. ప్రజారోగ్య చర్యలను పకడ్బందీగా అమలు చేయకుండా లాక్‌డౌన్‌లతో సరిపెడితే కరోనాకు కళ్లెం వేయలేమని డబ్ల్యూహెచ్‌వో ఎమర్జెన్సీ నిపుణుడు మైక్ ర్యాన్ హెచ్చరించారు. అస్వస్థతకు గురైన వారిలో కరోనా బాధితులు ఎవరైనా ఉన్నారా? అనే వివరాలను గుర్తించి.. అటువంటి వారిని ఐసోలేషన్ వార్డులకు పరిమితం చేయడంపై దృష్టిసారించాలని ప్రపంచ దేశాలకు సూచించారు. కరోనా పాజిటివ్ కేసుల కుటుంబీకులు, సన్నిహితులు, బంధువులకు ఎవరికైనా వైరస్ సోకిందా? అనేది తెలుసుకొని వారికీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడాన్ని తక్షణ కర్తవ్యంగా భావించాలన్నారు. ఇవన్నీ చేయకుండా లాక్‌డౌన్‌లతో సరిపెట్టాలనుకుంటే.. ఆ ఆంక్షలను ఎత్తివేసిన మరుక్షణం నుంచే కరోనా పంజా విసరడం ప్రారంభిస్తుందని పేర్కొన్నారు.



కోల్‌కతాలో జన సంచారం లేని రోడ్లు

# కరోనాకు మరో ముగ్గురు బలి

» దేశంలో ఏడుకు చేరిన కరోనా మృతులు

» 396కి చేరిన పాజిటివ్ కేసులు

న్యూఢిల్లీ, మార్చి 22: దేశంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 396కి చేరింది. రికార్డు స్థాయిలో ఒకేరోజు 81 మందికి పాజిటివ్ వచ్చింది. మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో దేశంలో కరోనా కారణంగా మరణించినవారి సంఖ్య ఏడుకు చేరింది. వారిలో ఇద్దరు మహారాష్ట్రవాసులే. వైరస్ బారిన పడిన 63 ఏళ్ల వృద్ధుడు ముంబైలో మరణించాడు. ఇంతవరకూ దేశంలో అత్యధికంగా 74 కరోనా పాజిటివ్ కేసులు మహారాష్ట్రలో నమోదయ్యాయి. ఒక్క ఆదివారం నాడే 10 మందికి వైరస్ పాజిటివ్ వచ్చింది. అందులో ఆరుగురు ముంబైవాసులు కాగా.. నలుగురు పుణె వాసులు. పుణెలో వైరస్ బారినపడ్డ మహిళ (41) కుటుంబంలో నలుగురికి ఆమె నుంచి వైరస్ సోకింది. విదేశాలకు వెళ్లొచ్చినవారి ద్వారా ఆమెకు వైరస్ సోకడం గమనార్హం. గుజరాత్‌లో తొలి కరోనా మరణం నమోదైంది. సూరత్‌కు చెందిన 67 ఏళ్ల వృద్ధుడు వైరస్ బారినపడి మృతి చెందినట్టు అధికారులు తెలిపారు. ఆ రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 18కి చేరింది. ఇప్పటిదాకా రెండు పాజిటివ్ కేసులు మాత్రమే నమోదైన బిహార్‌లో ఒకరు (38) మరణించారు. ఖతర్ నుంచి వచ్చిన ఆ వ్యక్తి నమూనాలను శుక్రవారంనాడు వైద్యపరీక్షకు పంపారు. శనివారం రాత్రి అతడు చనిపోగా.. వైద్యపరీక్ష ఫలితాలు ఆదివారం వచ్చాయి. అతడికి వైరస్ సోకినట్టు అందులో తేలింది. తమిళనాడులో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య ఏడుకు చేరింది. భోపాల్‌లో కూడా.. ఇటీవలే లండన్ నుంచి వచ్చిన ఒక విద్యార్థిని వైరస్ బారిన పడింది. యూపీలో కరోనా బారిన పడిన భారత సంతతి కెనడా మహిళకు పూర్తిగా నయమైంది. ఆ రాష్ట్రంలో ఇప్పటిదాకా వైరస్ బారిన పడిన వారి సంఖ్య 25. కేరళలో 52, ఢిల్లీలో 27, రాజస్థాన్‌లో 24, కర్ణాటకలో 21, హరియాణాలో 17, పంజాబ్‌లో 13, లద్దాఖ్‌లో 13 కేసులు నమోదయ్యాయి.



చప్పట్లతో వైద్యులను అభినందిస్తున్న రాష్ట్రపతి

## 'జనతా కర్ఫ్యూ' తొలి అడుగు: మోదీ

న్యూఢిల్లీ, మార్చి 22: కరోనాపై పోరాటంలో ప్రజలు విలువైన సైనికులని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వైరస్ విషయంలో అప్రమత్తత లక్షల ప్రాణాలను కాపాడుతుందని పేర్కొన్నారు. కరోనాపై సుదీర్ఘ సమరంలో 'జనతా కర్ఫ్యూ'ను తొలి అడుగుగా ఆయన అభివర్ణించారు. ఇందుకు సహకరించినందుకు దేశ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ట్విటర్‌లో స్పందించారు. 'ఏకతాటి పైకి రావడం ద్వారా ఎంతటి సవాలునైనా ఓడించవచ్చని దేశ ప్రజలు నిరూపించారు. జనతా కర్ఫ్యూ ఈ రాత్రి 9 గంటలకు ముగియవచ్చు. అంతమాత్రాన సంబరాలు మొదలుపెట్టాలని కాదు. స్వయంగా నిర్దేశించుకున్న కర్ఫ్యూను విజయంగా చూడలేం' అని అన్నారు. 'జనతా కర్ఫ్యూ' నేపథ్యంలో ఆదివారం టీవీ చూస్తూ మంచి ఆహారం తీసుకుంటూ కావాల్సినంత సమయం కుటుంబంతో గడిపే వీలు ప్రజలకు లభించిందని మోదీ అన్నారు. కరోనా వ్యాపించకుండా డిజిటల్ చెల్లింపులను ఎంచుకోవాల్సిందిగా సూచించారు.

## జలుబు, జ్వరం వాటంతటవే తగ్గిపోతాయి: ఐసీఎంఆర్

కరోనా సోకినా.. భయపెట్టే లక్షణాలేవీ కనిపించవని భారత వైద్యపరిశోధనా మండలి (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ బలరాం భార్గవ అంటున్నారు. కరోనా బారినపడే వారిలో 80 శాతం మందికి కొద్దిపాటి జలుబుతో కూడిన జ్వరం వచ్చి దానంతటదే తగ్గిపోతుందని తెలిపారు. మిగతా 20 శాతం మంది ఆరోగ్యం మాత్రం ఆస్పత్రిలో చేర్పించేంతగా విషమించే పరిస్థితి ఏర్పడవచ్చన్నారు. అలా చేరేవారిలో 5శాతం మందికి సకాలంలో తగిన చికిత్స అందుతున్నట్లు వెల్లడించారు.

## కరోనా 'లాక్ డౌన్ల'తో.. గాలిలో నాణ్యత మెరుగు

కరోనా కట్టడి కోసం ప్రపంచదేశాలు ప్రకటిస్తున్న లాక్‌డౌన్లు, జనతా కర్ఫ్యూలతో గాలి నాణ్యత పెరుగుతోందని ఇటీవల నిర్వహించిన పలు పరిశోధనల్లో వెల్లడైంది. వాహన కాలుష్యం తగ్గడం, పరిశ్రమల కూతకు తాత్కాలిక బ్రేకులు పడటం, విద్యుత్తు డిమాండ్ పడిపోవడం, థర్మల్ విద్యుత్తు ప్లాంట్లను ఆపివేయడం ఇందుకు ప్రధాన కారణాలని ఆ అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ కారణంగా చైనాలో వాతావరణ కాలుష్యం 25% దాకా తగ్గిపోగా.. ఇతర దేశాల్లోనూ కర్బన ఉద్గారాలు తగ్గాయని పేర్కొన్నాయి. కాలుష్య కల్లోలిత ప్రాంతాల్లో ఒకటైన దేశ రాజధాని ఢిల్లీలో పీఎం-25 స్థాయి నిత్యం 300-500 మధ్యలో ఉంటుంది. కరోనా లాక్‌డౌన్‌లతో అది ఒక్కసారిగా 129కి పడిపోయింది.

## తెలంగాణలో ఒక్కరోజే ఆరు కేసులు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

తెలంగాణలో కరోనా పాజిటివ్ కేసులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఆదివారం ఒక్కరోజే మరో ఆరు కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 27కు చేరింది. కొత్తగా నమోదైన ఆరు కేసుల్లో ఒకటి లోకల్ కాంటాక్టు కావడం ఆందోళనకు గురి చేస్తోంది. దుబాయ్ వెళ్లి వచ్చిన సికింద్రాబాద్ వ్యాపారి భార్య (50)కు కూడా కరోనా సోకింది. అయితే ఆమె కూడా దుబాయ్‌కి వెళ్లి వచ్చినట్లు వైద్య ఆరోగ్య వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే వీరి కుమారుడికి పాజిటివ్‌గా వచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో తొలిసారి కరోనా లోకల్ కాంటాక్టు అయిన వ్యక్తి ఇతడే. ఇక మిగిలిన కేసుల విషయానికి వస్తే.. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన ఓ యువకుడు (21) లండన్ నుంచి దుబాయ్ మీదుగా హైదరాబాద్ వచ్చాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా.. కరోనా పాజిటివ్ వచ్చింది. తెలంగాణకు చెందిన మరో వ్యక్తి(23) కూడా లండన్ నుంచి దుబాయ్ మీదుగా హైదరాబాద్ చేరుకోగా అతనికీ కరోనా సోకినట్లు తేలింది. మరో పాజిటివ్ కేసును ఏపీలోని రాజోలుకు చెందిన ఐటీ విద్యార్థి(26)గా గుర్తించారు. స్వీడన్ నుంచే ఈ నెల 14న వచ్చిన రంగారెడ్డి జిల్లా మణికొండకు చెందిన మరో వ్యక్తి(34)కి కూడా కరోనా సోకింది. కాగా, లండన్ నుంచి ఈ నెల 18న వచ్చిన భద్రాద్రి కొత్తగూడేనికి చెందిన యువకుడి(23)కీ కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఈ కేసుల పట్ల వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కాగా తెలంగాణలో మరో 8 మందికి కరోనా లక్షణాలున్నట్లు అనుమానిస్తున్నారు. వీరిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. వారిలో ఆరుగురు దుబాయ్ నుంచి వచ్చినవారే.

## మృత్యు పాచిక?

(మొదటి పేజీ తరువాయి)

ప్రముఖ రసాయన, సాంకేతిక పరిశ్రమల్లో అమెరికా, యూరప్‌కు చెందినవారి పెట్టుబడులే అధికంగా ఉండేవి. దీంతో ఆయా కంపెనీల లాభాల్లో సగానికి పైగా వారికే వెళ్లేవి. ఫలితంగా చైనా ఆర్థిక వ్యవస్థకు నష్టం జరిగేది. ఈ గ్లోబల్ ఎకానమీలో ఎవరినీ తమ దేశం నుంచి వెళ్లగొట్టలేని పరిస్థితి. అందుకే చైనా పొగబెట్టాలనుకుంది. కేవలం వూహాన్‌కే పరిమితమయ్యేలా వైరస్‌ను సృష్టించింది. కానీ తాము ఆ వైరస్‌ను నియంత్రించలేమని ప్రకటించింది. ఓ పిశాచంతో యుద్ధం చేస్తున్నామంటూ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చేసిన వ్యాఖ్యలు అక్కడి పారిశ్రామిక రంగంపై అనుమానాలను పెంచాయి. దీంతో విదేశీ పెట్టుబడిదారులు వాటాలను అమ్ముకొని చైనా నుంచి బయటకు వచ్చేశారు. ఫలితంగా రెండు రోజుల్లోనే చైనా ఆర్థిక వ్యవస్థలో రూ.1.50లక్షల కోట్ల సంపద వచ్చి చేరింది. తద్వారా చైనా వైరస్ పాచిక పారింది.

### టీకాను చైనా ముందే తయారు చేసిందా..?

కరోనా వైరస్‌కు టీకాను చైనా ముందే తయారు చేసిందేమోనన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. దీనికి విశ్లేషకులు చైనాలో కరోనా పాజిటివ్ కేసులు, రికవరీ కేసుల సంఖ్యను సాక్ష్యాలుగా చూపిస్తున్నారు. వైరస్ వ్యాప్తి ప్రారంభమైన చైనాలో ఇప్పటి వరకు మొత్తం 81వేలకు పైగా కరోనా కేసులు నమోదైతే అందులో 72,440 కేసులు రికవరీ అయ్యాయి. ఇటలీలో మొత్తం 53 వేలకు పైగా పాజిటివ్ కేసులు నమోదు అయితే 6,072 కేసులే రికవరీ అయ్యాయి. వైరస్ ప్రారంభమైన చైనాలోనే భారీ సంఖ్యలో కేసులు రికవరీ కావడం చూస్తుంటే ఆదేశం ఇప్పటికే టీకాను కనుగొని ఉండవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. అందుకే చైనాలో కొత్తగా కేసులు నమోదు కావడం లేదని చెబుతున్నారు.

### కరోనా అమెరికా కుట్రనే : ఇరాన్

దుబాయ్, మార్చి 22: కరోనాపై యుద్ధంలో భాగంగా అమెరికా ప్రకటించిన వైద్య సాయాన్ని ఇరాన్ తిరస్కరించింది. వైరస్ పుట్టుక వెనుక అమెరికా కుట్ర ఉందన్న చైనా వాదనను సమర్థించింది. పర్షియన్ల కొత్త సంవత్సరం నౌరుజ్ సందర్భంగా ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ఆదివారం ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో వైరస్‌ను మరింత వ్యాపింపజేయడానికే అమెరికా వైద్య సాయం ప్రకటించి ఉండొచ్చన్నారు.

### చైనా రహస్యంగా ఉంచింది: ట్రంప్

వాషింగ్టన్, మార్చి 22: చైనాలో కరోనా వైరస్ ప్రబలిన సమాచారాన్ని చెప్పకుండా ఆ దేశం చాలా రహస్యంగా వ్యవహరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. ముంచుకొస్తున్న ముప్పు గురించి చైనా ముందుగా హెచ్చరించి ఉంటే అమెరికా, ఇతర దేశాలు మరింత జాగ్రత్తపడేవన్నారు.

### కావాలనే మాపై నిందలు: చైనా

బీజింగ్, మార్చి 22: అమెరికానే చైనాకు కరోనా వైరస్‌ను తీసుకొచ్చి ఇప్పుడు తమ పైనే నిందలు వేస్తున్నారని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి జెంగ్ సువాంగ్ ఆరోపించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణలో చైనా చేస్తున్న కృషిని, చైనా ప్రజల త్యాగాలను తక్కువ చేయడమేనని అన్నారు.

# 3 లక్షలు దాటిన కరోనా కేసులు

## మరణాల సంఖ్య 13 వేలకు పైనే.. ఇటలీలో ఆగని మరణ మృదంగం

» ఇటలీలో ఒక్కరోజే 651 మరణాలు

వాషింగ్టన్/రోమ్/పారిస్:, మార్చి 22: ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య మూడు లక్షలకు మించిపోయింది. మరణించినవారి సంఖ్య 13 వేలు దాటింది. 35 దేశాలు 'లాక్‌డౌన్' అయ్యాయి. ఇటలీలో మృతుల సంఖ్య 5,500కు చేరింది. ఆదివారం ఒక్కరోజే 651 మంది చనిపోయారు. ఫ్రాన్స్‌లో మరణాల సంఖ్య 562 దాటింది. పారిస్ ఆస్పత్రిలో ఎమర్జెన్సీ విభాగం వైద్యుడు (67) ఒకరు కరోనాతో మరణించారు. స్పెయిన్‌లో కొత్తగా 394మరణాలు నమోదయ్యాయి. మొత్తం మరణాల సంఖ్య 1,720కు పెరిగింది. రాబోయే గడ్డు రోజులను ఎదుర్కోవడానికి సిద్ధపడాలని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ ప్రజలను కోరారు. రష్యా తన వైరస్ నిపుణులను, వైద్య సిబ్బందిని ఇటలీ పంపింది. బ్రిటన్‌లో కరోనా ముప్పు ఎక్కువగా ఉందని గుర్తించిన 15 లక్షల మందిని కనీసం మూడు నెలల పాటు ఇళ్ల వద్దే ఉండాలని ప్రభుత్వం సూచించింది. ఇటలీలో మాదిరిగానే బ్రిటన్‌లోనూ కరోనా విస్తరిస్తోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికాలో సైతం లక్షలాది మంది గడప దాటి బయటకురాలేదు. న్యూజెర్సీ కూడా ప్రజలను ఇళ్లలోనే ఉండాలని కోరింది. న్యూయార్క్ సిటీ జైళ్లలో 38 మందికి కరోనా సోకింది. ఒక్క రోజులో కొత్తగా 7 వేల కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం కేసుల సంఖ్య 26,574కు పెరిగింది. నాలుగు రోజుల తర్వాత ఆదివారం చైనాలో స్థానికంగా సోకిన తొలి కరోనా కేసు నమోదయింది. కొత్తగా ఆరు మరణాలు సంభవించడంతో మృతుల సంఖ్య 3,261 చేరింది. థాయ్‌లాండ్‌లో కేసుల సంఖ్య 600కు పెరిగింది. ఆఫ్రికాలో వెయ్యి మందికి పైగా కరోనా సోకింది. ఇరాన్‌లో కరోనా కాటుకు మరో 129 మంది బలయ్యారు. దీంతో మృతుల సంఖ్య 1,685కు చేరింది. శ్రీలంకలో కర్ఫ్యూను ఉల్లంఘించినందుకు 340 మందిని అరెస్టు చేశారు. పాకిస్థాన్‌లో పూర్తి స్థాయి లాక్‌డౌన్ ప్రకటించబోమని దేశ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. ప్రజలను ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ఫ్రాన్స్ ఆంక్షలు విధించింది. నిషేధాజ్ఞల పర్యవేక్షణకు హెలికాప్టర్లు, డ్రోన్లను వినియోగిస్తోంది.



ఇటలీ నుంచి వచ్చిన భారతీయులకు స్క్రీనింగ్

## వారంతా క్వారంటైన్‌కు..

ఇటలీ నుంచి భారతదేశానికి ఆదివారం తీసుకువచ్చిన 263 మంది భారతీయులను ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఢిల్లీలోని ఐటీబీపీ క్వారంటైన్‌కు తరలించారు. ఇప్పటికే ఆ క్వారంటైన్‌లో ఇటలీ నుంచి తీసుకొచ్చిన 215 మంది భారతీయులున్నారు. కాగా.. ఆదివారం భోపాల్ విమానాశ్రయానికి ఢిల్లీ నుంచి వచ్చిన ఒక ప్రయాణికురాలికి ఫ్లూ లక్షణాలు కనపడడంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి పుణెకు వెళ్లాల్సిన విమానాన్ని గంటపాటు అక్కడే నిలిపేశారు. విమానంలో ఉన్న 44 మంది ప్రయాణికులను శానిటైజ్ చేసి, థర్మల్ స్క్రీనింగ్ నిర్వహించి టేకాఫ్‌కు అనుమతిచ్చారు. కాగా.. హోం క్వారంటైన్‌లో ఉండాల్సిందిగా సూచించిన వ్యక్తులు ఉన్న ఇళ్లను మార్కింగ్ చేయాలని ఢిల్లీ సర్కారు నిర్ణయించింది. ఆ ఇళ్లలో ఉన్నవారిని చిన్నచూపు చూడొద్దని.. వారి పట్ల సానుభూతితో వ్యవహరించాలని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రజలకు సూచించారు. ఇతరులు జాగ్రత్తగా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన వివరించారు.

## హైకమిషన్‌లోనే భారతీయ విద్యార్థులకు ఆశ్రయం

లండన్: భారతీయ విద్యార్థుల బృందం లండన్‌లోని ఇండియన్ హైకమిషన్ భవనం ఆవరణలోనే ఆశ్రయం పొందుతోంది. 19 మంది ఉన్న ఈ బృందంలో ఎక్కువ మంది తెలంగాణ విద్యార్థులు ఉన్నారు. ఈ నెలాఖరు వరకు యూకే, యూరప్ నుంచి ప్రయాణికులను అనుమతించబోమని భారత్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రవాస భారతీయుల సాయంతో వసతి కల్పించినా అక్కడకు వెళ్లడానికి విద్యార్థులు ఒప్పుకోలేదు.

# వీఐపీ అన్న అహం పనికిరాదు

## కరోనా ముందు ఇవేమీ చెల్లవ్!



కరోనా వైరస్ మనకు చాలా పాఠాలు నేర్పుతోంది. జనతా కర్ఫ్యూ కులం, మతం, పేద, గొప్ప, సెలబ్రిటీ అనే తేడా లేకుండా దేశం మొత్తాన్ని ఒక్క మాటపై నిలబెట్టింది. ఒక్క బాటలో నడిపింది. ఈ వైరస్ ప్రపంచం మొత్తాన్ని వణికిస్తూ, మానవ జాతికి అత్యంత ప్రమాదకర పరిస్థితులను కల్పిస్తున్నా కొందరిలో వీఐపీ అనే అహం చావడంలేదు. కానీ కరోనా వద్ద అవన్నీ చెల్లవు. దానికి ఎవరైనా ఒక్కటే. విదేశాల నుంచి వచ్చినప్పటికీ అటు ప్రభుత్వ, ఇటు స్వీయ క్వారంటైన్, సామాజిక దూరం వంటి జాగ్రత్తలను పాటించాలన్న జ్ఞానంలేకుండా కొందరు వీఐపీలు ప్రవర్తిస్తున్నారు. దాంతో వారు వైరస్ వ్యాప్తికి కారకులవుతున్నారు. అయితే అందరినీ అలా అనలేం. కొందరు వీఐపీలు నియమనిబంధనలు పాటిస్తూ, స్వీయ నిర్బంధంలో ఉంటున్నారు. ఇటీవల ప్రముఖ బాలీవుడ్ గాయని కనికా కపూర్ లండన్ నుంచి వచ్చారు. ఆమె స్వీయ క్వారంటైన్ పాటించలేదు. వీఐపీలు పాల్గొనే ఒక పార్టీలో కూడా పాల్గొన్నారు. ఆ తరువాత ఆమెకు కరోనా పాజిటివ్‌గా తేలింది. లక్నో ఆస్పత్రిలో చేరిన తరువాత కూడా ఆమెకు సెలబ్రిటీ అన్న జాడ్యం వదలలేదు. ఆస్పత్రిలో తనకు సరైన సౌకర్యాలు లేవని, సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. సదరు గాయని ఓ స్టార్‌లా కాకుండా కరోనా పేషెంట్‌లా ప్రవర్తించడం నేర్చుకోవాలని ఆ ఆస్పత్రి వైద్యులు సూచించారు. ఆమెకు ఉత్తమమైన సౌకర్యాలు కల్పించామని, బెడ్, టెలివిజన్, టాయిలెట్‌తో ఉన్న ఓ ఐసోలేటెడ్ రూమ్ కేటాయించి గ్లూటెన్ ఫ్రీ డైట్‌ను అందిస్తున్నామని తెలిపారు. ఇలాంటి వీఐపీలు తమ ధోరణిని మార్చుకోవలసిన అవసరం ఉంది. అయితే వీఐపీలలో అనేక మంది సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

epaper.andhrajyothy.com